


ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

వెల 4 అణాలు ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY 24-5-1

★ త్రివేంద్రంలో సర్దార్ పటేల్ ★



భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ గారు యీ నెల 12 న కొచ్చిన్ వచ్చినప్పుడు వారికి కొచ్చిన్ తిరువాన్కూర్ యూనియన్ రాజప్రముఖ్, కొచ్చిన్ మహారాజా ఘనస్వాగత మొసంగారు.



త్రివేంద్రం విశ్వవిద్యాలయంలోని మైదానంమీద జరిగిన బహిరంగసభలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రసంగం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0

విడిపత్రిక
4 అణాలు

ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరులేయవి యొనరించిన నరవర, యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్
(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO


సంపుటము **42**

సంచిక **38**

వికృతి సంవత్సర జ్యేష్ఠ శుద్ధ సప్తమి బుధవారము



అమెరికన్ షైలీసర్కస్ విదూషకుని హాస్యానికి ఆంగ్ల బాలబాలికలు ఆనందిస్తున్న దృశ్యం



1950-వ సం॥ మే నెల 24-వ తేది బుధవారము

సర్దార్ పటేల్ సుభాషితములు

వివిధప్రాంతములను ఏకముచేసి ఐక్యభారత దేశాన్ని నిర్మించడమే తన జీవితాశయ మని సర్దార్ వల్లభాయ్ పటేల్ మరొక పర్యాయం ఉద్ఘాటించారు. తమ జీవితాశయసాధనకు వారు ఎలాంటి కార్యక్రమాన్ని అనుసరించడానికీ వెనుదీయరు. తిరువాన్కూరు-కొచిన్ సమాఖ్యలో ఉన్న నాలుగు రోజులూ వారు బహిరంగసభలలోనూ, కాంగ్రెస్ వాదుల సమావేశాల్లోనూ ఈ విషయాన్నే వెల్లడిస్తూ వచ్చారు.

వారి సందేశములో నవ్యత ఏమీ లేకపోయినా పరిస్థితులు మూడుసంవత్సరాల క్రితం ఎలావున్నవో, ఇప్పుడూ అలాగే ఉన్నందువల్ల వారి సలహా సమయోచితంగానే ఉంటున్నది. అది చర్వితచర్వణం అయినా దోషంగా లేదు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ, భాషారాష్ట్రాల నిర్మాణమునుగురించి సర్దార్ పటేల్ చేసిన హెచ్చరికలు గమనింపతగ్గవే. వారి సలహాలు శిరసా వహింపతగ్గవే. కాని వారు రోగనిదానము చేయక కేవలము చికిత్సకుమాత్రమే ప్రాధాన్య మిచ్చుట వలన సామాన్యముగ వారి ఆదేశములకు ఉండవలసిన శక్తి ఔచిత్యము లేకుండపోయెను.

కాంగ్రెస్‌లో స్పర్థలు పెరిగి కాంగ్రెస్‌వాదులలో క్రమశిక్షణ తగ్గిపోవుటకు కారణము లేవో, భాషారాష్ట్రాలు తక్షణము ఏర్పడవలె నను ఆందోళన తీవ్రతర మగుటకు గల కారణము లేవో సర్దార్ పటేల్ గాని, కాంగ్రెస్ అధిష్ఠానవర్గముగాని సంపూర్ణముగా గ్రహించినట్లుకన్పించదు. కనుకనె సర్దార్ పటేల్ భాషా రాష్ట్రముల నిర్మాణమునకు ఇది అదను గాదనుటయు, కాంగ్రెస్ సేవకులు తమ విధ్యుక్తధర్మములను నిర్వర్తించిన నాయకులు దారికి రాగల రనియు చెప్పుట జరిగినది.

కాంగ్రెస్‌నాయకులలో స్పర్థలు పెరిగిపోయి కాంగ్రెస్‌లో— ప్రతిప్రాంతమునందూ —ప్రత్యేక పక్షములు ఏర్పడుటవలన ప్రజలు, ప్రజాసేవకులు కూడ కాంగ్రెస్‌కు దూరమగుచున్నారు. కాంగ్రెస్ వాదులలో స్పర్థలు పెరుగుటకు నేటి పార్లమెంటరీ రాజకీయములే కారణము. దాదాపు ప్రతిరాష్ట్రము నందూ ప్రభుత్వములోఉన్న కాంగ్రెస్‌వాదులు ఒక పక్షమూ, ఇతరులు వేరొకపక్షముగ నుండుట జరుగుచున్నది. అధికారమునందున్నవారు ప్రభుత్వవ్యవహారములను చూచుచుండ ఇతరులు ప్రభుత్వచర్యలను విమర్శించుచు ప్రజలలో కాంగ్రెసుప్రభుత్వములపై ద్వేషభావమును కల్గించుచుండిరి. అట్లే అధికారములో నున్న కాంగ్రెసువారునూ ఇతరులను అలక్ష్యంచేసి వారిలో ప్రజలకు విశ్వాసము కలుగకుండచేయుచున్నారు. వీటన్నింటి ఫలితముగా ప్రజలకు కాంగ్రెసు నందు గౌరవముగాని, కాంగ్రెసువారిలో విశ్వాసము గాని లేకుండపోవుచున్నది.

కేంద్రపార్లమెంటరీబోర్డు ఇప్పటికంటె ఎక్కువ సమర్థతతో, అనుక్షణము వివిధప్రాంతములందు జరుగుచున్న సంఘటనలను గమనించి ఎప్పటికప్పుడు అజ్మాయిషీ చేస్తూ ఉండిన ఈ విషాదస్థితి ఏర్పడియుండెడిది

గాదు. కేంద్రపార్లమెంటరీ బోర్డువలెనే రాష్ట్రములందునూ పార్లమెంటరీ బోర్డులను స్థాపించి అటు రాష్ట్ర కాంగ్రెసుసంఘాల వ్యవహారాలనూ, ఇటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలనూ పరిశీలిస్తూ రెండు దృక్పథాలనూ సమన్వయపరచిన నేటి పరిస్థితులు కొంతవరకు చక్కబడవచ్చును. అయితే అట్టి పార్లమెంటరీ బోర్డునందుండు సభ్యులు పక్షరాజకీయాలకు అతీతముగ నుండి కాంగ్రెసునందలి భిన్నదృక్పథములను సమన్వయము చేయుటకే ప్రయత్నించవలసియుండును.

భాషారాష్ట్రములవిషయంలోనూ కాంగ్రెస్ అధిష్ఠానవర్గము ఇట్టి నిర్మాణాత్మకమైన విధానాన్నే అనుసరించాలి. నిర్మాణాన్ని వాయిదా వేయడంవల్ల సమస్య పరిష్కారం కాకపోవుటేగాక, మరింత క్లిష్టమై అసంతృప్తి ప్రబలుచున్నదని కాంగ్రెసుఅధిష్ఠానవర్గమునకు తెలియకపోలేదు. థార్ కమిషన్ నివేదికపై అలాంటి అసంతృప్తి ప్రబలుటవల్లనే నాయకత్రయనివేదిక ఒకటి అవతరించింది. అది రాష్ట్రాల నిర్మాణానికి గాక యథాస్థితిని స్థిరపరచడానికి వినియోగం కావడంకూడా దక్షిణాదిన ప్రబలిన అసంతృప్తికి కారణం.

భాషారాష్ట్రాల నిర్మాణం ఉత్తరాదివారికి ఉపద్రవం అయితే ఈ అసంతృప్తి దేశానికి అంతటికీ కూడా ఉపద్రవం కాగలదని కాంగ్రెసు అధిష్ఠానవర్గమూ, కేంద్రప్రభుత్వమూ గ్రహించవలసియున్నది.

విధ్వంసకచర్యల నివారణ

గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కమ్యూనిస్టుముప్పును నిర్మూలించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నందుకు ఉత్తరప్రాంత డి. ఐ. జి. తన సంతృప్తిని వెల్లడించిన రోజునే విజయవాడకు అరవైమైళ్ల దూరంలో కృష్ణా - హైద్రాబాద్ సరిహద్దున ఉన్న నెమలి గ్రామంపై 30 మంది సాయుధబందిపోటుదారులు దాడి జరిపి ముగ్గురు గ్రామస్థులను హత్యచేసినట్లూ, గ్రామ పాఠశాలనూ, కొన్ని ఇండ్లనూ తగులబెట్టినట్లూ వార్తలు వచ్చెను. ఈ రెండుజిల్లాలలోనూ కమ్యూనిస్టు విధ్వంసకచర్యల ఉధృతం తగ్గి ఉండవచ్చును. కాని పశ్చిమగోదావరిజిల్లాలో ఈ విధ్వంసకచర్యలు తీవ్రమౌతున్నట్లు ఏలూరుసమీపంలో జరిగిన సంఘటన సూచిస్తున్నది. ఇందువల్ల ఆ జిల్లాలో కమ్యూనిస్టుచర్యలు ఉధృతమగుచున్నట్లు వెల్లడియగుటేగాక దేశములో ఇటీవల జరుగుచున్న రైలుప్రమాదములకు కమ్యూనిస్టులే కారణభూతులని ఋజువగుచున్నది. ఈ ప్రమాదములను నివారించుట గ్రామములపై జరుగుచున్న దాడులను ప్రతిఘటించుటంత సులభము గాదు.

రాకపోకల సౌకర్యములను విచ్ఛిన్నం చేయుటయే కమ్యూనిస్టుల విధానమైయున్న, వారా కార్యక్రమమును తీవ్రతరము చేయుచున్న, ఈ ముప్పును నిర్మూలించుట ఉత్తరప్రాంత పోలీసు డి. ఐ. జి. భావించినంత సులభముగాదు. దేశమునందలి రైలుమార్గమంతటిపై కాపలా యుంచుట సులభమూ గాదు; సాధ్యమూ దు. నేడు నాలుగు జిల్లాల్లో కొన్ని ప్రాంతములందు జరుగు దాడులను నివారించుటే సాధ్యము గాకున్నది. దాడి జరిగిన అనంతరముగాని పోలీసుదళములు సంఘటన జరిగిన ప్రాంతమును చేరలేకుండిరి. ప్రతి గ్రామమునందును పోలీసుసిబ్బందిని ఉంచుట సాధ్యము గాదని ప్రధానమంత్రి అనేకపర్యాయములు ప్రకటించిరి.

అంతేగాక ఇటీవల కొన్నిప్రాంతములనుండి వస్తున్న వార్తలనుబట్టి కమ్యూనిస్టులదాడికి గురియైన గ్రామాలు తిరిగి పోలీసుదాడికి గురియగుచున్నట్లు, ఈ సిబ్బంది హద్దు మీరి ప్రవర్తిస్తున్నట్లు, అందువలన ప్రజలు పోలీసుఅధికారులతో తగినంతగ సహకరించుట లేదని తెలియుచున్నది. కమ్యూనిస్టులు కన్పించనప్పుడు కన్పించినవారిపై చర్యలు తీసుకొనుట జరుగుచున్నట్లు కూడ కొందరు ఫిర్యాదు చేయుచున్నారు. ప్రభుత్వము ఇట్టి ఫిర్యాదులపై సమగ్రవిచారణ జరుపుట అవసరము.

కమ్యూనిస్టులను కొందరిని - వారు ప్రముఖులే కావచ్చును—సంహరించి కమ్యూనిస్టుముప్పు నిర్మూలనమైనదని భావించుటకు వీలులేదు. పోలీసు చర్యలు తీవ్రతరమైనంతమాత్రమున కమ్యూనిస్టు ముప్పు నిర్మూలనంకాదు. సైనికచర్యలతోబాటు కొంత రాజకీయప్రబోధము, ఆర్థిక అభివృద్ధిని సాధింపగల చర్యలూకూడ అవసరము. ఇటీవల పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కాంగ్రెసు నాయకులు ప్రచారకసంఘములుగ ఏర్పడి కమ్యూనిస్టుల ప్రస్తుతవిధానంవల్ల దేశానికి కల్గుచున్న అనర్థాలను ప్రజలకు తెలియజెప్పుచుండుటవలన కొంత ప్రయోజనము కల్గియుండవచ్చును.

కాని ఈ పర్యటనలో నాయకులు రాష్ట్రీయ సందలి కాంగ్రెస్‌రాజకీయములకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి ప్రచారం చేయుటకూడ జరుగుచున్నది. ఇందువలన ఈప్రచారమువలన లభింపవలసినంత ప్రయోజనము లభింపకపోవుచున్నది.

అధికారులు, కాంగ్రెస్‌వాదులుకూడ పరస్పరము సహకరించుకొనుచు ఒకరి కార్యక్రమమును మరొకరు సుకరము చేసుకొనుచు వర్గరాజకీయములను వదలి వ్యవహరించిన కమ్యూనిస్టుముప్పునిర్మూలనము అత్యంత సులభము కాగలదు.

విషయానుక్రమణిక

24 మే 1950

నేటి ప్రపంచం

"నన్నెవ్వ రాపలేరీవేళా, నాధాటి కోర్వలేరీవేళా" అనే నినాదం ప్రపంచం నలుదిశలా వ్యాపించింది. లండన్‌లో, సిడ్నీలో, మాస్కోలో, ఈ పల్లవి వినవచ్చింది. సిడ్నీలో కామన్వెల్త్ దేశాల సమావేశం ముగియగానే సింహళ ప్రతినిధి మహోత్సాహంతో, "ఆసియాఖండం పురోగమిస్తున్నది. మా గమనాన్ని నిరోధించి గిరిగియ్యగల సాహసం ఇంకెవరికీ లేదు" అన్నాడు. పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికాఖండవాసులందరూ ఈనాటికి ఏకలక్ష్యోన్ముఖులు కాగలుగుతున్నందుకు పాశ్చాత్య లోకమంతా పొంగిపోతోంది. కార్మికజనుల విప్లవకార్యక్రమాలు దినదినాభివృద్ధి చెందుతున్నందుకు, చీనాలో కమ్యూనిజం అఖండ విజయం సాధించినందుకు మేదినోత్సవ సంవత్సరంలో కమ్యూనిస్టునాయకులు జయజయ ధ్వానాలు చేశారు.

అయితే హర్షధ్వానాలు చెయ్యడానికి రష్యన్లకి అమెరికన్లకి హేతువు లున్నాయి. కాని సింహళప్రతినిధికి పశ్చిమయూరోపియన్ నాయకులికీ ఏమి హేతువు లున్నాయో తెలియదు.

సిడ్నీ సమావేశాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ ఒక విలేఖరి కొండతవ్వి ఎలుకను పట్టినట్లయిందన్నాడు. సిడ్నీ సమావేశం ఏమి సాధించిందో వివిధదేశాల ప్రతినిధులు తమతమ అభిప్రాయాలు ప్రకటించారు. బ్రిటిష్ ఆస్ట్రేలియన్ ప్రభుత్వాలకు హృదయ పరివర్తన కలిగిందని భారతప్రతినిధి రామస్వామి మొదలియార్ హర్షించారు. "సమకూడజాలని కోరికలనుంచి బుద్ధిని మరల్చుకోవడంలో ఇంత పోగ్గా మారిన మనిషిని మరెక్కడా చూడలేదు" అన్నాడు ఆస్ట్రేలియన్ ప్రతినిధి స్పెండర్‌నిగురించి బ్రిటిష్ ప్రతినిధి లార్డు మాక్డొనాల్డ్. ఇదంతా రభస ముగిసినవెనుక ఒకరికొకరు కోపతాపాలు తీర్చుకునే ఘట్టం. అసలు ఈ సమావేశం సాధించినవీ, సాధించలేకపోయినవీ ముందే నిర్ణయమై పోయినాయి. సాధించలేకపోయిన విషయాల్ని గమనిస్తే, భారతప్రభుత్వానికి తృప్తికరంగా ఉంటుంది, తలపెట్టిన విషయాలు అటువంటివి. కాబట్టి ఏ కొంచెం సాధించబడినా అంత సుముఖంగా చెప్పుకోదగినదై ఉండదు.

ఈ సమావేశాన్ని సిడ్నీలో జరపడానికి నిశ్చయించినప్పుడు ఈ క్రిందిలక్ష్యాలు చెప్పబడినాయి: కామన్వెల్తుకు చెందిన ఆసియా దేశాల్లోనూ, ఇతర దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల్లోనూ ఆర్థికావసరాల్ని తీర్చడానికి మార్గాన్వేషణ; ఏదైనా ఒక ఆర్థిక కార్యక్రమాన్ని అమలుజరపాలంటే ఎంత ఖర్చవుతుందో అంచనావెయ్యడం, ఆర్థిక సమస్యల్ని గురించి కామన్వెల్తు దేశాల్నీ ఇతర దక్షిణాసియా దేశాల్నీ వారివారి అభిప్రాయాలు అడిగి తెలుసుకోవడం, ఇలా తెలుసుకోగా తేలే ఖర్చు అంచనాలు ఆ దేశాలకీ ఆ రాజ్యకూటాలకీ (కామన్వెల్తుమాదిరి) తలమించినవైతే, ఇతర దేశాల సహాయాన్ని (బహుశా అమెరికానుంచి) ఎలా పొందడం.

ఈ సమస్యల్ని చర్చించడంలో మొత్తం ఏడు కామన్వెల్తు దేశాలమధ్యనూ ఏ రెండు దేశాలకీ ఏకాభిప్రాయం కుదరలేదు. ఆర్థిక సహాయమివ్వడంలో ఆట్టే ఆలస్యంచేస్తే, చివరికి సహాయమివ్వడానికి మలయా, ఇండోచీనా, ఇండోనీషియా, ఫిలిప్పైన్స్, కొరియా వంటిదేశాలు మిగలకుండా కమ్యూనిస్టుల పరమైపోతాయని ఆస్ట్రేలియన్ విదేశాంగమంత్రి స్పెండర్ బెంగపడ్డాడు. కిందటి జనవరిలో కొలంబోలో జరిగిన సమావేశంలోనే తాను తయారుచేసిన ఆర్థికసహాయకార్యక్రమాన్ని ఆమోదించాలని పట్టుబట్టాడు కాని పండిట్ నెహ్రూ మొదలైనవారప్పుడు ఒప్పుకోలేదు. కార్యక్రమం తయారుచెయ్యడానికి పట్టే ఆలస్యమే కాకుండా, అసలు అటువంటిది అవసరమనే విషయంపైన ఏకాభిప్రాయం కుదరడానికి చాలా వ్యవధిపట్టుతుందన్నారు. ఈ వ్యవధినిచ్చి ఇప్పుడు ప్రత్యేకం దీనికోసం సమావేశం జరపాలని సమావేశాన్ని స్పెండర్ తన దేశంలో జరపాలని ఆహ్వానించాడు.

లక్ష్యాలమీద ఏకాభిప్రాయం కుదరడం అసాధ్యమై పోయింది. ఒక పెద్దనిధి ఏర్పరిచి తక్షణకార్యక్రమం ఒకటే దీర్ఘకాలిక కార్యక్రమం ఒకటే అమలు జరపాలని ఆస్ట్రేలియన్ ప్రతినిధి సూచనలు చేశాడు. మలయా బర్మా పాకిస్తాన్ భారతదేశం వగైరా దక్షిణ, ఆగ్నేయ ఆసియా దేశాలన్నిటా వ్యవసాయపరిశ్రమాదుల అభివృద్ధికి ప్రవీణుల్ని పంపడానికి, ట్రాక్టరు వగైరా యంత్రాలు కొని పంపడానికి, పెట్టుబడి పెట్టడానికి ఈ కార్యక్రమాల్ని తయారు చేశారు. ఈ కార్యక్రమాలు సానుకూలపడాలంటే ఆ దేశాల్లో వర్తకవ్యాపారనిర్బంధాల్ని సడలించాలన్నారు. విదేశీ పెట్టుబడిదారులికి పెనుభూతాల్లాగ కనిపిస్తున్న కొన్ని శాసనాల్ని సడలించాలి. ఈ దేశాలమధ్యనూ, ఈ దేశాలతో పశ్చిమయూరప్, అమెరికా దేశాలమధ్యనూ వర్తకవ్యాపార బాంధవ్యాలకీ, పెట్టుబడిద్రవ్యప్రవాహానికీ వీలైన మార్గాలు సదుపాయాలు కలిగించవలసిఉంటుంది. ఈ దేశాల ముడివస్తువుల అమ్మకంతో పాశ్చాత్యదేశాల యంత్రపరికరాలు, పారిశ్రామికోత్పత్తి, ఆయుధసామగ్రి వగైరాల కొనుబడి లేదా అరువు, లేక దానాల్ని ముడిపెట్టాలి.

స్పెండర్ సూచించిన మొదటి ఆర్థికకార్యక్రమానికి గాను కామన్వెల్తుదేశాలన్నీ ఒక నిధి నెలకొల్పి చందాలు వేసుకోవాలి.

ఈనిధి చాలకపోతే, అప్పుడు అమెరికా ఏ ఆరేసి సన్నల డాలర్ల మొత్తంలో ఇందులోకి నప్పుతుంది (గోధుమలు ట్రాక్టర్లు కావాలంటే వీల్లేదని ఆయుధాల్ని ఉచితంగా ఇవ్వడానికి అమెరికా సిద్ధంగా సూచుందనీ, ఇందుకు ఆస్ట్రేలియాతో గూడుపుఠానీ జరిగిందనీ రష్యా ప్రచారం చేస్తోంది). అప్పుడు ఈ ఆసియా దేశాల వ్యవసాయాభివృద్ధితో బాటు ప్రజల జీవన సదుపాయాభివృద్ధికూడా అమెరికా బ్రిటన్ల పారిశ్రామికబలానికి శాశ్వతంగా బంధించబడిపోయేదే.

కాని బ్రిటన్ అమెరికాలు వెనుకంజ వేస్తున్నాయి. అప్పివ్వడానికి సిద్ధపడినా, దానం చెయ్యడానికి సిద్ధపడినా తాము కోరినవస్తువుల్ని తాము కోరే షరతులపైన ఇస్తేనే తీసుకోడానికి అంగీకరించే ధోరణిలో భారతదేశం మొదలైనవి ఉండడం వల్ల, ఈ యెత్తు లేవీ అమెరికాకు తృప్తిగా లేవు. అదీ కాక రాజకీయంగా తమపట్ల మైత్రిభావంతో (అనగా ముఖ్యంగా రష్యా పట్ల శత్రుభావంతో) ఈదేశాలు వ్యవహరిస్తాయనే నమ్మకంలేదు. వర్తకంలో చూస్తే ఈదేశాలు అమెరికన్లకి కావలసిన షరతుల్ని తీర్చడంలేదు. స్వేచ్ఛావర్తకానికి వీలుపడనివ్వడంలేదు. అందువల్ల వీటికి మొదటే హామీలేకుండా ఇటువంటి ఆర్థిక సహాయంలోకి దిగడం అమెరికాకు ఇష్టంలేదు.

బ్రిటన్ పరిస్థితి భిన్నంగా ఉంది. మలయాలో సాలీనా 600 మిలియన్లపౌనులు ఖర్చుపెడుతున్నా 120 వేల మంది సైనికుల్ని నియోగించినా అరాచకాన్ని అణచలేక పోతుండగా అదనంగా ఈప్రాంతాల ఆర్థికసమస్యాపరిష్కారం నిమిత్తం ధనం ధారపొయ్యడం శక్తికి మించిన పని.

అంతేకాకుండా ఈనిధి పెట్టాలనడంలో స్పెండర్ దృష్టి స్టెర్లింగ్ నిలవలపైన పడ్డం కాదేమో అనుమానం. స్టెర్లింగ్ రిజర్వు పద్ధతి మూలాగా ఆస్ట్రేలియాకి నష్టకట్టుతున్నమాట నిజమే. స్టెర్లింగ్ ద్రవ్యమానంతో విదేశాలతో వర్తకం చెయ్యడం వల్ల, బ్రిటన్ ఇవ్వవలసిన బాకీలచెల్లింపు చెయ్యలేకపోగా, ఏటేటా ఈ వర్తకంవల్ల అధికంగా ద్రవ్యం లండన్లో పేరుకుంటోంది. (భారతదేశంపేర నిలవలు ఏక తీసిపోతున్నాయి) పెట్టుబడి ఫారకంటె ప్రజలు (బ్రిటన్) లాభాలు అధికంగా ఉన్నాయి. ఇదంతా చూస్తే ఆస్ట్రేలియాకి కన్నెర్రగా ఉన్న మాట నిజమే. ఆద్రవ్యంలో కొంతవంతుని ఇటు రప్పించడానికి ఆస్ట్రేలియా వేస్తున్న ఎత్తేమోనని బ్రిటన్‌కి అనుమానం. అందువల్ల బ్రిటన్ ఈ కామన్వెల్తునిధి పట్ల అట్టే ఉత్సాహం చూపకపోగా తనకి అట్టే తాహతులేదని తెలుపుకున్నది.

భారతదేశందృష్టి మరింత భిన్నంగా ఉంది. ఆర్థికసహాయమని మొదలెట్టే ఈకార్యక్రమం అక్కడితో ఆగక పోవచ్చును. ఈకార్యక్రమాన్ని అంతర్జాతీయరాజకీయాలతో ముడిపెట్టకుండా అమెరికా వీసమైనా బలపరచదు. ఏకార్యక్రమానికైనా దుర్భిక్షనివారణ ప్రధానాంశంగా ఉండాలిగాని కమ్యూనిస్టుల నిరోధంతో ప్రమేయం ఉండకూడదు. ఎందువల్లనంటే ఆసియాదేశాల సమస్య ముఖ్యంగా ఆర్థికవిషయికమైనది. ఆర్థికకార్యక్రమాన్నే కేవలం తలపెట్టారనుకున్నప్పటికీ పెద్దనిధిని చేర్చగల తాహతు కామన్వెల్తుదేశాలకి లేదు. అందువల్ల ముక్తసరిగా విప్రవీణుల సహాయమో పెట్టుకుంటే నిర్వహించడానికి వీలుంటుంది. ఆయుధాలపైప్రసక్తి పెట్టుకుంటే అంతర్జాతీయరాజకీయాల్లోకి యుద్ధాల్లోకి దించేసినట్టవుతుంది. పరిశ్రమల పెట్టుబడి ప్రాజెక్టులు పెట్టుబడి అని పెద్దపెద్దవి తలుచుకుంటే అమెరికా కూడా దిగవలసి వస్తుంది. ఈరెండింటిలో దేని కొప్పుకున్నా చీనాలో జరిగినంత పరాభవం జాతీయోద్యమాలకీ, ఆసియాలోని జాతీయ ప్రభుత్వాలకీ జరిగిపోతుంది. కాబట్టి హద్దులు గ్రహించి కార్యాలు తలపెట్టితే ఫలితం ఉంటుంది. లేదా విపరీతఫలితాలు సంభవించక తప్పదు.

ఇంక మిగతా కామన్వెల్తుదేశాల లక్ష్యాలు ఆస్ట్రేలియా లక్ష్యాలకీ భారతదేశంలక్ష్యాలకీ మధ్య రకరకాలుగా ఉన్నాయి. ఆసియాదేశాలమధ్య వ్యాపారం స్వేచ్ఛగా జరగడానికి సింహళం ఆశించింది. కాని అది బొత్తిగా చర్చకైనా రాలేదు.

చిట్టచివరికి అటూ ఇటూ కాని నిర్ణయాలపైన అంగీకారం కుదిరింది. ఒకవిధంగా నిర్ణయాలు భారతప్రభుత్వఉద్దేశాలకి అనుకూలంగానే ఉన్నాయని చెప్పవచ్చును.

ఈ సిడ్నీ సమావేశఫలితంగా 8 మిలియన్ల పౌనుల నిధి ఒకటి నెలకొల్పడానికి నిర్ణయమయింది. ఇది అల్పకాలిక కార్యక్రమానికి అనగా మూడేళ్లకి ఆసియాదేశాలకి, వ్యవసాయ, పారిశ్రామిక వైద్యప్రవీణుల్ని తెచ్చుకోడానికి ఈ ధనాన్ని వినియోగిస్తారు. ఈ నిధిలో కామన్వెల్తుకి చెందిన ఇతర ఆసియాదేశాలు కూడా కోరితే చేరవచ్చును. దీనినిమిత్తం కొలంబోలో ఒక బ్యూరో స్థాపించబడుతుంది. రాగల కొద్దిమాసాల్లో బ్యూరో కార్యనిర్వహణ ఆరంభిస్తుంది.



త్రివేంద్రం బహిరంగసభలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ ప్రసంగం.

అయితే ఆసియా దేశాల ఆర్థికాభివృద్ధి క్రమక్రమంగా మెట్టుమీద మెట్టు చొప్పున నడవాలనీ, ఇటువంటి కార్యక్రమానికి ఆరేళ్లకి కావలసినదాన్ని తయారుచెయ్యాలని నిశ్చయించుకున్నారు. ఏ యే దేశాలకి ఎటువంటి ఆర్థికావసరాలు ఎంతెంత అవసరముంటాయో, "మరింత వాస్తవికదృష్టితో" పరిశీలించి ఆ దేశాలు 1950 సెప్టెంబర్ లోగా లండన్‌కి పంపాలి. తరవాత మళ్లీ కామన్వెల్త్ కన్సల్టేటివ్ కమిటీ లండన్లో సమావేశమై ఈ నివేదికల్ని పరిశీలిస్తుంది. ఆ నివేదికల ప్రకారం ఆ యా దేశాల ఆర్థికావసరాల్ని బట్టి పెట్టుబడి అవసరాల్ని ఎంతెంత నిధికి చందా లివ్వగలరో నిర్ణయించి మొత్తం 15 మిలియన్ల పౌనుల నిధితో ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల్ని నిర్ణయిస్తారు. ఈ కార్యక్రమం 1951 జూన్ మొదలు అమలుజరగవచ్చును.

ఫలితాలు ఇంతవరకైనా వచ్చినందుకు ఆస్ట్రేలియన్ ప్రతినిధి సంతోషించాడు. కాని పెట్టుబడిసహాయానికి ఎటువంటి కార్యక్రమమూ నిర్ణయం కానందుకు ఆశాభంగమయింది. ఆహారం ఔషధాలు మొదలైనవాని సప్లైనిగురించి ఏమీ చెయ్యలేకపోయినందుకు సింహళం, పాకిస్తాన్ ప్రతినిధులు విచారించినా, ఆసియా దేశాలమధ్య ఆర్థిక సహకారం పెంపొందుతున్నందుకు హర్షించారు. ముడివస్తువుల ధరల నిర్బంధాలు, ఎగుమతిదిగుమతుల వ్యవహారాలు, వ్యాపార నిర్బంధాలగురించి ఏ రెండు దేశాలకీ ఏకాభిప్రాయం కుదరలేదు. ఏ విషయంలోను ఆసియా దేశాలు చిక్కుకోలేదని భారత ప్రతినిధి సంతోషించి ఉండవచ్చును. నిపుణుల సహాయం సాధించడానికే అయితే ఇంత పెద్దసమావేశం ఆరంభం [illegible] భారతప్రతినిధి అభిప్రాయం కాదు. వాస్తవానికి ఈ అవసరాలపరిశీలనకి ఐక్యరాజ్యసమితివారి దూరప్రాచ్యఆర్థికాభివృద్ధిసంఘం ఉంది. నిపుణుల సహాయం నిమిత్తం ఐక్యరాజ్యసమితివారి కార్యక్రమం ఒకటి అమలులో ఉంది. అమెరికన్ ప్రభుత్వచతుస్సూత్రప్రణాళికలో ఒక కార్యక్రమం ఉంది. అవి బొత్తిగా చాలవని మాట నిజమే. కాని ఇప్పుడు సిడ్నీ సమావేశం సాధించినది అంతకంటె అధికంగా సాధించగలిగేది అట్టే ఉండదు.

అట్లాంటిక్ కౌన్సిల్ *

బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి విదేశాంగ మంత్రుల సమావేశం అనంతరం అట్లాంటిక్ పాక్ట్ దేశాల విదేశాంగమంత్రుల "అట్లాంటిక్ ట్రీటీ కౌన్సిల్" లండన్ లంకాస్టర్ హౌస్‌లో సమావేశమై సైనిక రాజకీయ కార్యక్రమాలనుగురించి చర్చించారు. ఈసమావేశంలో యూరోపియన్ అమెరికన్ దేశాల చరిత్రలో అపూర్వమైన ఘట్టం ప్రారంభమయిందని పాశ్చాత్యదేశపత్రికలు నాయకులు అన్నారు. నాలుగైదు శతాబ్దాలుగా ప్రపంచరాజకీయాల్లో అద్వితీయ స్థానం ఆక్రమించి, ప్రపంచమంతటా తమ ప్రభావాన్ని ప్రకటించగలిగిన శ్వేతజాతుల మధ్య ప్రప్రథమంగా సమైక్యతాభావం ఏర్పడి, అది రాజకీయస్వరూపం పొందుతున్నట్లు వారు భావించారు. కాని ఇన్ని శతాబ్దాలూ అంతఃకలహాలవల్ల యుద్ధాలవల్ల వారి అభ్యుదయం కొంత కుంటుపడింది. వారిలో వారి కలహాలు రెండు ప్రపంచయుద్ధాలకు హేతువైనాయి. శ్వేతజాతుల వారు కలహాలలో మునిగిఉన్న సమయంలో, వారి ప్రజాస్వామ్యసిద్ధాంతాలకు, రాజకీయస్వాతంత్ర్యసిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమైన ఒక రాజకీయవ్యవస్థ తలెత్తిందనీ, ఆసియావాసుల అరాచక అనాగరికతత్వాలకు అనుగుణమైన ఈ నూతనరాజకీయవ్యవస్థను ప్రతిఘటించడానికి శ్వేతజాతులన్నీ ఏకమై సోదరభావంతో సహకరించవలసిన సమయం ఆసన్నమైనదనీ న్యూయార్క్ టైమ్స్‌పత్రిక వ్రాసింది. ఈ అవసరాన్ని గుర్తించిన పశ్చిమయూరోపియన్ అమెరికన్ రాజ్యాల సమైక్యతాభావానికి అట్లాంటిక్ కౌన్సిల్ సమావేశం చిహ్నం అనికూడా ఆపత్రిక వ్రాసింది. అధికారికపరిపాలనావ్యవస్థ కమ్యూనిస్టు సిద్ధాంతాలు శ్వేతజాతుల ప్రజాస్వామ్యవ్యవస్థకు విరుద్ధమైనవని వీరి భావన కావచ్చును. వాస్తవానికి అధికారికపరిపాలన గాని, నిరంకుశపాలనగాని కమ్యూనిజం గాని, అరాచకం గాని అన్నీ యూరప్‌లో ఉద్భవించినవే.

ఇటువంటి సమైక్యతాభావంతో పెద్ద పెద్ద సిద్ధాంతాలు ప్రకటనలు ఉపన్యాసాల మరుగున జరిగిన ఈ సమావేశంలో ముఖ్యాలు సైనికసమీకరణ, రాజకీయతంత్రమూ, ఆర్థిక కార్యక్రమనిర్ణయం అత్యున్నతిసందేశాలు, ఉత్కృష్టసిద్ధాంతాల ఆర్భాటం లేకపోయినట్లయితే ఎంత శ్వేతవర్ణాభిమానం కలవారైనా యూరోపియన్ రాజ్యాల ప్రజలు అమెరికా ఆర్థికరాజకీయ సైనిక ఆధిపత్యం క్రిందికి రావడం కష్టం. సైనికకార్యక్రమాలకు దిగనవసరం ఉండదని చెప్తూ మార్షల్ ప్రణాళికప్రకారం ఆర్థికసహాయాన్ని అమెరికా ప్రారంభించింది. తద్వారా కమ్యూనిస్టుదేశాలతో పశ్చిమయూరప్ వ్యాపారగతిని బలవంతంగా అరికట్టింది.

చెకోస్లొవాకియాలో కమ్యూనిస్టుప్రభుత్వస్థాపనసమయం చూసి కమ్యూనిస్టుల భీతి చూపి అట్లాంటిక్ పాక్ట్ అంటూ దేశరక్షణ ఒడంబడికలోకి పశ్చిమయూరప్‌ని దించారు. స్వయంగా బలాధిక్యత లేకపోయిన బలవత్తరమైన రష్యాను ఎదిరించి నిలవడానికి గాను ఆయుధసహాయం ప్రారంభించింది. అట్లాంటిక్ పాక్ట్ ఫలితంగా పశ్చిమయూరప్ దేశాలు సైనికబలాలపైన ఖర్చును ఎప్పటికప్పుడు పెంచి వేస్తూ వచ్చాయి. ప్రభుత్వాల ఈ ఖర్చులు పెరిగిపోవడంతో దేశాల ఆర్థికస్థితిని నిలబెట్టుకోలేక మార్షల్ ఆర్థికసహాయం చివరికి నిరర్థకం కాగా, పశ్చిమయూరప్ అమెరికాపైన మరింత ఆధారపడవలసివస్తోంది. మార్షల్ ఆర్థిక సహాయం 1952లో అంతమైతే ఆపైన ఏమి చెయ్యాలో తెలియక పశ్చిమయూరప్‌కి సందిగ్ధగతి వచ్చింది. యూరోపియన్ రాజ్యాలు ఆర్థికంగా రాజకీయంగా సైనికంగా ఏకం కావాలని చేసిన కృషి జాతీయభావాలబలంవల్ల ఫలించలేదు (ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ మొదలైన దేశాలు ఏకైక రాజకీయవ్యవస్థలో (అనగా భారతదేశంలో వివిధరాష్ట్రాలవలె) పశ్చిమయూరోపియన్ కౌన్సిల్‌లో చేరి సహకరించడానికి అంగీకరించలేకపోతున్నవి. అదీ కాక జోగీజోగీ రాసుకొన్నట్లు కావచ్చును. వ్యాపారంలో పోటీచేసి యుద్ధాలకు తగిన దేశాలు, అమెరికావల్ల పొందే దానంకోసంకూడా కీచులాటలు మానలేదు. యాచకులకు యాచకులే శత్రువులు. పశ్చిమయూరోపియన్ కౌన్సిల్ అట్టే దూరం పోలేదు. ఇంతవరకు ఒక్క విషయంపైనా ఏకాభిప్రాయం కుదరలేదు. కొంటె 1952 తరవాతకూడా అమెరికా ఆర్థికసహాయం లభించగలదని నమ్మకం కలిగిస్తే కాని పశ్చిమయూరప్ దేశాల సైనికసహకారం చేకూర

(39 వ పేజీ చూడుడు)

గల్పిక:

తెల్లవారెట్టు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"ఏమండీ, ఒక రూపాయి కావాలి ఇవ్వండి"

"ఎందుకూ?"

"పక్క ఇంటావిడ బియ్యం ఇస్తానన్నది"

"ఇప్పుడు బియ్యం దేనికీ?"

"రేపను ఇవాళతో చెల్లూ, రేపూ, ఎల్లుండీ, తినొద్దూ?"

"ఏం? ఇంతలో ఎందుకయిపోయాయీ?"

"ఏవారం సరిపొయ్యాయేమిటి? రెండు వారాలకూ, మూడు వారాలకూ ఒకసడి కొంటూనే ఉన్నా."

"రేషన్ ధరకేనా?"

"రేషన్ ధర కెవరన్నా ఇస్తారా ఏం? పదీ రూపాయి అణా!"

"రూపాయి అణాయే! గది అవతలే పెట్టావూ బ్లాక్ మార్కెట్టూ? కొంప గుల్లే!"

"అణా నా దగ్గిరుంది రూపాయి ఇస్తురూ"

"నా బొందిలో ప్రాణం ఉండగా ఇవ్వను"

"రేపూ, ఎల్లుండీ ఏం తిందాం?"

"రెండురోజుల బియ్యం ఎట్లా తక్కువయాయి అని!"

"మీరు నిన్న ముగ్గుర్ని భోజనానికి తెచ్చారు జ్ఞాపకం ఉందా? అంతకు మునుపు వరసగా మూడురోజులు ఇడ్డెను చేసుకు తిన్నాం జ్ఞాపకం ఉందా?"

"అదంతా నాకు తెలీదు నేను బ్లాకు మార్కెట్టులో ఇంతమట్టికూడా కొనను. నీవంటివాళ్లే కాంగ్రెసు ప్రతిష్ఠ గంగపాలు చేస్తున్నది మొన్న సర్దారు పటేలు లేమన్నాడో విన్నావా?"

"పోనీ సర్దారుపటేల్ నడిగి పదిబియ్యం పట్టుకురండి"

"నీకంతా వేళాకోళంగా ఉంది"

"పోనీ ఆవిడ బియ్యం ఊరికే ఇస్తుందేమో అడగనా?"

"అంత కంటేనా?"

"అదీ రహస్యం! డబ్బు ఖర్చుకారాదు."

"ఎంతసేపటికీ డబ్బు సంగతే ఆలోచిస్తావు గాని, నీతిసంగతి ఆలోచించవే"

"ఇంట్లో బియ్యం నిండుకుంటే కోరికిన కాడికి కొనటంలో అవినీతి ఏమిటో నాకు బోధపడలేదు"

"నీకు బోధపడేట్టు చేస్తానుండు ఆవిడ పేరేమిటో చెప్పు ఇప్పుడే వెళ్లి పోలీసులకు రిపోర్టిస్తా!"

"చాల్లెండి! పుణ్యం ఉంటుంది?"

"పుణ్యమేమిటి, పురుషార్థం? ఈ అవినీతి ఎట్లా అంతమయేట్టు?"

"సరే పస్తులుందాం లెండి"

* * *

"ఇదేమిటే? తొమ్మిదైనా పొయిరాజెయ్యలేదూ? నే నాఫీసుకు పోవద్దూ?"

"తేలిగ్గా వెళ్లండి ఇవాళ అన్నం లేదు"

"ఏం?"

"నిన్ననే చెబితినిగా? బియ్యం లేవు."

"ఆవిడదగ్గిర తీసుకుంటానన్నావుగా?"

"అవినీతి అంటిరిగా? అదీ కాక మీరు నాకు డబ్బెక్కడ ఇచ్చారూ?"

"నిజంగానే బియ్యం లేవా?"

"మీ మీద ఒట్టండీ! పరాచకమా?"

"చంపేశావు! మళ్లీ రేషనెప్పుడూ?"

"ఎల్లుండి"

"ఇవాళా, రేపూ పస్తే?"

"త్రహా!"

"పోనీ, తగలెయ్యి! ఈసారికి తీసుకో, ఇంకోసారి ఇట్లా జరగనీకు"

"ఆవిడ నిన్న సాయంకాలమే ఇంకోరికి బియ్యం అమ్మేసింది"

"అవీ లేవూ?"

"లేవు"

"చంపావు!...ఉండకేం జేస్తాయి? అడిగి చూడు"

"లేవు పొద్దున అడిగాను—వచ్చినప్పుడు దబ్బిద్దాంగదా అని. మీరు కబుర్లు చెబుతారుగాని ఏమ్మల్ని తిండిలేకుండా పంపటం నాకిష్టమా?"

"లేవన్నదా?"

"ఆ"

"ఇంకో పావలా ఇస్తే ఉంటయ్యేమో?"

"నే నటువంటి బేరాలు చెయ్యలేనండీ"

"ఇంకెవరింట్లోనన్నా—"

"నేనెవరింటికీ పోను ఏం మునిగింది? మీరు వెళ్లి హోటల్లో తినండి, నేను ఎల్లుండి ఎంగిలిపడతాను"

బాగుంది నువు చెప్పేది పద హోటల్లో తినివద్దాం ఏః, చూడనా? ఎంతవుతుందీ? పదణాలు, పదణాలూ రూపాయిపావలా రెండు రూపాయి పావలాలు, రెండున్నరా రెండు రెండన్నరలు ఆయిదు రూపాయలు! పోతే పోయింది! హాయిగా ఇవాళా రేపూ హోటల్లో భోంచేద్దాం! ఈ అవినీతిని మాత్రం సహించరాదు లే. లే!"

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౩౧

అట్లు సాహసించి త్రిపురాంతకు డాకస్మికముగా మోటుపల్లి పట్టుకొనినంతనే, నెల్లూర నున్న జటావర్మసుందరపాండ్యునకును గోదావరి దరియుచున్న కొప్పెరుంజింగనికిని ఆశ్చర్యమయ్యెను. ఒకరి వార్త లొకరికి ఇన్నాళ్లు నిరంతరముగా వచ్చుచున్న విప్పుడు నెమ్మది నెమ్మదిగా రాకుండ బంధించిపోవుచుండెను. దానితో వారిరువురకు సమగ్రముగా సంప్రదించుకొనుటకు అవకాశము లేకుండ తప్పిపోయినది.

ఈ విధముగా శత్రువులకు చిక్కులు కలిగించినను, త్రిపురాంతకునకు గాని జన్నిగదేవునకు గాని మనస్స్వాస్థ్యము కలుగలేదు. వారిరువురచుట్టును శత్రువుల మండలములే కలవు. అటు నెల్లూరు నుండి సుందరపాండ్యు డెత్తిరావచ్చును. ఇటు గోదావరీతీరము దరియుచున్న కొప్పెరుంజింగని సేనలు వెనుదిరిగి రావచ్చును. ఉత్తరమున మోసలపట్టణమురేవు కొప్పెరుంజింగని సేనల యధీనమున నున్నది. దక్షిణమున నెల్లూరుసమీపమున కృష్ణాపట్టణము రేవు సుందరపాండ్యుని స్వాధీనమున నున్నది. ఇట్లు రెండువైపుల నుండి నౌకాసైన్యములును కాడవపాండ్యసేనలును ఒక్కసారిగా మోటుపల్లిపై విజృంభించిన త్రిపురాంతకుడు నిలువలేడు; జన్నిగదేవుని సేనలును ఆ నాలుగు సేనాప్రవాహములను అరికట్టి నిలువలేవు. అదియును గాక గొంటూరుమాండలికు డగు నాగదేవుడును, ధనదుప్రోలులోని చోడపతియు కొణిదెన చోళులును—అందరును శత్రుపక్షములోనివారుగనే ఉండిరి. వీని యన్నిటికి తోడుగా ఈశాన్యమునుండి కాళింగసేనలు కోలని రుద్రుని ధిక్కరించి రావచ్చును. అందుచే త్రిపురాంతకుడును జన్నిగయు ప్రమాదావస్థలో నున్నారు.

ఈ స్థితిగతులు వారిద్దరు పరికించినారు. కాని వారిద్దరికిని గుండెనిబ్బర మెక్కువ. జన్నిగదేవుడు తన మూలబలమును వినుకొండలో నుంచి, శీఘ్రగాము లగు నాశ్వికదళములను ఉత్తరమున గొంటూరుమండలముపైకిని కొణిదెనపైకిని, దక్షిణమున కనిగిరి కందుకూరులపైకిని పంపుచు నిరంతరసంచాలనము చేయించుచుండెను. అందుచే నెవరికిని అతనియొద్ద నెంతబల మున్నదో నిశ్చయింపరాకుండెను. అతనిసేనలకు శత్రుసేనల బలాబలములు ఈదళముల ద్వారా తెలియవచ్చుచుండెను.

త్రిపురాంతకుడు అద్దంకిమీదుగా వినుకొండతో తనకు సంబంధము తెగిపోకుండుటకు సమస్తప్రయత్నములు చేయుచు, ఆమార్గమున నున్న కోటలను పట్టణములను సేన లుంచి, గోడలు కట్టించియు, కందకములు త్రవ్వించియు బలపరచుచుండెను. మరియు తన చేజిక్కిన మోటుపల్లి నౌకలను యుద్ధమునకు ఆయితము చేయించి వానిని నావికులతోడను ధనుర్ధరులతోడను పూరించి వీలు చిక్కినప్పుడు గోదావరిసేనలతో కలసి మోసలపట్టణము రేవు పట్టుకొనుట కుంకించుచుండెను.

కాని ఆ సోదరు లిద్దరును వారి ప్రాణము లరచేతులలో బిగబట్టుకొని మేకపోతుగాంభీర్యముతోడనే చరించుచుండిరి.

ఆ సమయమున సరిగా ఓరుగల్లునుండి రెండుమహాసేనలు బయలుదేరి శీఘ్రప్రయాణముల సాగుచున్న వను వార్త జన్నిగకు తెలిసినది. ఆ మహావాహినులలో నొకటి యంబదేవుని యాధిపత్యమున తమ సహాయమునకే వచ్చుచున్నది. జన్నిగ యీ వార్త వెంటనే త్రిపురాంతకున కెరిగించి సేనాచలనమునకు నిశ్చయించెను. ఆ చలనము శీఘ్రముగా చేయవలెను! కాని ఎటు పోవలెను?

ముందు నెల్లూరుపై బడిన లాభము లేదు. అక్కడనున్న సుందరపాండ్యసేనలు బలవత్తర మైనవి. అదియును దూరము. అటు తాను ప్రయాణము సాగించినచో తన్ను ఎలయించుటకు పాండ్యసేనలు కొంనెము వెనుదీసినను ఎన్నాళ్లకో గాని యది తేలదు.

అందుచే రాజ్యమధ్యమునకు చొచ్చుకొని వచ్చిన కొప్పెరుంజింగని ముందు సాధింపవలెను. ఇది సుఖతరము. అత్యవసరము! రాజ్యగర్భములో ప్రవేశించిన శత్రువు నచ్చట దీర్ఘకాల ముండనిచ్చుట క్షేమము కాదు. మరియు వసిష్ఠగోదావరి నాతని దాటనిచ్చి, సప్తగోదావరములమధ్య చేరనిచ్చిన నాతనికి స్థైర్యము చేకూరును. గోదావరిపాయలుదాటి యాతని నిర్జించుట కష్టము. అతనికి ఆహారపదార్థములు బయటినుండి రాకుండ నరికట్టినను, సస్యశ్యామలపై

ఫలవంతమగు నా ప్రదేశమున నాతనికి ఆహారాదిసమస్తపదార్థములును సులభముగా లభ్యము లగును. బంగారువంటి యచ్చటి క్షేత్రములు ఈ పల్లవసింహమునలజడి కాగలేవు! కావున ముందు కొప్పెరుంజింగని వైపుకే తన మూలబలము మరల్ప జన్నిగ నిశ్చయించెను.

తన యుద్ధయాత్రకు అవసరమైన ప్రయత్నములన్నియు నతడు ముందుగా పూర్తికావించెను. దాని నడకకు, తిథులతో సహా, చలన కార్యక్రమము నిర్ధారణచేసెను. ఇవి యన్నియు త్రిపురాంతకునకును వచ్చుచున్న అంబదేవునకును ముందుగ రహస్యముగా శీఘ్రగాము లగు దూతలచే తెలియజేసి వారి సమ్మతి పొందెను. దక్షిణముననుండి పాండ్యసేన లొకవేళ కదలివచ్చినచో, వానిని ఎట్లెదుర్కొనవలెనో, ఎక్కడ నెదుర్కొనవలెనోకూడ, ముందుగా నిర్ధరించి తమ్ముడగు నంబదేవునకు తన శాసనము తెలియజేసెను.

శీఘ్రముగా తాను గోదావరి దరియుటకు కొణిదెన గొంటూరులమీదుగా సీతానగరము చేరి కృష్ణ నుత్తరించి బెజవాడ చేరుకొనవలెను. కాని యా రెండు మండలములును శత్రువులచేతులలో నున్నవి. అందుచే నించుక దూరపుమార్గమైనను, పల్నాడుమీదుగా నమరావతి చేరి, యక్కడ కృష్ణ నుత్తరించి యాత్ర సాగింప నాతడు నిశ్చయించెను. ఈ దారిన బోయినచో నతని సేనలకు వామపార్శ్వమున నెట్టి భయము నుండదు. కాని కుడివైపున కొణిదెన చోళులును గొంటూరు నాగదేవుని మూకలును గలవు. వానివలన తన సేనాచలనములకు కొంత ఆటంకము కలుగవచ్చును. అందుచే నాతడు తన సేనలో చిన్న భాగములు రెండు వేరుచేసి, యందులో నొకటి కొణిదెనపైకిని, రెండవది గొంటూరుపైకిని పంపెను. ఆ సేనలు కొణిదెనగాని గొంటూరుగాని పట్ట నుద్దేశించినవి కావు. అక్కడిసేనలు జన్నిగ మూలబలములపై రాకుండ నరికట్టుటకు ఉద్దేశింపబడినవే. ఈ జాగ్రత్తతో జన్నిగదేవుడు తన మహాసేన కదలించెను.

అంబదేవుని సేన తన్ను కలియకముందే ఇట్లు యాత్రసాగింప జన్నిగదేవుడు సాహసించుటకు మరియొక ధైర్యకారణమును చేకూరియున్నది. ఆవల కోలనిరుద్రుడు అప్పటికి కోలనివీడు దుర్భేద్యముగా దృఢపరచి, తన మహాసేనతో నిడుదవోలుమీదుగా రాజమహేంద్రవరము చేరి, యక్కడినుండి సాహసించి పీఠికాపురము ప్రవేశించి యచ్చట విడిసెను. తాను వచ్చినదారిని నూతన సైన్యము లాయత్తము లొనర్చి, దుర్గములు సర్వసంపన్నములు చేసి, అప్రమత్తు లగు వాహినీపతుల నాయాయెడల స్థాపించి, కొప్పెరుంజింగ నటువైపుకు కదలకుండునట్లు బలపరచెను. అతని ప్రయత్నములు సఫలమగుటవలననే కొప్పెరుంజింగని సేన లెంతకును తమ నౌకలను దూరమున సముద్రములో జూచుకొనుచు, తీరము వెంట ఈశాన్యాభిముఖముగా సాగుచుండెను.

ఇట్లు మార్గము నిష్కంటక మొనర్చి కోలనిరుద్రుడు పీఠికాపురము చేరి కళింగసేనలు దండెత్తినచో నెదుర్కొనుటకు సిద్ధపడుచుండెను. అందుచే ప్రస్తుతము కాకతీయుల కోరంగిరేవు సురక్షితమయ్యెను. కాని రుద్రునిసేనలపై నొక్కసారిగా కళింగసేనలును కాడవసేనలును రెండువైపులనుండి వచ్చి పడినచో నిలువలేవు. ముందు నిర్ధరించినప్రకారముగా నాతనికి అన్నమంత్రీశ్వరునిప్రాపు కావలసియుండెను. కాని యది రాలేదు. పైపెచ్చు అతడు నిర్బంధములో నున్న వార్తయు కోలనిరుద్రునికి చేరెను.

ఎందువల్ల అన్నమంత్రిని బంధించినారు? రాజద్రోహము లాతనిపై కొండెములు చెప్పియుందురు. దోషము లంటని యా మహానుభావునిపై వేసిన దోషములు ఎన్నాళ్లు నిలుచును? కాని యవి తనపైగూడ ప్రసరించునా? అందుచే దనకు రావలసిన సహాయ సేనలు రాకుండబోవునా? ఏమైన నేమి? ముందుగా నిర్ణీతమైన కార్యక్రమ మనుసరించి తాను తనవిధి నిర్వర్తింపవలెను! అట్లు నిశ్చయించి యాతడు తన విధి నిర్వహించెను.

ఇట్లుండ మోటుపల్లి త్రిపురాంతకుని స్వాధీనమగుటయు, ఓరుగల్లునుండి రెండు మహాసేనలు బయలుదేరుటయు నాతనికి తెలియవచ్చెను. అందులో ఆదిదమ్మ స్వాధీనమున పాఖాలనుండి కదలిన సేన తన సహాయమునకే వచ్చుచున్నది. భేద మొక్కటే! పరమేశ్వరమూర్తి యగు అన్నమంత్రీశ్వరుడు ఆ సేనవెంట వచ్చుచుండలేదు. అతని స్థానమున ఆదిదమ్మ వచ్చుచున్నాడు. అతడును మంచివాడే, సమర్థుడే! కాని అన్నమంత్రీశ్వరునకు త్రిభువనములలో నెవరీడు?

ఆదిదమ్మ వచ్చుచున్నవార్తతో కోలనిరుద్రుని మనస్సుకు నెమ్మది కలిగినది. వెంటనే యాతడు కోరంగి వెళ్లి యక్కడి కాకతీయ నావధ్యక్షుని కలిసికొని యవసరము లగు సర్వసన్నాహములు చేయ నుత్తరువు లిచ్చెను. ఆ నావధ్యక్షుడు ముఖ్యముగా సముద్రము మీదినుండి కొప్పెరుంజింగనికి కాళింగుల సహాయము గాని పాండ్యుల సహాయముగాని రాకుండ నరికట్టుచుండవలెను.

ఈ ఏర్పాట్లు చేసి రుద్రుడు తిరిగి పిఠాపురము వచ్చి ఆదిదమ్మసేనల రాకకై నిరీక్షించుచుండెను. ఆ సేనలు వచ్చినవెంటనే ఆతని స్వాధీనమున పిఠాపురప్రాంత ముంచి యవసరమైన సేనలతో సాగి తాను కాళింగసేనల నెదుర్కొనుటకు కోలనిరుద్రుడు నిశ్చయించెను.

*

కథానిక :

"పెళ్లిచేసిచూడు"

పూ. భా.

'కాయ్యా ! పండా !'

'అదీ మన మే నిర్ణయించుకోవాలి'

'అంటే?'


అంతా చెపుతాను. కాస్త కాఫీ కాచు. నీళ్లు తోడు స్నానం చేస్తాను...ఏం బస్సులు, ఏం రైళ్లు! ఊపిరి తీసుకుందుకైనా అవకాశం లేకపోయింది.

ఏభైఅయిదు సంవత్సరాల జీవితంలోనూ ముప్పైసంవత్సరాలు ఉద్యోగానికి ధార పోసి యీ మధ్యనే రిటైరయాడు గోపాలం పంతులు. చిన్న గుమస్తాగా ప్రవేశించి గజిటెడ్ ఆఫీసరుగా రిటైరయాడంటే అతని సుగుణసంపత్తే అందుకు కారణం అని చెప్పుకోవాలి. పట్టభద్రులు కాకపోయినా గోపాలంపంతులు మేధాసంపత్తినీ, సత్ప్రవర్తననీ మెచ్చి అతనికి ప్రమోషన్ మీద ప్రమోషన్ యిచ్చారు దొరలు. కాని చివర కాలంలో గోపాలంపంతులకి యెప్పుడూ తన పైఅధికారులతో తగాదాలే. అందుకు కారణం అతను కచ్చితమైన మనిషి అవటమే. గోపాలంపంతుల్లో ఉన్న గొప్పతనం ఏమంటే కాలంతోపాటు తనూ మారలేక పోయేవాడు. తన యథార్థవాదం, నిజాయితీత్వం కొన్నాళ్ళవరకూ కాపాడుకువచ్చిన మాట వాస్తవమే కాని, కాలం మారి కట్టుబాట్లు సడలిపోయి ప్రతివాడూ—బంట్రోతు మొదలు అతనికన్న పెద్ద ఆఫీసర్లవరకూ లంచానికి చెయ్యి చాస్తున్న రోజుల్లో గోపాలంపంతులు యథార్థవాదానికీ, నిజాయతీత్వానికీ విలువ లేకపోయింది. అందరిమల్లే ఆత్మను చంపుకుని చెయ్యి చాచలేకపోయాడు. యీ పద్ధతిలో అతను చాలా చేతకానివాడు అని అనిపించుకున్నాడు. తన కళ్ళయెదుట ఉద్యోగాలు సంపాదించుకున్నవాళ్ళూ, తనచేత్తో తనే ఉద్యోగాలు యిచ్చినవాళ్ళూ, తనకన్న తక్కువ హోదాలో ఉన్నవాళ్లూ మేడలుకట్టిస్తూంటే తను పిత్రార్జితమైన యింటిని గట్టిగా మరమ్మత్తుచేయించుకుందికికూడా. ఆకాణా లేకపోయిందంటే గోపాలంపంతులు ఎంత మంచివాడైనా అప్రయోజకుడని మనం అనేస్తాం.

తన పైఅధికారిని పనితోటే సంతృప్తి పరచగలిగేవాడే గాని డబ్బు ఖర్చుపెట్టలేకపోయేవాడు. అది లోభత్వంచేత కాదు. తనతోపాటు నలుగురైదుగురు భోజనానికి లేస్తేనేగాని లేవని గోపాలం పంతుల్ని లోభి అని ఎలా అనగలం. కాని డబ్బు కావలసిన అధికారులకు గోపాలం పంతులు ఎంతపని చేస్తేమాత్రం ఏం లాభం యీ రకమైన లాంఛనాలు నిర్వర్తించపోవడంవల్ల అధికారులందరిదగ్గరా చెడ్డ అంపోయాడు.

'యిలా అయితే ఎలా గోపాలం? నాలుపైసాలు నువ్వూ ఎలాగో సంపాదించి ఖర్చుపెడుతూండాలి గాని అందరిదగ్గరా చె అయిపోతే ఎలా?' అనేవాడు శాస్త్రి గోపాలంపంతులుతో.

'యీ కాకుల్ని కొట్టి గద్దలకి వే పద్ధతి నాకు నచ్చదు శాస్త్రీ. నువ్వైనా



చెప్పుగాని' అనేవాడు గోపాలంపంతులు.

చివరకి గోపాలంపంతులుమీద ఒక్కొక్కడు ఒక ఆయుధం ప్రయోగించే వెళ్ళేవాడు.

అతని ఉద్యోగజీవితం పూర్తయింది. యిప్పుడు తన ఏకైకపుత్రికకు వివాహం చెయ్యవలసివచ్చింది. తగిన వరుడుకోసం అన్వేషిస్తున్నాడు.

ప్రావిడెంటుఫండూ, కంపెనీల్లో భీమా చేసిన సొమ్మూ అంతా పదివేలవరకూ వచ్చాయి గోపాలంపంతులికి. ఒక్కగానొక్క కూతురు కాబట్టి తగిన వరుడికివ్వాలని గోపాలంపంతులుఅభిలాష. కాని తనకి యిష్టపడ్డవాళ్ళంతా తన ఆస్తికి పైగా కట్నాలడుగుతున్నారు. యీ పరిస్థితుల్లో మనస్సు కష్టపడినప్పుడు అనుకునేవాడు 'తాను నిజంగా అప్రయోజకుణ్నే'నని.

'నీళ్లు తోడేను రండి' అని కేకవేసింది భార్య.

స్నానం చేసి కాఫీ త్రాగి కూర్చున్నాడు.

'అయితే యింతకీ ఏమైనట్లు'? అంది భార్య.

'ఏమైనట్టు. యిది తప్పితే మనం యిక వివాహం చెయ్యలేం. అక్షరజ్ఞానం లేని వాడికైనా యీ రోజుల్లో కట్నం కావాలి. కాలం అలా ఉంది. ఉద్యోగం చేస్తున్నన్నాళ్లు కాలానికి కళ్లెం వేశాను గాని యిప్పుడు లాభం లేదు. పెద్ద కట్నాలు యివ్వకుండా సంబంధం చెయ్యలే.'

'ఆ రోజుల్లో నలుగురిమల్లే నాలుగు పైసాలు సంపాదిస్తే యిప్పుడు పని కొచ్చేవా?'

'ఆ మాటలు మాను'

'నా కెందుకు—అయినా చేతులు కాలిపోయినతరువాత!'

'ఐదువేలు కట్నం, మిగతా లాంఛనాలూ, ఉభయకర్చులూ'

'అబ్బా!'

'మరేం చేస్తాం?'

'నాకు పెళ్ళొద్దు నాన్నగారూ! పురుషుల్లో ఉన్న అహంకారశక్తుల్ని దుళ్ళకొట్టేవరకూ పెళ్ళిచేసుకోను.' అంది అప్పుడే కాలేజీనుంచి వచ్చిన కూతురు.

'నీ కింకా చిన్నతనం పోలేదమ్మాయి'

'చిన్నతనం అంటారేమిటి నాన్నగారు! పురుషులు స్త్రీలమీద కక్ష సాధిస్తూంటే మేం ప్రతీకారం చూపొద్దూ?'

'ఆ కక్ష మీమీద కాదమ్మాయ్; మా మీదే. పురుషులమీద పురుషులు.'

'అది మానించేగా?'

'నిజమే కాని బాధ్యత మాదేగా?'

'ఆ బాధ్యతనుంచే యికనుంచి మీరు తప్పుకోవాలి'

'ఎంత తేలిగ్గా అనేశావ్ అమ్మాయ్!'

'కాలం మారుతోంది నాన్నగారు. దేశ పరిస్థితుల్ని చూస్తూంటే స్వల్పభవిష్యత్తులోనే స్త్రీలకికూడా పురుషులతో సమానమైన ప్రతిపత్తి వచ్చేటట్టుంది. అన్నివిషయాల్లోనూ స్త్రీలుకూడా ప్రధానపాత్ర వహించవలసిఉంటుంది. ఇది చాలా అవసరంకూడా.'

'నీ పుణ్యం ఉంటుంది; యిలాటి ఉపన్యాసాలకి స్వస్తి చెప్పు. నలుగురూ వింటే పెంకిపిల్ల అంటారు.'

'యథార్థం చెపితే యింతే నాన్నగారు'

'నిజం. నేను యథార్థవాదినయే నిర్భాగ్యుణ్ణయాను.'

'పోనీ ఒకటి ఆలోచించండి నాన్నగారు. స్త్రీలకి పెళ్ళి ఎంత అవసరమో పురుషులకీ అంతే కద? అలాంటప్పుడు ఆడపిల్లలు కలవాళ్ళంతా కొన్నాళ్ళపాటు ఓపికపడితే కట్నాల అవసరం లేకుండానే అల్లుళ్లు దొరకవచ్చు.'

'పురుషులు ఎన్నాళ్లు వివాహం కాకుండా ఉన్నా పరవాలేదు గాని, యుక్తవయస్సులో ఉన్న స్త్రీకి వివాహం చెయ్యకపోతే లోకం విరుచుకుపడుతుంది.'

'స్త్రీలు కట్టుదిట్టంలో ఉన్నన్నాళ్లు లోకం యెంత విరుచుకుపడితేనేం? వృథా విశ్వాసాలతోనే మనం మాసిపోతున్నాం.'

'అంతకంతకి మీ చదువులన్నీ ప్రయోజనశూన్యమైన హేతువాదానికి దారితీస్తున్నట్టున్నాయి'

'ఏమిటమ్మాయి ఆ వాదన? ఎవరైనా వింటే నవ్వుతారు. వెళ్ళి కాఫీ తాగు, వంటింట్లో మూతపెట్టాను.' అని గదమాయించింది తల్లి.

'పెళ్ళయేవరకూ యిలాగే కబుర్లు చెపుతారు. కాపురం చేస్తూంటే మనం జ్ఞాపకమే రాం...ఏం తల్లీ!' అన్నాడు గోపాలంపంతులు.


రూపసియైన అవధానియే భర్తను చూసేసరికి గోపాలంపంతులుకూతురు తన ఉపన్యాసాన్నంతా మరిచిపోయింది. యౌవనం అలాంటిది.

వివాహం సలక్షణంగా జరిగింది. అందరు బంధువులూ వెళ్లిపోయారు. కుమార్తెను కూడా అత్తవారింటికి పంపేశాడు.

ఒక రోజున యిల్లంతా కలయచూస్తున్నాడు గోపాలంపంతులు. మరమ్మత్తు కోసం యిల్లు హెచ్చరిస్తోంది. ఉన్న డబ్బంతా వివాహానికి కర్చయింది. వెర్రివాడల్లే యిల్లంతా తిరిగి కుర్చీలో కూర్చున్నాడు.

తోటి ఉద్యోగులందరికీ పెన్షన్ కాక యిల్లు, భూములూ వగైరాలు మిగిలాయి. అందరికీ వచ్చే పెన్షన్ కాక తన కేమి మిగిలిందా అని ఆలోచించాడు.

మూల నున్న చింకిజోళ్లూ, నిరుపయోగంగా వేలాడుతూన్న టోపీలూ వెక్కిరిస్తున్నట్టుంది గోపాలంపంతులుకి.



స్త్రీ వయోజన విద్యాకేంద్రం బళ్లారి. సిబ్బంది, విద్యార్థినులు.


అభిమానం, మంకుతనం

నడకవచ్చిన తరువాత పిల్లల ఆగడం మితి మీరుతుంది. తల్లికి హైరానా అధిక మౌతుంది. ఒక్క క్షణం కనుమరుగైతే పాప ఎక్కడో ఏదో పాడుచేశాడన్నమాటే. ఉయ్యాలలో కూచోబెడితే ఊరుకోడు. దింపేవరకూ పేచీ పెడతాడు. కొట్టక పోయినా కొట్టినట్టు ఏడుస్తాడుకూడా. నిర్బంధించినకొద్దీ పేచీ ఎక్కువౌతుంది. ఎలాగూ అట్టేకాలం పాపని కాలుకట్టేసి ఉంచలేరు. కాబట్టి మొదటనుంచే మంచి అలవాటు నేర్పడం మంచిది.

చాకు దీపం కుంపటి మొదలైనవి చేతి కందితే తప్పకుండా పాపముప్పు తెచ్చుకుంటాడు. కాబట్టి అటువంటివి అందుబాటులో లేకుండా చేసుకోకతప్పదు. ఇంట్లో వస్తువుల్ని సర్దుకునేటప్పుడు పాప ఆగడాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. హానికలిగించని వస్తువుల్ని, సులువుగా పాడయ్యే విలువైన వస్తువుల్ని తప్ప మిగతా వస్తువుల్ని అందుబాటులో ఉంచవచ్చును. అన్నివస్తువుల్నీ అందకుండా ఉంచడం అసంభవం. అటువంటి ప్రయత్నంవల్ల తల్లికిప్రాణం విసికిపోవడం తప్ప ప్రయోజనమేమీ ఉండదు. పాపను భయపెట్టి దూరంగా ఉంచడంవల్ల కూడా చాలా నష్టం ఉంది. తల్లిపట్ల సన్నిహితకొంతు ఆత్మవిశ్వాసం లోపించవచ్చును. చేతికే వస్తువు అందితే, దాన్ని నోట్లో పెట్టుకునే పిల్లలకి బొత్తాములు పిన్నీసులు మొదలైనవి అందనియ్యకూడదు.

ఏడాది రెండేళ్ళవయస్సులోనే భీతి కూడా పిల్లల్ని సులువుగా ఆవహిస్తుంది. నిద్రపుచ్చడానికైనా సరే పిల్లల్ని భయపెట్టడం మంచిదికాదు. మచ్చికచెయ్యాలి. మరిపించాలి పెద్ద ధ్వని వినిపించినా, అకస్మాత్తుగా కొన్నివస్తువులు దృష్టిలో పడినా పిల్లలు జడుసుకుంటారు. ఇటువంటివి సంభవించకుండా జాగ్రత్తపడాలి.

దీపం పడగొట్టవద్దని బెదిరించినా, లేక గొంతుచించుకోవడంవల్ల ప్రయాసమాత్రమే మిగుల్తుంది. అది సరైన పద్ధతికాదు. అంత దూరంనించి వొద్దురా అని అరిస్తే వాడి బుర్ర తిరగపడమని వాడికి చెపుంది. "ఏం. నేనెందుకు వినాలి? నేనూరుకోను" అని పిస్తుంది వాడి మనస్సుకి. అంతే దీపాన్ని పడలాగుతాడు. కేకలేసి అదుపులో పెట్టడానికి ప్రయత్నించినందువల్ల పాపలో మంకుతనం అబ్బుతుంది. తల్లిమీద ఒక కన్నుంచి, మరోకంట దీపాన్ని చూస్తూ మెల్లిమెల్లిగా జరుగుతాడు. వొద్దని కేక వేస్తున్నకొద్దీ అడుగు మరింత చురుగ్గా వేస్తాడు. తల్లికి కోపం ఎంతరెచ్చిపోతే అంతగా మూడాలని పాపకి బుద్ధిపుట్టడం కద్దు. అలాకాకుండా, పాప దీపం దగ్గిరకి నడుస్తున్నప్పుడే, మాట్లాడకుండా చక్కావెళ్లి పాపతో వాదించినా లాభంలేదు. పాప మానడు చెప్పేవిధాన్నిబట్టి కొన్ని నేర్వవచ్చును. "దానితోలెందుకురా నీకు" అని వాడిని మరోగదిలోకి తీసికెళ్లి దిగబడితే సరి. అక్కడ ఏపత్రికో పళ్లెమో, లేక ఆట బొమ్మో అప్పగిస్తే దీపాన్ని మరిచిపోతాడు. విసుగెత్తిపోయి వాడు అక్కర్లేదనకున్న లక్కపిడతల్నే వాడి కొప్పగించినా లాభం లేదు. వాడికి విసుగెత్తించిన వస్తువుల్ని కాని ఇతరవస్తువులివ్వాలి. వీటితో విసుగెత్తినప్పుడు మళ్ళీ మొదటివస్తువులిస్తే వాటిపైన విసుగు మరిచిపోతాడు. అలా కొన్ని రోజులు చేసే సరికి ఇంక దీపం ఎలాగూ అందదని వాడికి నిర్ధారణవుతుంది. అప్పుడు దీపంమీద దాడి మానుకుంటాడు. తీరా బొమ్మలిచ్చినతరవాత కొంతసేపు వాటితో ఆడుకుని తరవాత మళ్లీ దీపంమీది కొస్తాడనుకోండి. అప్పుడు కూడా కసిరితిట్టినా ప్రయోజనం ఉండదు. ఎప్పటికప్పుడు వాడిని దూరంగా తీసుకుపోతూఉండాలి, అలా తీసుకుపోయేటప్పుడు కోపం కనపరచ



జీవకారుణ్యసంఘంవారిచే పోషింపబడుచున్న బాలురు. (పాకిస్తాన్ అల్లర్లలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాధబిడ్డలు. (ఇందు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షకువెళ్లిన బాలురుకూడా గలరు.)

కూడదు. చిరునవ్వుతోనే పలకరించి ఇతర వస్తువులు చూపి మరిపించడానికి ప్రయత్నించాలి. కోపం చూపిన కొద్దీ రెట్టించడం పిల్లల సహజలక్షణం. కోపం చూపకుండా దీపం ముట్టుకునే వస్తువు కాదని, ఆడుకోడానికి తగినవస్తువు కాదని వాడికి తెలిసివచ్చేలా చెయ్యాలి గాని మాటలతో చెప్పి ప్రయోజనం లేదు. దీపందగ్గరికి పోరాదని తల్లికి నిర్ధారణగా తెలిసినట్లుండాలి. వాదించడానికి, లేక తిరగబడ్డానికి అవకాశం ఇవ్వకూడదు.

ఫలానిపని తగదని చెప్తేగాని వాడికెలా తెలుస్తుందనవచ్చు. తెలుస్తుంది. మాటల్లో కంటె చేతలద్వారా నేర్పడం సులువు. వేలు జలిపించి వీల్లేదు అని దండించినట్లు చెప్పడంవల్ల వాడి ఆత్మాభిమానానికి దెబ్బ తగుల్తోంది. వాడిని రెక్కతో గుంజి ముఖం మీద ముఖంపెట్టి "చెప్పినట్టు వింటావా వినవా" అని దండిస్తే, లేక అరగంటసేపు తిట్లతో లెక్చరిస్తే, పాప తప్పకుండా తల్లిపైన కక్ష కడతాడు. చెలగాట నూడతాడు. వాడి అభిమానానికి దెబ్బ తగలకుండా, ఎవరూ చూడనట్లు వాడి తప్పిదాన్ని వాడు సవరించుకోడానికి తగిన అవకాశం ఇవ్వాలి. పిల్లలు నేర్చేవాటిలో కోపం అభిమానం ముందు వస్తాయి. అవే పెంకితనానికి, తరవాత పాడైపోడానికీ దారి తీస్తాయి. వాటినే సక్రమంగా వినియోగపర్చినట్లయితే రాణిస్తాయి.

ఒక రెండేళ్లపాప ఒక పాప గదిలోకి అడుగుపెడుతుండగానే తల్లి అందుకుంది. "ఇదుగో, ఇప్పుడే చెప్తున్నా, విను, ఆ కుంపటిదగ్గర కెళ్లావా వీపు బద్దలౌతుంది" అని బిగ్గరగా చెప్పింది.

అప్పటివరకు కుంపటివంక చూడని పాప దృష్టి వెంటనే మళ్లింది. కొంత జంకుతో, కొంత కొంటెతనంతో పాప కుంపటివైపు మెల్లిగా అడుగులు వేయడం మొదలెట్టాడు. తల్లి మరింత బిగ్గరగా అరిచింది. ఊహు, పాప మానలేదు. పాపని పట్టుకోడానికి తల్లి ముందుకి అడుగు వేసింది. పాప గబగబా కుంపటిదగ్గరికి అడుగు వేసింది. పాప కుంపటిపైన చెయ్యి వేసేసమయంలో తల్లి వచ్చి చెయ్యిపట్టుకుంది. ఆ ఊపుతోనే చేత్తో పాపను పైకెత్తి గట్టిగా అరుస్తూ కొట్టడం ఆరంభించింది. పాప అభిమానంతో తగిలిన ... తల్లికంటె బిగ్గరగా గొంతుచించుకొని ఏడవడం ఆరంభించాడు. ఆపైన వంటఇంట్లో దక్షయజ్ఞం జరిగినంత పనైపోయింది. పాప సోలినిద్రపోయేవరకు తుపాను వెలిసిపోలేదు. ఇది కేవలం అవివేకం. ఆతల్లిపిల్లలందరు ఇలాగే చెప్పినమాట వినడం మానేశారు. వాళ్లని అదుపులో పెట్టలేక తల్లి సతమతమౌతోంది. అనవసరంగా ఆర్భాటం అల్లరి ఇంట్లో అధికమైనాయి. తల్లికీ బిడ్డలికీ కంగారు, నరాల బలహీనత పీడిస్తున్నాయి. ఇటువంటిఇల్లు తల్లికీ పిల్లలకీ కూడా నరకప్రాయమే. తల్లి చాకచక్యం చూపించకపోతే పిల్లల్లో భీతి అల్లరి, పెంకితనం ఏడుపు అలవడతాయి.

పాపకుంపటిదగ్గిరకి వెడుతోందనుకుందాం. సామాన్యంగా తల్లి ఆ 'ఆఁ అం...' అరిచి దూకివాడిని దూరంగా లాగేస్తుంది. అంతే కాని తాపీగా కూచుని "చెయ్యి కాల్తుందిరా. అక్కడికి వెళ్లకూడదురా" అని పాఠాలు చెప్తూ కూచోదు. అదే మాట్లాడకుండా చడీచప్పుడూ కాకుండా వెళ్లి కుంపటి దగ్గిరికి చేరకుండా తీసేస్తే, పాప తెల్లబోయి చూస్తాడు. కుంపటిదగ్గిర చేరబోయినప్పుడల్లా అలా వాడిని లాగేస్తే చివరికి అది వాడికెలాగూ అందదని నిర్ధారణ చేసుకుని ఆ ప్రయత్నం మానేస్తాడు.

పాపని బజారుకి తీసికెడితే వాడికి కాలునిలవదు. తల్లిని అంటిపెట్టుకొని ఉండడు. తల్లి ఇటు చూస్తుండగానే ఎట్లో దాటేస్తాడు. ప్రతిగుమ్మం ఎక్కుతానంటాడు. చేతికందినవన్నీ లాగుతానంటాడు, పిలిచినకొద్దీ చేతికందకుండా తప్పించుకు తిరుగుతాడు. తిట్టిపట్టుకోడానికి రాబోతే సైకిళ్లు కార్లు బళ్లు చూసుకోకుండా రోడ్డుకి అడ్డం పడతాడు. కానితల్లికి కొంచెం నేర్పు ఉంటే ఏబాధా పెట్టకుండా చేసుకోవచ్చును. వాడిని ఆపే అడ్డుపెట్టకుండా ఎక్కడికి వెడతాడో కూడా వెళ్లాలి. కొంతసేపటికి విసుగెత్తి తల్లికోసం చూస్తాడు అప్పుడు తల్లి ఎక్కడికి నడిపిస్తే అక్కడికి కూడా వెడతాడు. తల్లి మెల్లిగా నడుస్తున్నట్లయితే ముందుకి వెళ్ళివెళ్ళి, వెనక్కి చూసి తల్లికోసం ఆగుతాడు. లేక తల్లి త్వరత్వరగా నడిస్తే, అందుకోడానికి ప్రయత్నిస్తాడు, దారిపక్కకి షికార్లు చేస్తుంటే కొంతసేపు తల్లి మాట్లాడక ఊరుకుని, తరవాత ముందున్న వస్తువేదో చూపించి మరిపించవచ్చును. పాపకోసం చెప్పించకుండా. పంతం పట్టడానికి అవకాశం లేకుండా చేస్తే, వాడే దారికి వస్తాడు.

ఎత్తుకొన్నప్పుడు కాని, మంచంమీదనో ఉయ్యాలలోనో కూచోబెట్టినప్పుడు కాని చేతిలోవున్న లక్కపిడతో దండకాయని క్రింద పారేస్తాడు. ఏడాది యీడులో ఇది పాపకి ఆటకూడా పారెయ్యాలని పారేసి కిందికి చూస్తాడు-ఏమయిందో చూడాలనే కుతూహలంతో. అన్నకమున్దు కిందపడేసి అదేమయిందో చూస్తాడు, పారేసినవస్తువుని తిరిగి చేతికిచ్చేవరకూ ఏడుస్తాడు. అదితీసి చేతికివ్వాలి. ఇవ్వగానే మళ్లీపడేసి ఏడుస్తాడు. దీనివల్ల తల్లికి ప్రాణం విసిగిపోయి కోపం కూడా వస్తుంది. ప్రత్యేకం పనికట్టుకుని వాడు తన్ని హింస పెడుతున్నాడనీ, అది వాడు తెలిసే చేస్తున్న దుర్మార్గమేననీ చికాకులో తల్లికి తోచవచ్చును.

కాని నిజంగా పాపకి తల్లిని బాధపెట్టాలనే తలపుండదు. వస్తువుల్ని గిరవాటు వేసే ప్రజ్ఞ కొత్తగా అబ్బినప్పుడు ప్రతిపాపా అలాగే చేస్తాడు. తనప్రజ్ఞ ప్రభావం తెలుసుకోడానికి వీలైతే రోజంతా ఆమాదిరిగా ఆడగలడు-మూడు చక్రాలసైకిలెక్కి నాలుగేళ్ళ పిల్లవాడు రోజంతా దాన్ని విడవకుండా తొక్కేమాదిరిగా. లక్కదొండకాయ కిందపడేసినప్పుడు తల్లి అందిస్తుంటే అది పాపకి చక్కని ఆటగా కనపడుతుంది. తనకు కొత్తగా దొరికిన ప్రజ్ఞతో, మరొకవ్యక్తితో ఆడుకోవచ్చని గ్రహించినప్పుడు పాపకి ఆటలో హుషారెక్కువౌతుంది. అన్నం తింటూ తింటూ, కడుపునిండుగానే అన్నం ముద్దలు గిరవాటెయ్యడం ప్రారంభిస్తాడు. పారెయ్యడం మొదలెట్టగానే దగ్గిరనించి అన్నం తీసెయ్యాలి. తీసెయ్యడంలో వాడి దృష్టి మరల్చి మరిపించాలి. లేకపోతే తసవు పెట్టగలడు. తిట్టవి విసుక్కున్నందువల్ల ఆవంతైనా ఉపయోగం ఉండదు.

అందువల్ల పెంకితనం, ఏడుపుగొట్టుతనం అలవాటు పడకుండా జాగ్రత్తపడాలంటే, వాడికీ కోపం అభిమానం ఉంటాయనే విషయాన్ని తల్లి గ్రహించి, వాడిఅభిమానం దెబ్బతగలకుండా జాగ్రత్తపడ్డం అవసరం. లేదా తల్లికి హైరాను, పాపకి మంకుతనం తప్పవు.

[డా॥ బెంజామిన్ స్పాక్ గ్రంథం ఆధారం].

"సభ్యత"

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

ఇది యంత్రయుగంసభ్యత. (అది కేవలం యాంత్రికమైనా) నేడు చరమోత్కర్ష నొందినది. ఆకులనూ దుంపలనూ కాల్చికొని తినడమైనా తెలియని రాతియుగం (*stoneage*) నాటి మానవుడు క్రమికవికాసంతో ఆటంబాంబు నిర్మించే అభినవబ్రహ్మయైనాడు. ప్రతిమానవుడూ తనకాలాన్ని గతకాలంకంటే సభ్యమైనదిగా భావిస్తాడు. అగ్ని ఉపయోగమైనా తెలియక ద్విపాదమృగంవలె సంచరించే ప్రాచీనరాతియుగంమానవునికంటే రకరకాలపనిముట్లను రాతితో తయారుచేసి నేర్పరితనాన్ని ప్రదర్శించిన నూతనరాతియుగమానవుడు సభ్యుడుగా లెక్కించబడును. అతనికంటె ఖనిజములఉపయోగం తెలిసికొని యినుముతో యితరలోహములతో వస్తుజాలాన్ని నిర్మించిన లోహయుగం (*Metalage*) నాటి మానవుడు సభ్యుడుగా భావించబడును. ఈ విధంగా సభ్యత క్రమవికాసయుతమైనది.

మానవజాతి పుట్టుకతోనే సభ్యతకూడా పుట్టినది. ఆధునికసభ్యతకు యూరప్ ఆలవాలమైనట్లే ప్రాచీనయుగసభ్యతకు ఆసియా కూడలి. అతిప్రాచీనకాలంలోనే యూరప్ ప్రజలు మృగత్వాన్ని వీడనిసమయమునందే భారతవర్షంలో ఈజిప్టులో బాబిలోనియాలో సభ్యతాపూర్ణమైన సామ్రాజ్యములు వెలసినవి. దురదృష్టవశాత్తూ పాశ్చాత్యచరిత్రకారులు ఈజిప్టుబాబిలోనియాగ్రీసుల ప్రాచీనత్వాన్నంగీకరించినా, మనసభ్యతనంత ప్రాచీనమైనదిగా భావించలేరు. వీరైతే మనప్రాచీనచరిత్రను స్వల్పంగా భావింపజేయడానికి చరిత్రలోకూడా మార్పులుచేసే అఘటనాఘటనసమర్థులు వారు. మొహంజోదారో ఆర్యులనాటి కపూర్వం ఐదువేలేండ్లనాటిది. మొహంజోదారో సభ్యత యిప్పటి ఆ శిథిలాలలో కన్పించే ఆపరిపూర్ణత నొందడానికి అంతకుపూర్వమే ఎన్నేండ్లనుంచీ క్రమికవికాసము నొందియుండునో చెప్పలేం. భారతీయ చరిత్రను ఊహామాత్రంగా తెలిసికొన్న పాశ్చాత్యుడైనా భారతదేశప్రాచీనవిభవాన్నూహించుకొనగలడు.

ఒక దేశముయొక్క సంపూర్ణచరిత్రను తెలిసికొనవలెనంటే ఆదేశంయొక్క సభ్యతాసంస్కృతుల నర్థంచేసికొనవలెను. యూరప్‌లోని మధ్యయుగంనాటి సభ్యతాసంస్కారములు పూర్తిగా రెలిజియన్సుపై పోపు (*Pope*) ప్రాబల్యంపై ఆధారపడినవే. ఆనాటి పరిపాలనలోకూడా చర్చికే ప్రాధాన్యం. మనదేశంలో ఎప్పుడూ రాజ్యంపై సభ్యతపై యీవిధమైన మతప్రభావం లేదు. గుప్తరాజులనాటి మనసభ్యత మధ్యయుగంనాటి యూరప్ సభ్యతకంటే ఉత్కృష్టమైనది. కానీ వాళ్లు క్రమవికాసంతో పురోగమించారు. కానీ మనసభ్యతలోని చైతన్యం క్షీణిస్తూ, మహమ్మదీయుల పరిపాలననాటికి మనసభ్యతా, మనవికాసశక్తీ కరడుగట్టిపోయినవి. యూరప్ పురోగమించే కొలదీ మనం తిరోగమించడం ప్రారంభించాం. ఒకనాడు మనలోని ప్రతిభాశక్తులను మహోత్కృష్టంగా ప్రేరేపించిన ప్రతిభాసంస్కృతులూ గతిశీలమైనశక్తి మటుమాయమై యంత్రయుగం వచ్చేసరికి మనం వ్యక్తిత్వమునే పోగొట్టుకొని పాశ్చాత్యసభ్యతకు దాసులై పోయినాం.

రాజ్యంకంటే వ్యక్తికంటే సభ్యత బలిష్ఠమైనది. ఒకదేశం మరొకదేశాన్ని జయించవచ్చును కాని ఆ దేశసభ్యతను మార్చలేదు. భారతదేశం ఎన్నోమార్లు జయించబడ్డది. కానీ దృఢమైన భారతీయసభ్యత ఏమీ మొక్కపోలేదు. ముస్లిములు భారతదేశాన్ని జయించినా యిక్కడనుంచే అనేకవిషయములను నేర్చుకొన్నారు. మనం ఎప్పుడూ వాళ్లసభ్యత ననుకరించలేదు. రోమన్లు గ్రీకుదేశాన్ని జయించారు. కానీ సాంస్కృతికవిజయం గ్రీకులదే. వారిసభ్యతసమగ్రమైనది. కనుక గ్రీకుశాస్త్రములను చదవడం గ్రీకుకళనూ భావాల్నీ అనుకరించడం గౌరవంగా రోమన్లు భావించుకొన్నారు. జయించిన రోంపూర్తిగా గ్రీకుసభ్యతామయమైపోయినది. అదేవిధంగా స్పెయిన్ మొదలగు దేశములు రోమన్‌సభ్యత ననుకరించినవి. ఉత్కృష్టమయిన దేశం తనతో అసమానమయిన దేశాన్ని సాంస్కృతికంగా జయించడంసహజమే.

వ్యక్తిఅభిరుచులనుబట్టీ అవసరాలనుబట్టీ సభ్యత మార్పుజెందుతూ ఉంటుంది. ప్రతిదేశానికి తన ప్రాచీనసభ్యతపై గర్వం సహజమే. ఔన్నత్యమునొందిన దేశం తనకంటే చిన్నదేశాన్ని అసభ్యమనడమూ సహజమే. మన మంచిదినాలలో పాశ్చాత్యులను అప్రాచ్యులని తిరస్కరించాం. ప్రాచ్యులు కానివారందరూ అసభ్యులని మన ప్రాచీనుల అభిప్రాయం. అదేవిధంగా వాళ్ళూ సభ్యులై మనల్ని అసభ్యులన్నారు. బర్బరులన్నారు. కొంతమందికి ఒక్కొక్క సభ్యతపై మక్కువజాస్తీ. పీటర్. ది గ్రేట్ చక్రవర్తిగారికి పాశ్చాత్యసభ్యతపై మహాప్రీతి. రష్యానంతా పాశ్చాత్యసభ్యతామయం చేయవలెనని ఆయన కలలు కన్నాడు. మనదేశంలో మొదటి ముస్లింనాయకుడు సర్ అహమ్మద్‌ఖాన్‌గారూ యిదేవిధంగా పాశ్చాత్యసభ్యతతో విభ్రాంతులై యింగ్లీషు నేర్చుకొని పాశ్చాత్యసభ్యత నలవరచుకొని శుభ్రంగా క్లర్కులుగావడమే ముస్లిములకు శరణ్యమని ఉపదేశించేవారు. భారతీయ క్రైస్తవు లనేకులు ఏవిషయంలోనా భారతీయతయే లేకుండా యూరోపియన్ల ననుకరిస్తారు. పాపం ఎంత మారినా చర్మాన్ని మాత్రం మార్చుకొనలేరు.


సభ్యత ఒక మహాసముద్రంవంటిది. వేలకొలది సంవత్సరాలూ నూర్లకొలదీ మహాత్ములిచ్చిన చైతన్యంద్వారా అది పెంపొందును. ప్రతిభావంతుడైన వ్యక్తి ఆనాటి సాంఘిక భావనలన్నిటినీ మార్చి నూతనమైన సభ్యతనూ జాతీయతనూ స్థాపించగలడు. సోక్రటీసు ప్లేటో డెమొస్తనీసులద్వారా గ్రీకుదేశం ఉత్కృష్టత నొందగలిగినది అలెక్‌జాండర్ వంటి మహావీరులు సంపాదించలేని కీర్తిని మహిమనూ యీవ్యక్తులు గ్రీసుకు సంపాదించినారు. విలియంజోన్సుగారు కాళిదాసు

నాటకముల ననుపదించేవరకూ పాశ్చాత్యులు మనకూ ఉత్తమమైన ప్రాచీనసభ్యత ఉన్నదనువిషయాన్ని విశ్వసించలేదు. మహాత్ములు తమ స్వయంకృషిద్వారా తమదేశాన్ని సభ్యదేశాల్లో ఉత్తమంగా మార్చివేస్తారు.

కొందరు దర్జీవాడిచ్చే డ్రసింగునే సభ్యతాసర్వస్వ మనుకొంటారు. ఆవిధంగా చూస్తే గంగిరెద్దే మహాసభ్యమైనది. దానికే డ్రస్సింగు ఎక్కువగనుక. ఒకదేశం లేక జాతియొక్క సామూహికసంస్కారాలనూ వాటి విలక్షణమైన సాంప్రదాయములనూ ఆదేశం యింతవరకూ పొందిన వికాసాన్నీ మనం సభ్యత అంటాం. యూరప్ గొప్ప సభ్యత గలది. ఎక్కువ పురోగతిలో ఉన్నది. యూరపియన్ల దురలవాట్లనూ వేషాన్నీ అనుకరించి మనమూ సభ్యులముని మురిసిపోతాం. కానీ యూరప్ యింత పురోగమించడానికి యూరపియన్లలోని ఏపట్టుదలా, సంఘశక్తి సంకల్పబలం జాతీయతో, ఉద్యమసాహసములూ తోడ్పడినవో వాటినిమాత్రం అనుకరించడానికెప్పుడూ ప్రయత్నించం. ముసల్మాన్ల అలవాట్లనూ సభ్యతాసాంప్రదాయములనూ నిరసిస్తాం. కానీ నేపిల్స్ స్పెయిన్‌లను జయించి మధ్యయుగంలో మహాసభ్యమైన యూరప్‌నే వణకించినా వారి సంఘశక్తినీ ఐక్యతలోని అర్థాన్నీ అవగతం చేసికోలేం. యితరుల చెడ్డ ననుకరించడం మంచిని విడవడం మన కలవాటైపోయినది.

మనదేశం చాలాకాలం పరాధీనం. దాసుడు ప్రభువు ననుకరించడానికే ప్రయత్నిస్తాడు, మనమూ శక్తివంచనలేకుండా యింగ్లీషుసభ్యతనే అనుకరించాం. ఆధునిక కాలంలో ఆసియా మొత్తంపై యూరప్ ప్రభావ మెక్కువగా ఉన్నది. ఆసియా అంతటా యూరప్‌కు కాలనీ లున్నవిగనుక యూరప్‌సభ్యతయే ఆసియాకూ ఆదర్శమైనది. బర్బరులైన అరబ్బులూ పాశ్చాత్యులతో పశువులుగా చెక్కించబడే నీగ్రోలు కూడా యూరప్‌నే అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆసియాసభ్యతయొక్క స్వతంత్రాస్తిత్వం నశించినది. ఉత్కృష్టమైన సభ్యత నందరూ పాటించవలసినదే. కానీ తమవైశిష్ట్యాన్నే అనుకరణలో పోగొట్టుకొనగూడదు, పీటర్‌గారివలె కాథరిన్‌గారివలె యూరప్ ననుసరించడమే పరమావధి కాగూడదు. ఏపారిస్‌లోనో పుట్టిన ఫాషన్ మరుక్షణంలోనే ఆసియాఅంతటా అనుకరించబడుచున్నది. ఏజర్మనీలోనో పుట్టిన సిద్ధాంతం ఆసియాలోనా ఆదర్శంగా ఎంచబడుతున్నది. యూరప్‌లో పుట్టిన వింతలన్నీ పట్టుకొని యిదేయీనాటి సభ్యత అంటున్నాం. కానీ మనం యీనాటిసభ్యతగా భావించే ఆవింతవెనుకనే దాని ప్రతిక్రియ (*reactson*) కూడా ఉన్నదనే విషయాన్ని మరచిపోతున్నాం. ఆసియాలోని సభ్యతద్వారా ఆసియాలోని మహాత్ముల సందేశములద్వారా యూరప్ జ్ఞానభిక్షను పొందే కాలం పోయినది. యూరప్‌లోని వింతఅలవాట్లనూ ఫాషన్లనూ వాదాలనూ అనుకరిస్తూ యివే ఈనాటి సమస్యలని మురిసే స్థితి దాపురించినది.

ప్రస్తుతం మన సభ్యత త్రిశంకుస్వర్గ స్వరూపంలో ఉన్నది. మన ప్రాచీనసభ్యత అర్థంలేని ఆచారాలలో పడి రూఢిగ్రస్తమై చాలావరకూ సంకీర్ణమై పోయినది. మన సభ్యతాసాంప్రదాయములు సనాతనత్వానికి పర్యాయమైపోయినవి. మన సభ్యత ప్రస్తుతం సున్నితమైన స్థితిలో ఉన్నది. ప్రాచీనసమాజమును అంతమొందించాం. కానీ నవీనసమాజాన్నీ సరికొత్తసంఘాన్నీ నిర్మూలించలేదు గనుక జనసామాన్యం ఒకవంక ఆచారాలతో మరొకవంక దానికి పూర్తిగా భిన్నమైన పాశ్చాత్యసంప్రదాయములతో విభిన్నప్రవృత్తుల కాలవాలమైనారు. ప్రాచీనతను పూర్తిగా నిరసించనవసరంలేదు. ఆదునికతనూ పాశ్చాత్యతనూ పూర్తిగా దూషించనవసరంలేదు. ప్రస్తుతం కొత్తనూ పాతనూ ప్రాచ్యాన్నీ పాశ్చాత్యాన్నీ సమైక్యం చేసి విభిన్నత్వంలో ఏకత్వమును సృష్టించగలిగే శక్తివంతమైన సమాజం మనకు కావలెను. ప్రాచ్య, పాశ్చాత్యములు మేళవించి జీవశక్తితో వికసించే సమాజమును నిర్మించడానికి నాయకులు ప్రయత్నించవలెను.



భారతప్రభుత్వ కార్మికమంత్రి జగజ్జీవనరామ్‌గారు యీనెల 10 న ప్రభుత్వభవనంలో ఉద్యోగుల ప్రభుత్వభీమాసంస్థ సభ్యులకు విందుచేసినప్పుడు తీసినచిత్రం. చిత్రంలో నల్ల షేర్వాణీతో నున్నవారు జగజ్జీవనరాంగారు.

రూపాంతరాలు

"సులోచన"

అజంతాగుహల్లో చిత్రమైన బుద్ధప్రతిమ ఒకటి ఉందిట. ఆ విగ్రహాన్ని ముందు నిలబడి చూస్తే దివ్యసందేశామృతం ప్రసాదిస్తున్నట్లుటుందిట. కుడిప్రక్కనుంచి చూస్తే చింతాక్రాంతుడైయున్న సిద్ధార్థ స్వరూపం గోచరిస్తుంది. ఎడమప్రక్కనించి చూస్తే తపోదీక్షతో అంతర్విలీనుడైన బోధిసత్వస్వరూపం కనిపిస్తుందిట. అటువంటి అపూర్వకళాభిజ్ఞత ప్రదర్శించిన శిల్పినిగురించి మనకి ఏమీ తెలియదు కాని, ఏ విషయానికిగాని అనేకారాలు అనేక స్వరూపాలు కల్పించే కళ నేటిరాజకీయాలలో అద్భుతంగా రాణిస్తోంది.

రాజకీయాల్ని బట్టే వార్తలు, విషయాలు, ప్రకటనలు, చివరికి వ్యక్తులఆకారాలుకూడా అనేకాకృతులు పొందుతున్నాయి.

నిజానికీ అబద్ధానికీ మధ్య కల మేర అంతటా రెండూ రకరకాలపాళ్ళలో మిళితమై వింతవింతరంగులు ఛాయలు కొనవస్తున్నాయి.

అందువల్లనే ఈ రోజుల్లో పత్రికలకి కూడా రంగులు ఆపాదిస్తున్నారు. వీటిలో కనిపించే రంగులు కొన్నీ, కంటికి కనిపించకుండా "ఉన్నానున్నా" అంటూ బుద్ధికి తోపించే రంగులు కొన్నీ, మొత్తానికి ఈ నాడు వార్తలు చదువుతోంటే రకరకాల రంగులు కళ్ళని కట్టినట్లుంటాయి,

ఈ క్రొణమంగళవారపు రంగుల భరాటాల్నించి కళ్లు కాపాడుకోడానికి సులోచనాలు, తప్పడంలేదు. అయితే ఈ సులోచనాలవల్ల ఒక బాధ ఉంది. ఇవి పెట్టుకు చూస్తే లేని కొత్తరంగులు మరికొన్ని కనిపించవచ్చును. లేదా ఉన్నరంగులే కొన్ని కనిపించకుండా పోవచ్చును.

ఈ సులోచనాల్తో చూస్తే ఊహలు అపోహలుగాను, అపోహలు సరైన ఊహలుగాను కనిపించగలవుకూడా.

మచ్చుకి నా కళ్లజోడులోనుంచి చూసినావు ఎలా కనిపిస్తున్నాయో ఒకటి రెండు ఉదహరిస్తా:

ఇండోచీనాలో పరిస్థితి ఎలా వుందని ఫ్రెంచిహైకమీషనర్ని ఒక పత్రికావిలేఖరి అడిగాడు. అతని సమాధానం ఇలా ఉంది.

"కొన్నిమాసాలుగా పరిస్థితి బాగుపడుతూనే ఉంది. కాని ఇంకా ప్రమాదంగానే ఉంది. మేం కోరినచోటికి ఎక్కడికైనా వెళ్లగలం. భయం లేదు. కాని అక్కడ నిలవలేకపోతున్నాం అంతే."

అంటే బాగుపడిం దనకోవాలా లేక ఏమనుకోవాలి? కర్ర విరక్కుండా పాముచావకుండా కొట్టేపద్ధతి ఫ్రెంచివాళ్లకి తెలిసినంత



బాగా మరెవరికి తెలియదు. ఫ్రెంచివారికి అమెరికాసహాయం కావాలి. అంటే అమెరికన్ల డబ్బు, ఆయుధాలు వగైరా కావాలి. కాని అమెరికన్లు ఉండకూడదు. పేరుకి డబ్బ్యా దన్కాం బావోదాయ్ కిచ్చినట్లే ఉండాలి. కాని అటు వాయనం చూపించి ఇటు తనచేతిలో పెట్టాలి "ఇండోచీనాలో వలసపరిపాలనాయుగం అంతరించిపోయింది" అంటూనే తమ పరిపాలన లేకపోతే వాళ్లు పాడై ధ్వంసమై పోతా రని బెదరిస్తారు. (అంటే కమ్యూనిస్టులైపోయి ఊరుకుంటారని వారి అర్థం) ఇలాగే మలయాలలో పరిస్థితి ఎలాగుందని బ్రిటిష్‌కమీషనర్‌జనరల్ని అడిగితే "అద్భుతంగా ఉంది" అన్నాడు, అయితే ఒక్కటే చిన్నలోపం ఉందట. నూటిరవై వేలమంది సైనికులు పోలీసులు ఏకమైనందువల్ల కొంబోలు ఏడువేలమంది కమ్యూనిస్టుల్ని పట్టుకోవడానికి వీల్లేకుండా ఉందిట.

ఒక్కొక్కప్పుడు కొందరు కొందరు మాట్లాడుతుంటే అర్థం పూర్తిగా అవగాహన కాదు సరికదా, అసందర్భమైన అర్థాలు స్ఫురిస్తాయి.

లియాఖత్ అలీఖాన్‌గారు హాలీవుడ్ వెళ్లారు.

"బుద్ధినీ హృదయాన్నీ బాగా విస్తరింపచెయ్యగల మహాశక్తివంతమైన పెద్దపరికరం, లేక తాళంచెవి, మీవద్ద ఉంది. లోకానికి ఇది ఈ నాడు అవసరమైనంతగా ఇదివరకెన్నడూ లేదు." అంటూ తళతళలాడే దుస్తులు ధరించి బారులు తీరి కూర్చున్న తారలకి వారు చెప్పారట.

"ప్రపంచంలో ఒకరిపై ఒకరు ఎంతగా ఆధారపడిఉన్నారో వెండితెరమీదుగా లోకానికి చాటింపుచెయ్యగల వీలు మీకున్నది" అనికూడా అన్నారు. ఇ దేం తాళంచెవో, ఖాన్‌గారి భావ మేమిటో పూర్తిగా అవగాహనకాదు.

ఇది రాజకీయపు చెవేనా కావచ్చు, శృంగారపుచెవేనా కావచ్చు.

అసలు రాజకీయాలంటేనే నీతికీ తంత్రానికీ మధ్య వెయ్యివిధాలు. వీటిని రంగుటద్దాల్లో చూస్తే అంతా అయోమయమే. అందువల్ల ఏసరుకు విలువైనా కట్టాలంటే మోగించి నాణ్యం తెలుసుకోవాలి. అలాగే రాజకీయాలు, వార్తలు, నాయకుల ప్రకటనలు వగైరా.

విదేశాలనుంచి పెట్టుబడి

ఆసియా, ఆఫ్రికాఖండాలలో అపారఖనిజ వృక్షసంపదలు, ప్రజాబాహుళ్యం రెండూ ఉన్నప్పటికీ, దుర్భిక్షం నివారణ కాకపోవడానికి హేతువు లేమిటి? అవసరాన్నిబట్టి వస్తువులు సృష్టి అవుతా యని ఆర్థికశాస్త్రజ్ఞులు చెప్పేసిద్ధాంత మేమయింది?

ఉన్న వస్తుసంపద ప్రజ లందరికీ సరిపోతుం దని కొందరు, సరిపో దని కొందరూ వాదిస్తున్నారు. ఈ వాదనసంగతి ఎలా ఉన్నప్పటికీ ఒక్కటిమాత్రం మనకి తెలుసును.

ఉన్న సంపద ప్రజలకి సవ్యంగా వినియోగపడటం లేదు. ముందుగా ఉన్నది వినియోగపరిచినప్పుడు కాని చాలుతుందో చాలదో ఇప్పుడు నిర్ధారణ చేసుకోడానికి వాదోపవాదాలు అనవసరం. ఉన్న వస్తుసముదాయాన్ని ఎందుకు వినియోగపరచలేకపోతున్నాం? వినియోగపరచాలంటే ఏమిచెయ్యాలి? ఇది ముందుగా తేలాలి.

ఈ సంపద ప్రజలకి వినియోగపడాలంటే పెద్దపెద్ద ప్రాజెక్టులు నిర్మించాలనీ, పెద్ద పరిశ్రమలు స్థాపించాలనీ చెప్తున్నారు. ఇలా చెయ్యాలంటే పెద్దయంత్రాలు కావాలి. యంత్రాలు తేవడానికైనా, నడవడానికైనా పెట్టుబడికి డబ్బు కావాలి.

ఇప్పటికి మనదేశంలో బ్రిటిష్‌వారి నిర్బంధాలు తొలగిపోయి మూడేళ్ళయింది. వ్యాపారం పరిశ్రమల అభివృద్ధికి ఆటంకాలేవీ లేవు. అయినా పెట్టుబడి పెట్టేవాళ్లు కనిపించడంలేదు. కాబట్టి విదేశాలనుంచి ధనవంతులు తమ ధనాన్ని మనదేశంలో పరిశ్రమలకీ, ద్రవ్యవ్యాపారానికీ పెట్టుబడి పెట్టాలి అంటున్నారు కాని విదేశాలనుంచి పెట్టుబడి సులువుగా రాదు. దేశంలో బ్రిటిష్‌వాళ్లు పెట్టిన పెట్టుబడిధనంలో దాదాపు నూరింట 60 వంతులు యుద్ధానంతరం ఇక్కడనించి తరలిపోయింది. భారతదేశానికి రిపబ్లిక్ వ్యవస్థ వచ్చినా సరే కామన్వెల్త్‌లోనే ఉంటుందని నిర్ణయమైన తరవాత తిరిగి మెల్లిగా ఆపెట్టుబడి తిరిగి వస్తోంది. కాని బ్రిటిష్‌వాళ్ల పెట్టుబడి పూర్వం ఉన్నంత చురుగా లేదు. బెదురుతూ బెదురుతూ వచ్చి మెల్లిగా నివాసం ఏర్పచుకుంటోంది. అమెరికన్లుమాత్రం బొత్తిగా విముఖత కనపరుస్తున్నారు.

దేశంలో పెట్టుబడిదార్లని ఏరీతిగా ఆదరిస్తారో, అదేరీతిగా విదేశాలనుంచి వచ్చే పెట్టుబడిదారుల్ని కూడా ఆదరించగలరనీ, ఫలానిఫలాని పరిశ్రమలు తప్ప మిగతా అన్నిటిలోను స్వేచ్ఛగా, ప్రభుత్వం స్వాధీనపరుచుకుంటుం దనే భీతి లేకుండా, పెట్టుబడిదారులు.వ్యాపారపరిశ్రమాదులు నెలకొల్పుకోవచ్చుననీ భారతప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినప్పటికీ అమెరికన్ పెట్టుబడిదారులు ప్రసన్నులు కావడం లేదు. కొద్ది హెచ్చుతగ్గుల్లో ఆసియా దేశాలన్నిటిలోనూ (అరబ్బీదేశాలు తప్ప) అమెరికన్ పెట్టుబడిదారుల వైఖరి ఈరీతిగానే ఉంది.


ఈ పరిస్థితికి హేతువుల్ని గురించి ఈమధ్య ఐక్యరాజ్యసమితి వారి ప్రాచ్యదేశ ఆర్థికాభివృద్ధిసంఘం పరిశీలన జరిపింది. ఈపరిశీలనలో భారతదేశం, బర్మా, సింహళం, పాకిస్తాన్, ఇండోచీనా, ఇండోనీషియా, కొరియా, మలయా. ఫిలిప్పైన్స్, సయాం, జపాన్ దేశాల నిపుణులు చేతులు కలిపారు.

పరిస్థితుల్ని పెట్టుబడిదారులు ఏదృష్టితో చూస్తారో, ఆ దృష్టితో గమనించి. ఈక్రింది పరిస్థితు లుంటే విదేశీ పెట్టుబడిదారులు ప్రసన్నులౌతారని నివేదించారు. అవి

1. ఆసియా దేశాల్లో రాజకీయపరిస్థితి సుస్థిరంగాఉండాలి. విప్లవాలు, అంతఃకల్లోలాలు విధ్వంసాలు ఉండకూడదు. అన్యదేశాలవల్ల దురాక్రమణప్రమాదం ఉండకూడదు.

2 ప్రాణమానవిత్తాలకి క్షేమం ఉండాలి. అంటే ఆస్తుల్ని ప్రభుత్వం వశపరుచుకోకుండా హామీ లుండాలి. ధ్వంసం చెయ్యబడితే భీకూలు నష్టపరిహారాలు బలమైన వుండాలి.

3. కోరినంతలాభాలు ఆర్జించుకోడానికి వీలుండాలి, అంటే కూలీ తక్కువ, ఖర్చులు తక్కువ, ముడివస్తువుల ధరలు



ఢిల్లీలోని జక్ రాయబార కార్యాలయంవారు మే 9 వ తేదీన జకోస్లావియా స్వాతంత్ర్య దినోత్సవం జరిపారు. ఆ మహోత్సవాలకు ప్రధాని నెహ్రూ, కుమార్తె ఇందిరాగాంధీ సహా హాజరైనారు. జక్ రాయబారి సతీసమేతంగా ప్రధాని నెహ్రూను ఆహ్వానించుచున్నారు.

తక్కువ, అమ్మకపు ధరలు ఎక్కువ ఉండాలి.

4. పరిహారాలకు పూర్తి అవకాశా లుండాలి, అంటే విదేశీయుల పెట్టుబడు లతో స్థాపించబడే పరిశ్రమలు వ్యాపార సంస్థలు మొదలైనవాటిని ప్రభుత్వాలు స్వాధీనపరుచుకున్నా, లేక దేశీయులపరం చేసినా పరిహారధనాన్ని పూర్తిగా జూపూ లేకుండా మళ్ళీ ఆ విదేశాలకు, వారు కోరిన ద్రవ్యరూపంలో ఒప్పగించడానికి వీల్లుం డాలి.

5. రాగల లాభాల్ని, డివిడెండ్లని, వడ్డీల ఆదాయాన్ని డాలర్లలోనో లేక వారు కోరే ద్రవ్యంలోనో వారి దేశానికి చేరవేసు కోడానికి వీలుండాలి.

6. పరదేశాలనుంచి తీసుకురాగల పెట్టుబడి ధనంతో బాటు వారి నిపుణుల్ని ఇంజనీర్లు గుమాస్తాలు మేనేజర్లు క్యాపిటలిస్టు వగై రాల్ని ఈదేశానికి తీసుకువస్తే నివాసానికి నివాసానికి అనుమతి నివ్వడంలో ఏ బాధా ఉండకూడదు. వారు కోరుకున్నంత మందిని మన దేశంలో ప్రవేశించనివ్వాలి. వారిని వారి సంస్థల్లో (వారి షరతులపైనా వారి పద్ధతులపైనా) నియమించుకోవడంలో మన ప్రభుత్వం ఏలాటి ఆంక్షలూ పెట్ట కూడదు.

7. మనదేశంలో పన్నులభారం పెట్టు బడిదారులకి అట్టే బాధగా ఉండకూడదు.

8. ఉభయదేశాల పన్నుల విధింపుపద్ధతి వల్ల గాని, మనదేశంలో విదేశీయుల ద్రవ్యంపైన విధించే పన్నుల పద్ధతివల్ల గాని, రెండుమార్లూ పన్ను పడనివ్వగూడదు.

9. ప్రభుత్వపు నిర్బంధశాసనాలు బొత్తిగా ఉండకూడదు (అంటే ధరల నిర్ణయం, అమ్మకం కంట్రోల్, లైసెన్సుల పద్ధతి మొదలైన బాధ లుండకూడదన్న మాట)

10. కంట్రోల్స్ అమలు జరపడంలో విదేశీపెట్టుబడిదారుల్ని ఒకరీతిగా దేశీ పెట్టుబడిదారుల్ని మరొకరీతిగా ఆదరించే పక్షపాతబుద్ధి పనికిరాదు.

11. పెట్టుబడిదారుల్తో ప్రభుత్వం సహాయంగా పెట్టుబడిపెట్టి ఆ వ్యాపా రంలో పోటీ చెయ్యకూడదు.

12. విదేశీ పెట్టుబడిదారులపట్ల స్నేహం ఉండాలి.

ఈ పన్నెండువరాల్లోకీ మూడో వరం అన్నిటికంటే ముఖ్యం. అంటే లాభాలు కోరినంతగా ఆర్జించుకోడానికి సుక్షేత్రం ఉండాలనేది.

కాని ఈ కోరికలన్నిటినీ తీర్చే దేశం ఆసియాలో, (అరబ్బీదేశాలు, సయాంతప్ప) మరెక్కడా లేదు. కాబట్టి అమెరికన్ పెట్టు బడిదారులు ఈ దేశాల్లో కానీ పెట్టుబడి పెట్ట డంలేదు. ఇప్పుడిప్పుడే రాజకీయ స్వాతంత్ర్యం తెచ్చుకుంటూ రుచిమూస్తున్న ఈ దేశాలకి విదేశీపెట్టుబడిదారు లంటే పీడించుకుతిని నెత్తురుపీల్చే రాక్షసులనే భీతి ఒకటుందనీ, ఆభీతి పోయి వారు ఈ దేశాన్ని ఉద్ధరించడానికి వచ్చే దాక్షిణ్య మూర్తులనే భావం ఏర్పడితే గాని అమెరి కన్లు ఇటు ముఖమైనా తిప్పరని నివేదికలో చెప్పబడింది. క్రమక్రమంగా ఆత్మవిశ్వాసం రాజకీయబలం ఆసియా దేశాల్లో వృద్ధిపొందే కొద్దీ భీతి పోతుందని నివేదికదార్ల అభి ప్రాయం. ఈ దేశాల్లో శాసనాలు ఎంత భయంకరంగా ఉన్నప్పటికీ, ఏవీ సవ్యంగా అమలుజరగడం లేదనీ, విదేశీపెట్టుబడిదార్లు మన కంట్రోల్స్ చూసి భయపడ నవసరం లేదనీ వారన్నారు. ఈ కంట్రోల్సన్నీ మేకపోతుగాంభీర్యం కలవే నని వీరి అభి ప్రాయం.

ఈ నివేదిక చుస్తే ఒక విషయం స్పష్ట పడుతుంది. విదేశాలనుంచి పెట్టుబడి తెచ్చుకోవాలంటే పై పన్నెండువరాల్నీ ప్రసాదించవలసిందే. ఆ వరాల్ని ప్రసాదిం చడం అంటే, వ్యాపారగతి సరళమైనదనీ, వ్యాపారులు సమాజధర్మం తెలిసి వర్తించే నీతిమంతులనీ నమ్మి ప్రభుత్వాలు దేశఆర్థిక వ్యవహారాల్ని వారు కొప్పగించి ఉచ్చు లన్నీ సడలించా లన్నమాట. గుత్త వ్యా పారం మొదలైన ఉచ్చుల్ని పెట్టుబడిదారు లెగురై బిగిస్తారనే సందేహం కూడా ఉంచుకోకూడ దన్నమాట. పై పన్నెండు వరాల్లో 5, 6, 7, 9, 11 ఈ అయిదింటినీ గమనిస్తే ఫిలిప్పైన్స్‌లోని పరిస్థితికి ఇవి సరిపోలగలవు. ఫిలిప్పైన్స్ద్వీపాలకి అమె రికా రాజకీయస్వాతంత్రం ఇచ్చేసింది. కాని ఫిలిప్పైన్స్ రాజ్యాంగనిర్మాణం గురించి నిర్ణయాలు జరిపినప్పుడు ఈ వరాలన్నిటినీ విధించి అంగీకరింపచేసింది. అంతే కాదు. అమెరికన్ దేశస్థులికి అన్ని విషయాల్లోను ఫిలిప్పైన్స్వాసులతో సమానమైన హక్కు లుండాలని నిర్బంధపెట్టారు. దీనికి అంగీక రించక తప్పిందికాదు.


(ఫిలిప్పైన్స్ రాజ్యాంగస్వరూపనిర్ణయా నికి వారి రాజ్యాంగపరిషత్సభ అనుమతి ఒక్కటే కాక అమెరికన్ ప్రభుత్వం అను మతికూడా అవసర మయింది.)

ఫిలిప్పైన్స్‌లో పరిస్థితినిగురించి ఇటీవల చెన్నపట్నంలో లారెంజో టాటిస్టా ఉపన్య సించాడు. ఆర్థికదాస్యంవల్ల రాజకీయ స్వాతంత్ర్యం నిరర్థకమైపోతుందని చెప్తూ ఫిలిప్పైన్స్‌లో అనుభవాన్ని వివరించాడు.

(33-వ పేజీ చూడుడు)



కోళిక్కోడ్ లోని (మలబార్) రేడియో ప్రసార కేంద్రం.



కొండల దృశ్యం



ప్రొద్దున వేళ నీటపై మంచు తెరలు




లోయలో


వేసవి విశ్రాంతిస్థలం - ఉ

కొడై


కొండలోయల నున్న సరస్సు




ఉదయం, పొగమంచు



[illegible]




కొండఅంచు షెడ్లు




ఏటివ



సరస్సు



ఎండజల్లు




సరస్సు, పక్కనే పచ్చికలోయ

దకమండలం కొండలలో


కెనాల్

పరిసరాల సుందరదృశ్యాలు




జలస్థావరాలు





సరస్సులో ప్రొద్దున్నే పొగమంచు తెరలు



దూరాన్నుంచి కొండలదృశ్యం

సినిమా:

టూరింగ్ సినిమాలు కొత్తనిబంధనలు

సినిమా హాలులకూ టూరింగు సినిమాలకూ లైసెన్సులు ఇచ్చే సందర్భంలో పాటించవలసిన నిబంధనలను లైసెన్సులు ఇచ్చే ఉద్యోగులకు సూచిస్తూ చెన్నరాజ్యప్రభుత్వం ఒక ఉత్తరువు చేసింది. ఈ నిబంధనలు సినిమాటోగ్రాఫ్ ఆక్టుననుసరించి చేశారు. ఇవి అమలులోకి రావడంతోడనే ఇదివరకు ఉన్న నిబంధనలు రద్దు అవుతాయి.

నిబంధనల వివరం

పెర్మనెంట్ సినిమా హాలులు జనాభాననుసరించి ఉండాలి. అయితే 50 వేలపైచిలుకు జనాభాగల ప్రదేశాలలో పెర్మనెంట్ సినిమాల సంఖ్యకు పరిమితి పెట్టనక్కరలేదు.

టూరింగు సినిమాలకు లైసెన్సులు ఇచ్చేటప్పుడు ఆయాచోట్లగల పెర్మనెంటు సినిమాల లాభనష్టాలను నిర్లక్ష్యం చేయరాదు.

50 వేలకు తక్కువ జనాభాగల ప్రదేశాలలో ఎన్ని పెర్మనెంటుసినిమాలుండాలి, ఎన్ని టూరింగుసినిమాలుండాలి, అన్నది ఈదిగువ విధంగా నిర్ణయించాలి: 20 వేలకు మించీ, 30 వేలకులోపుజనాభాగల చోట్ల ఒక పెర్మనెంటు సినిమాకి, ఒక టూరింగు సినిమాకి లైసెన్సు ఇవ్వవచ్చు. 30 వేల నుంచీ, 40 వేలకు లోపుగల చోట్ల రెండు పెద్దసినిమాలకు, ఒక టూరింగుసినిమాకి లైసెన్సు ఇవ్వవచ్చు. జనాభా 40,50 వేల మధ్యఉండేచోట్లలో రెండు పెర్మనెంటు సినిమాలనూ, రెండు టూరింగు సినిమాలనూ అనుమతించవచ్చు. 50 వేలు పైచిలుకు జనాభాగలచోట్ల, పెర్మనెంటు సినిమాలలో దేనికీ 3 మైళ్ళలోపున ఎట్టి టూరింగుసినిమాకీ లైసెన్సు ఇవ్వరాదు.

3 మైళ్ళ లోపున ఎక్కడా పెర్మనెంటుసినిమాలు లేనిచోట్ల ఎన్ని టూరింగు సినిమాలను అనుమతించవచ్చునన్నది ఈ క్రిందవిధంగా నిర్ణయించాలి.

10 వేలకు పైబడీ 20 వేలకు లోబడీ జనాభాకలచోట్ల రెండు టూరింగు సినిమాలకు అనుమతించవచ్చు.

పెర్మనెంటు సినిమాలు ఒకదానికి ఒకదానికి మధ్య ఇంతదూరం ఉండాలన్న నిర్బంధమేమీ ఉండనక్కరలేదు.

పెర్మనెంటుసినిమాలు ఉండగా, టూరింగు సినిమాలకు కూడా అనుమతించిన చోట్ల ఆ రెండురకాలసినిమాలకు మధ్య దూరం 2 ఫర్లాంగులకు తక్కువ ఉండరాదు.


పైన తెలిపినవాటినిమిత్తం జనాభా లెక్క వేయడంలో ఒక ప్రదేశాన్నే కాక, ఆ ప్రదేశానికి చుట్టుపట్ల 3 మైళ్ళలోగల ప్రదేశాన్ని కూడా తీసుకోవాలి. పుణ్యక్షేత్రాలు, పారిశ్రామిక, వాణిజ్యప్రధాన్యంగల ప్రదేశాలువిషయంలో వస్తూపోతూవుండే జనాభాను కూడా లెక్క వేయాలి.

టూరింగు సినిమాలకు ప్రత్యేక నిబంధనలు

ఒకే ఒక టూరింగుసినిమా అనుమతించబడినచోట్లలో లైసెన్సు పొందిన 6 నెలలు ప్రదర్శనలు జరిపితే, ఆ తర్వాత 3 మాసాలు వ్యవధితో, ఈలోగా మరెవ్వరూ దరఖాస్తు చేసుకోకపోతే, తిరిగి ఆ ప్రదేశంలో ప్రదర్శనాలు జరుపుకొనేందుకు అనుమతించవచ్చు. (సినిమాటోగ్రాఫ్ నిబంధనలలో ఈ విషయమైగల నిబంధనను గురించి క్రమేణా ఆలోచించడమగును.)

టూరింగు సినిమాలు ఒకో చోట 6 మాసాలే ఉండాలని ఇంతవరకుకల నిబంధనను, 3 మైళ్ళలోపున ఎక్కడా పెర్మనెంటుసినిమాలు లేని ప్రదేశాలవిషయంలో దిగువవిధంగా మార్చడమైనది:—

(అ) ఒక టూరింగుసినిమా ఒక చోట 6 మాసాలు నడిస్తే, మళ్ళీ అక్కడే ఆ సినిమా మరి 6 మాసాలు నడిచేందుకు లైసెన్సు ఇవ్వడానికి మధ్య 3 మాసాలు వ్యవధి ఉండాలి. (ఆ)ఒకే ప్రదేశంలో వేరు వేరు చోట్ల రెండు టూరింగుసినిమాలకు ఒకేసారి లైసెన్సు ఇస్తే, 3 మాసాల వ్యవధి రెండింటికీ విడి విడిగా వర్తిస్తుంది.



ఆర్యసమాజ వార్షికమహోత్సవ—వరంగల్లు



సీతాదేవి శాపము

కుమారి రామాబాయి, రావిపాటి

[భారతదేశ స్త్రీలలో పతివ్రతామతల్లి సీతాదేవి సర్వోచ్ఛస్థానమాక్రమించెను. సీతారాములు భారతీయుల బహిఃప్రాణములు. ప్రతి హైందవుల హృదయసీమలను, గృహములను ఇప్పటికికూడ వారల లంకరించుచున్నారు. శ్రీరాముడు కేవలము పరమేశ్వరుడు.

ఆతని యుత్సాహశక్తియే జగజ్జనని జానకి. వారి యాదర్శజీవితములు మనకు వెలుగుదారుల జూపుచున్నవి. కష్టసమయములలో స్త్రీల స్వభావధైర్యముల పరీక్ష తరచు జరుగుచుండును. సీతాదేవి స్వయముగ ననేకకష్టములకు లోనుగావలసివచ్చెను. నిజముగా అన్ని బాధలు ఏ స్త్రీయును పడియుండదు. విపదగ్నిజ్వాలలలో కరిగి మేలిమిబంగారువలె మెరసెను. భారతీయసాహిత్యసంపద యామెమహోజ్వలచరిత్రవల్లనే పరిపుష్టమైనది. పురాణేతిహాసములు మొదలు జానపదగీతములవరకు యామెచరిత్ర మహామహిమాన్వితము. ఆమెయాదర్శజీవితములో నొక ఘట్టము పాఠకలోకమున కర్పించుచున్నాను.



పూర్వకాలమునుండి మిథిలా ప్రాంతములకు రాజధానీనగరము మిథిలయే. కాని జనకవంశక్షత్రియుల పాలనలో నుండుటచేత మిథిలానగరమునకు రెండవపేరు జనకపురి యనికూడ నున్నది. సీరధ్వజుడను జనకుడు రాజ్యమేలుచుండెను. అతడు బ్రహ్మజ్ఞాని, పరమవైరాగ్యసంపన్నుడు. ప్రజ లతనిని రాజర్షి యని పిలుచుచుండిరి.

ఒకనాడు జనకుడు యజ్ఞము చేయునిమిత్తము భూమి దున్నుచుండగా నాగటిచాలుయందు ఒక చక్కని కన్యక వెలువడెను. ఆమె రతీదేవికంటె సుందరి. లక్ష్మికంటె రూపసి. జనకుడామెను కన్నబిడ్డకంటె మిన్నగ పెంచుచుండెను. నాగటిచాలు (సీతా) నుండి బుట్టుటచే నామెకు 'సీతా' యని పేరు పెట్టిరి. ఆమె శుక్లపక్షచంద్రునివలె దినదినప్రవర్ధమాన యగుచుండెను.

ఒకనాడు తన చెలికత్తెలతో నుద్యానవనమున విహరించుచుండగా నొక చెట్టుకొమ్మపై గూర్చుని మనోహరమగు కథ

చెప్పుకొనుచున్న రెండురామచిలుకల నామె చూచెను.

"ఈ భూతలమున శ్రీరాముడను ఒక సుప్రసిద్ధు డగు రాజు పుట్టును. ఆతని రాణి సీత. శ్రీరాముడు చాల మనోహరుడు; బుద్ధిమంతుడు. ఆతడు సమస్త రాజాధిరాజుల తన వశము జేసికొని సీతతో పదకొండువేల సంవత్సరములు రాజ్యమేలును. సీతారాములు పరస్పరప్రేమతో ఇహలోకసౌఖ్యముల చూరగొందురు."

ఈమాటలు విని సీత తన చరిత్ర చెప్పుచున్న యీ చిలుక లెవరై యుండును, వీటి నెట్లైన బట్టుకొనవలె నని తలచి వాని బట్టి తెమ్మని చెలికత్తెల కాజ్ఞాపించెను. చెలికత్తెలు వాటిని నేర్పుతో బట్టి తెచ్చి సీత కిచ్చిరి. ఆమె వాటిని తన కరపల్లవములచే మెల్లన దువ్వుచు, "మీ రెవరు? ఎక్కడనుండి వచ్చితిరి? సీతారాము లెవరు? వారి పరిచయ భాగ్యము మీ కెట్లు గలిగినది? నిజము జెప్పుడు, మీకు భయము లేదు" అనిన, అప్పు డా చిలుకలు చెప్పదొడగెను:

సుందరీ! వాల్మీకి యను ఒక గొప్ప మహర్షి గలడు. మేము వారి యాశ్రమమున యుండువారము. ఆ మహర్షి రామాయణ మను పేర నొక మహాకావ్యము రచించెను. దాని కథ యత్యంతమనోహరము. మహర్షి తన శిష్యులచే నా కథ నిత్యము గానముచేయించును. అందుచే మాకుగూడ ఆ కథ బాగుగ దెలియును. మీకు మేమా శ్రీరామచంద్రుని పరిచయము చేయుదుము, వినుము.

అయోధ్య నేలు దశరథుడనురాజు సంతానహీనుడై ఋష్యశృంగ మహర్షిని పిలిపించి పుత్రకామేష్టి చేయును. ఆయజ్ఞప్రభావమున శ్రీ విష్ణుభగవానుడు వారికి నలుగురు పుత్రులరూపమున బుట్టును. వారు రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నుల నామముల ప్రసిద్ధి నొందెదరు. దేవతాస్త్రీలు వారి సుగుణగణ గానము చేసెదరు. కొంతకాలమునకు శ్రీరామచంద్రుడు మహర్షి విశ్వామిత్రునివెంట మిథిలాపట్టణమునకు వెళ్లి జనకరాజువద్ద నున్న శివధనుర్భంగ మాచరించి శ్రీమహాలక్ష్మియవతార మగు జానకిని చేపట్టును. వారి మిగిలిన ముగ్గురు సోదరుల వివాహములుకూడ అక్కడనే జరుగును. అమ్మా యింకను యితరవిషయములు గలవు. మే మిక మాదారిని బోయెదము.

చిలుకల మాటలు సీత చెవుల కమృతవర్ష మాయెను. తనివిదీరక తిరిగి యడిగెను. శ్రీరాము డెట్లుండును? వారి గుణము గానము చేయుడు. వారిమాటలు నాకు చాలా ప్రియముగా నున్నవి.

సీతనోట యీ మాటలు వినగనే; యీమెయే సీత గానోపు నని చిలుకలు తలచి యం దాడు చిలుక సీతపాదములపై వ్రాలి చెప్పదొడగెను.

శ్రీరామచంద్రుని ముఖము వికసించిన పద్మము వలె ప్రసన్నమైనది. నేత్రములు విరిసిన తామర రేకులవలె విశాలమైనవి. నాసిక కొనదేరి నిడుపుగా నుండును కనుబొమలు రెండును కలసి యుండును. ఆజానుబాహుడు. మెడ శంఖమువలె నుండును. విశాలమగు యెదురురొమ్మున శ్రీవత్సలాంఛనముండును. వారి నడుము, పిక్కలు, మోకాళ్లు చాలా మనోహరముగా నుండును. పాదపద్మముల యందము వర్ణింప శక్యముగానిది. అతిమనోహరు డగు నా రాముని సహస్రఫణి ఆదిశేషుడే వర్ణింపజాలనిచో నే నేమి వర్ణింపగలను! ఇతని రూపమునకు లావణ్యరాశి లక్ష్మికూడ మోహితురాలైనచో వారి దర్శనముచేసి ఇక యే స్త్రీ మోహితురాలు గాదు? నేను శ్రీరాము నెంత వర్ణింతును? సమస్తశుభలక్షణసంపన్నుడు. ఎవరు వేలకొలదిసంవత్సరములు శ్రీరఘురామునితో సుఖపడునో ఆ జానకి ధన్యురాలు. ఇంత ప్రేమతో శ్రీరాముని గుణగణము లడిగి వినుచున్న నీ వెవరు సుందరీ-యని యా చిలుకలు ప్రశ్నించెను.

ఓ చిలుకలారా! వినుడు. ఇంతదనుక మీ రే జానకినిగురించి చెప్పితిరో యామెను నేనే. వా రిప్పటినుండియే నా మనస్సును హరించిరి వా రెప్పుడు వచ్చి నా పాణిగ్రహణ మాచరించెదరో అంతదనుక మిమ్ములను విడిచిపెట్టను మీ మాటలచేత నా హృదయ మా రాముని యందు లగ్నమాయెను. అంతవరకు మీరు మాయింట నతిథులుగా నుండి నన్నానందింపజేయవలెను.

ఈమాటలు విని ఆడుచిలుక ప్రార్థనాపూర్వకముగ జెప్పబూనెను.

సాధ్వీ! మేము అడవిపక్షులము. చెట్లపై స్వేచ్ఛగా సంచరించుచుందుము. ఎట్టి యుపచారములు చేసినను మీయింట మాకు సుఖ

(28-వ పేజీ చూడుడు)

రేకు సిపాయి

శ్రీ జె. వెంకటరామయ్య

అనగా అనగా ఒక బొమ్మలుచేసే వాడు. అత డొకనాడు ఒక డబ్బారేకుతో పాతికమంది సిపాయి బొమ్మలను చేసినాడు. వారందరూ రంగురంగుల దుస్తులతో, చేతుల్లో తుపాకులు పట్టుకొని మిలిటరీఠీవితో నిలబడేటట్లు తయారు చేసినవారు. కాని అందరికన్నా కడపటిసిపాయికి మాత్రం ఒకతేడా వచ్చింది. అందరికీ రెండు కాళ్ళయితే, తనకు మాత్రం ఒకటే కాలు కావడమే ఆ తేడా. ఇందుకు కారణం తెలుసా? ఇతన్ని తయారుచేసేటప్పటికి బొమ్మలంగడివానికి తగరపు రేకు అయిపోవచ్చింది. అందువల్ల ఒక్క కాలితోనే సరిపెట్టినాడు బొమ్మలదుకాణంవాడు. కాని, కాలొక్కటైనా, నిలువడంలో, ఠీవిలో, తక్కినవారికి తానేమాత్రం తీసిపోలేదు.

ఈ పాతికమంది బొమ్మసిపాయీలను ఒకపెట్టెలో పెట్టి అంగటివాడు అమ్మకానికి పెట్టినాడు. ఆ వూళ్ళోనే ఒక అబ్బాయికి పుట్టిన దినం వస్తే బంధువులు యీపెట్టెను కొని బహుమతిగా నిచ్చినారు. అబ్బాయి అమితానందంతో పెట్టె తెరిచి చూచి, ఆశ్చర్యంతో, "రేకు సిపాయీలు!" అని చప్పట్లు కొట్టినాడు. నాటినుండి యీ బొమ్మసోదరులకు ఆపేరే అలవాటయిపోయింది.

ఒకనాటిరాత్రి, రేకుసిపాయీలనందరినీ పెట్టెలో పెట్టి ఒంటికాలివాణ్ణి మాత్రం మరిచిపోయి బల్లమీదనే వదిలేశాడు అబ్బాయి. ఆనాడు అర్ధరాత్రిలో ఆటవస్తువులన్నీ కదిలింది. ఆటబొమ్మలన్నీ ప్రాణంతో లేచింది. తమలో తాము చిత్రవిచిత్రంగా ఆడుకొన్నవి. పలక, బలపం ఒకటిగా చేరి యేదో లెక్కలు వ్రాసుకొంటూ, బొమ్మలు వేసుకొంటూ వుండినవి. కొయ్యబొమ్మలు తమలో తాము పెళ్ళిళ్ళు చేసుకొన్నవి. అచ్చటి పిడతల్లో




వంటలువండి విందు లారగించినవి. బొమ్మ మోటార్లలో వూరేగింపులు చేసుకొన్నవి. పెండ్లికుమార్తెను మెయిల్రైలులో అత్తవారింటికి అంపినవి. ఇంత అలజడి జరిగినా కదలక, మెదలక వుండింది యిద్దరు మాత్రమే వారు యెవరంటారా? మన రేకు సిపాయీ, ఆ బల్లమీదనే అమర్చబడిన కొయ్యకోటముందు నాట్యం ఆడేవిధంగా నిలిపియుండిన అట్టసుందరిన్నీ. అట్టసుందరి అందం చూచి రేకుసిపాయికి మోహం కలిగింది. ఆ యట్టసుందరి మంచి రంగులతో నిర్మింపబడిన జిలుగు కాగితపుచీర కట్టుకొని, కాకిబంగారపు నగలతో కన్నులపండువుగా కనబడింది. అన్నిటికన్నా చిత్రం ఆమెకూడా (నాట్యంఆడుతూండడం వల్ల) ఒంటికాలిమీదనే నిలిచియుండినది. రేకుసిపాయి తనలాగే ఆమెకూడా ఒంటికాలిమనిషి అని భావించి, తనకు తగిన కన్యయే తనకు దొరికిం దని నిశ్చయించినాడు. ఆమెనే పెండ్లాడతలచినాడు. ఒక పొడుముడబ్బాచాటులో నిలిచి ఆమెవంకనే కంటిమీద రెప్పవేయకుండా, తదేకధ్యానతో చూడసాగినాడు. ఆమెకూడా యితని వంకనే దృష్టి మరల్చకుండా చూడసాగింది. ఇరువురి చూపులూ కలిసింది. ఇంతలో పొడుముడబ్బామూత తెరుచుకొంటూ ఒక నల్లని మాంత్రికుడు (బొమ్మమాంత్రికుడే లెండి) వచ్చినాడు. అట్టసుందరిని, రేకుసిపాయిని గమనించినాడు. సిపాయితో, "ఏయ్! నీ చూపులు, నీవద్దనే వుంచుకో. ఇతరులపైకి పోనివద్దు!" అని గమాయించినాడు. రేకుసిపాయి పలకనూ లేదు; వులకనూ లేదు; సుందరాంగి ప్రక్కనుండి చూపులు మరల్చలేదు. "తెల్లవారనీ, నీపని తెలుస్తుందిలే!" అంటూ మరల పొడుండబ్బాలో దూరి తలుపు మూసుకొన్నాడు మాంత్రికుడు.

తెల్లవారింది. పిల్లలంతా నిద్రలేచి ఆటలు మొదలుపెట్టినారు. ఆటల సరాగాల్లనో, లేక మాంత్రికుని మహిమనో గాని, పిల్లలు రేకు సిపాయిని కిటికీతలుపుదగ్గర పెట్టి మరచిపోయినారు. పెద్దగాలికి రేకు

సిపాయి మూడంతస్తుల మేడమీద నుండి తలక్రిందులుగా పడి మట్టిలో కూరుకుని పోయినాడు. కొన్నాళ్ళకు వానవచ్చి మట్టి కరిగిపోగా బయట పడినాడు. దారినిపోయే అల్లరిపిల్లలు రేకుసిపాయిని చూచినారు. వెంటనే ఆతన్ని కాగితం పడవమీద కూర్చోపెట్టి, రోడ్డు వెంబడి నిండి పారే కాలువలో వదలినారు. రేకుసిపాయి పడవప్రయాణం చూచి చప్పట్లు తడుతూ కొంతదూరం పరుగెత్తినారు. కాలువ రోడ్డుక్రిందుగా పారే తూములో ప్రవేశించింది. పడవతో సిపాయి కూడా అందులో ప్రవేశించినాడు. ఈ కష్టాలంతా ఒక గొప్పగా తోచలేదాతనికి. ఇదంతా మాంత్రికుని మాయకాబోలు ననుకొన్నాడు. కాని, తను వరించిన అట్టసుందరిని మాత్రం మరవలేదు. ఇంతలో ఆ తూము వాసంచేసే పందిలో కొక్కు ఈదుకుంటూ వచ్చి "ఏయ్! ఇది నా రేవు, రేవు సుంకం చెల్లించి కదులు." అంటూ వెంట బడింది. ప్రవాహవేగంతో పడవ సాగిపోయింది. రేకు సిపాయిన్నీ పలకా లేదు, వులకా లేదు. తనేమో, తన ధ్యానమేమో! కాలువ వెంట కొట్టుకొనిపోయే గడ్డి పరకలు పుల్లలతో చెప్పి పడవను ఆపమని చెప్పింది. కాని, ఫలితం లేదు. మరుక్షణానికంతా పడవ తూముదాటి తటాలున చాలా అడుగులలోతులో వున్న తటాకంలో పడిపోయింది. పడవ ఒక దారి, రేకుసిపాయి ఒక దారీ, అయినారు. నీళ్ళల్లో క్రిందామీదా తేలుతూన్న సిపాయిని పెద్ద చేప లటుక్కున మింగింది. కాలవశాత్తు ఆ చేప వలలో పట్టుబడి బజారులో అమ్మకానికి రాగా మొదట యే అబ్బాయింట్లో రేకుసిపాయి వుండినాడో ఆయింటివారే ఆ చేపను కొన్నారు. వంటయింట్లో వంట లక్క కత్తికి అడ్డపడి, బైటపడ్డాడు రేకుసిపాయి. మళ్ళీపిల్లల చేతికివచ్చి, మామూలు బల్లమీదికివచ్చి, ప్రతి రాత్రిన్నీ అట్టసుందరినిచూస్తూవుండేవాడు. కాని, కాలం ఒకరీతిగా జరగదు కదా? కర్మవశాత్తు ఒకనాడు అబ్బాయి బుర్రలో యేబుద్ధి పుట్టిందో గాని తటాలున రేకుసిపాయిని విసరి మండే కుంపట్లో వేసినాడు. పాపం సిపాయి తన ప్రేమ కిది అగ్నిపరీక్ష అనుకొని, అట్టసుందరివైపే చూస్తూ అగ్నికి ఆహుతి యైపోవుచుండినాడు. అదేమి విచిత్రమో గాని, పెద్దగాలి వీచింది. గదితలుపులు తెరుచుకొన్నవి. అట్టసుందరి గాలిలో రెపరెపలాడుతూ వచ్చి, అదే కుంపటిలో పడి, ప్రియునితో బాటు సహగమనం చేసింది. ఆమెనగల్లోని నిగనిగలు, కాకిబంగారు, సిపాయి కరిగి ఒకే ముద్దగా మిగిలినారు.

(ఆంగ్లకథలు '*Anderson's Fairy Tales*' నుండి)



బీహార్ రెజిమెంటులోని ఆదిమవాసిసైనికుల జానపదనృత్యకోలాహలం.

వరాల చెంబు

శ్రీమతి వల్లూరి సుజాతాదేవి

ఒక గ్రామములో సుబ్బయ్య అనే పేద బ్రాహ్మణుడుండేవాడు. సుబ్బయ్య భార్య కామమ్మ కూడ చాల ఔదార్యము గల మనిషి. కామమ్మ, సుబ్బయ్య తెచ్చిన డబ్బులో సగము మాత్రమే ఖర్చుచేసి మిగిలిన దానిని నిల్వచేసేది. ఈ విధముగా



ఒక చెంబునిండా వరాలు నింపింది. ఆ చెంబును చూచి సుబ్బయ్య చాల సంతోషించాడు. ఒకనాడు కామమ్మ, జీవితకాలము అంతమగుచున్నది గనుక యాత్రలకు పోవలెనని సుబ్బయ్యతో అన్నది. సరేనని సుబ్బయ్య ఈ వరాలతో నిండివున్న చెంబును ఎలాగు ఎక్కడ దాచ [illegible]

కామమ్మ తమకు తెలిసినవారిలో నిజాయితీ గల మనిషి రామయ్య ఉన్నాడుగదా, వానివద్ద దాచుదామని అంది. సరేనని సుబ్బయ్య ఆ చెంబునకు గుర్తుగా ఒక గుడ్డ చుట్టి మూడు ముళ్ళు పైన వేశాడు. సుబ్బయ్య కామమ్మ ఇద్దరూ కూడా రామయ్య ఇంటికి వెళ్లి తమ ఆలోచనలంతా వానితో మనవి చేసికొని ఆ చెంబును వానికి అప్పగించి వచ్చేసారు.

సుబ్బయ్య కామమ్మ నిశ్చింతగా చాలారోజులు యాత్రను చేసి గృహోన్ముఖులయ్యారు. ఇంటికి చేరేటప్పటికి వారికి చేతిలో చిల్లి [illegible]

వరాల చెంబుమాట జ్ఞాపకమొచ్చి రామయ్య ఇంటికి పరుగెత్తారు. రామయ్య వాళ్ళను చూట్టంతోనే ఎంతో ప్రేమగా నటించటము మొదలుపెట్టాడు. వాళ్ళను చూడగానే ఆదరించాడు. చాలరోజులకు వచ్చారని వారిని కౌగిలించాడు కూడ. రామయ్యని వరాలు చెంబు అడుగుటతోనే గుండెల్లో రాయి పడ్డట్టయింది. రామయ్య వాళ్ళకి వరాలచెంబు విషయము జ్ఞాపకములేదనుకున్నాడు. నిర్వాహంలేక వారియెదుట తెచ్చిపెట్టాడు రామయ్య వరాల చెంబును. చెంబుమీద తాను వేసిన ముళ్లు వేసినట్టుగానే ఉండుటవలన ఫరవాలేదనుకుని సుబ్బయ్య ఆ చెంబుతో సహా ఇంటిదారి పట్టాడు.

కామమ్మ సంతోషముతో ఆ చెంబును తెరచి చూడగా దానిలో వరాలకు బదులు గులకరాళ్లు కనిపించాయి. కామమ్మ వెంటనే సుబ్బయ్యకు చూపెంచి చాల దుఃఖించింది. రామయ్య నడుగగా తనకేమి తెలియదనియు, ఇచ్చినది ఇచ్చినట్టుగనే చెంబును భద్రపరచితిననియు బదులు పల్కెను. అప్పుడు సుబ్బయ్య, రామయ్య తమ తగవు పరిష్కారార్థమై ఆ గ్రామము లోని కరణమువద్దకు వెళ్లారు. సుబ్బయ్య, రామయ్య ఎవరి విషయాలు వారు మనవి చేసుకున్నారు కరణముగారితో. ఎవరిమాటా నమ్మటానికి వీలులేకపోయింది కరణానికి. ఎటువైపు న్యాయమున్నదో చెప్పలో తెలియక సందిగ్ధావస్థలో పడివున్నాడు కరణం. ఇంతలోనే కరణము కూతురు లక్ష్మి బయటకు వచ్చి తండ్రి పడుతున్న అవస్థను చూచింది.

[illegible]

లక్ష్మి తనప్రక్కకు రావటము చూచి కరణము ఆశ్చర్యచకితు డయినాడు. దేవదూతవలె ఆపత్కాలమున లక్ష్మి వచ్చి నందుకు కరణము చాల సంతోషించాడు.

లక్ష్మి సుబ్బయ్యని, రామయ్యని తమ భార్యలను తీసుకురమ్మని పంపించింది. ఈలోపల; లక్ష్మి రెండుగంపలను తెచ్చి ఇద్దరు బాలురకు పలకబలపములు నిచ్చి తా వేదిచెన్నను దానిపై వ్రాయు నట్లు ఆజ్ఞాపించింది. ఇంతలో రామయ్యభార్య రత్తమ్మ, సుబ్బయ్యభార్య కామమ్మకూడా వచ్చారు. లక్ష్మి రామయ్యను, సుబ్బయ్యను జూచి ఈ గంపలు నెత్తిపైన పెట్టుకొని ఆ పొలముచుట్టు తిరిగి రావలసిం దని చెప్పి, వారి భార్యలను వారితోకూడా పంపించింది. రామయ్యభార్యకు, సుబ్బయ్య భార్యకు కొంతదూరము నడిచే టప్పటికి ఇంక శక్తి జాలకున్నది. రామయ్యభార్య రత్తమ్మ త్రోవ పొడుగునా భర్తని, సాధించటము మొదలుపెట్టింది. "ఎందుకొచ్చిన వరాలు; వారివి వారి కిచ్చేస్తే ఈ కష్ట ముండదుకదా? మీ మూలమున నేనుకూడా బాధపడు తున్నాను. ఒకరిసొమ్ము దొంగిలిస్తే దానికి గల ఫలిత మూరకనే పోదు" అంది రత్తమ్మ.

"ఈ కాస్తదూరము నడుస్తే శ్రమలేకుండా లభించిన వరాలు, మనకు దక్కుతాయి. కొంచెము శ్రమపడకపోతే ఎలాగ?" అని మందలించాడు రామయ్య.

ఇక్కడ వీ రిలాగు తర్జనభర్జనలు పడుతూండగా అటువైపు సుబ్బయ్య కామమ్మ ఒకటే గొడవ. కామమ్మ "డబ్బుపోయి శని పట్టినట్టయింది. పదిసంవత్సరాల కష్టార్జితము. యాత్రలకు పోకుండిన బాగుండేది. వరాలు పోగా ఈ నడకశ్రమకూడా సంప్రాప్తించింది" అంటూ మొదలు పెట్టింది.

సుబ్బయ్య "తాను చేసిన కర్మయొక్క ఫలితము ననుభవింపక తప్పదు. ఎప్పటికయిన మంచిరోజులు రాకపోవు" అని ఓదార్చాడు కామమ్మని. ఇంతలో తిరిగి గమ్యస్థానమును చేరుకున్నారు.


లక్ష్మి ఎవరి నెత్తిమీద గంపలు వారిని దింపమని పలకలు బయటకు తీసి దానిపై రాసిఉన్నది అందరికి చదివి వినిపించింది. సుబ్బయ్య కామమ్మల పక్షమునే న్యాయము చెప్పింది. సుబ్బయ్య కామమ్మలు సంతోషంతో వరాలు చెంబును తీసుకువెళ్లారు. రామయ్య రత్తమ్మలు వారికి జరిగిన పరాభవమునకు సిగ్గుపడి వెళ్ళిపోయారు. ఏమి న్యాయము జరుగుతుందో నని చూడుటకు వచ్చినవారందరు లక్ష్మి పన్నిన ఉపాయమునకు చాల సంతోషించారు.

సీతాదేవి శాపము

(24 వ-పేజీ తరువాయి

ముగా నుండదు. నే నిపుడు గర్భిణిని మాచోటుకు బోవలెను తరువాత తిరిగి తమ దర్శనము చేయుదు మని వినయపూర్వకముగ చెప్పిరి. కాని సీత చిన్నతనపు పట్టుదలచే విడువ ననెను. ఆ యడవిచిలుకల హృదయావేదన గ్రహించలేక పోయెను. ఆడచిలుకనుమాత్రము వదలలేదు. ఆడచిలుక పతివియోగము భరింపజాలక - గర్భవతిని, దుఃఖితురాలును నగు నన్ను నా భర్తనుండి వేరుచేసితివి. కావున నీవుకూడ గర్భవతివైనప్పుడు నీభర్తృవియోగదుఃఖము ననుభవింతువుగాక యని శపించి రామనామోచ్చారణ జేయుచు నసువుల బాసెను.

వెంటనే చిలుకకొరకొక యందమగు విమానము వచ్చెను. చిలుక తన రూపు విడచి దివ్యరూపమున స్వర్గధామము చేరెను. భార్యావియోగమున మొగచిలుక ప్రాణత్యాగ మొనరించెను. ఈ విరోధము తీర్చుకొనుటకే యా చిలుకల మిధునము తిరిగి అయోధ్యలో చాకలివారలై పుట్టిరి. యీవిధముగా సీతాదేవిజీవితములో రాగల వియోగదుఃఖమునకు బాల్యములోననే అంకురార్పణ జరిగినది.




ఉత్తమ సంగీతము

శ్రీమతి జె. కమలాదేవి

త్యాగరాజు సమకాలికులు శ్యామ శాస్త్రియు, ముత్తుస్వామిదీక్షితులు అనువారు కూడను ఒకరొకరికి తీసిపోని "సంగీత త్రిమూర్తి" స్వరూపులై ఉత్తమసంగీతకళను సృష్టించి, పోషించి, ప్రచారమొనర్చి, అత్యుత్తమసాంప్రదాయాన్ని స్థిరముగా నేర్పరిచి గాయకలోకమున కందించి మార్గమును జూపియున్నారు. వారు చూపించిన సత్సాంప్రదాయమే అనుశ్రుతముగా నిప్పటి వరకును జీవస్రవంతివలె పరంపరగా వచ్చుచున్నది. వారి యాదర్శములను మనము గ్రహించవలెను ఉత్తమలక్షణలక్ష్యములను బాగుగా తెలుసుకొని, తాను అధ్యాత్మజ్ఞానము కలిగి గానమొనర్చుచూ అందలి యానందమును తా ననుభవించుచూ యితరుల ననుభవింపజేయువాడే ఉత్తమగాయకుడనంబడును. అట్టి మహోత్కృష్ట మగు నదియే ఉత్తమ సంగీత మన నొప్పును (తక్కిన వన్నియును కేవలగారడీసాదృశ్యములే) నని చెప్పదగును. లాలిత్యము, ఆర్తి, భక్తిభావము ప్రస్ఫుటముగాని సంగీతమెప్పుడును మానవహృదయమును రంజింపజాలదు. నిష్ప్రయోజనమే యగును ఎంతటి మహనీయులైనను దీని మహత్వమును తెలిసికొనుట దుస్తరము.

ఈ సందర్భము ననుసరించి, బృహద్ధర్మపురాణమందలి విష్ణునారదసంవాదమను నొక ఇతిహాసము కలదు. దీని నిచట నుదహరించుట యుక్తము. అదేమన; ఒకప్పుడు శ్రీ మహావిష్ణువు లక్ష్మీసమేతుడై యుండగా నారదుడు వారిసన్నిధికి (తానే గానకళావేత్త నను) గర్వపూరితుడై గాన మొనర్చుచు వెళ్ళి సగర్వముగా "హే స్వామీ! ఈ నా గానమువలననే గదా నేను నీ సాన్నిధ్యమును పొందగలిగితిని. ఇట్టి నా గానమును అనుకరించువారు లేరే" యని పలికెను. సహజముగ నెట్టి యహంకారమునైనను సహింపజాలని శ్రీ మహావిష్ణువు ఎటులైన నారదునికి గల యీ గర్వమును భంగమొనరించి సన్మార్గమును జూపదలచి "నారదా! కొంచెము గాన మొనర్పుము" అనెనట. అంత నారదు డతిశ్రద్ధతో మూలరాగము లారింటిలో నొకటి యగు గాంధార రాగమును రాగిణులతో సహా గానమొనర్చుచూ ఆ గానమునకు శ్రీమహావిష్ణు వెట్లు ఆనందించుచుండెనో యని శ్రీమహావిష్ణువు యొక్క ముఖలక్షణములను గమనించుచుండెనట. కాని నారదు డెంతగా గానమొనర్చినను ఆ మహానుభావుని మనస్సును రంజింపజేసి మందహాసవదనునిగా నొనరింపజేయజాలకపోయెను. అందుపై మందహాసవదనములుగను, సకలాంగభూషణోపేతములుగను, లావణ్యరాసులుగా నుండదగిన రాగరాగిణులు నారదు డొనర్చిన ఆ నిర్జీవగానము వలన వికృతాంగులైపోయినవో యనునట్లు శ్రీ మహావిష్ణువు ఇటులనెను "నాయనా! నారదా! నీ వలసితివి నీగానము నాపుము. సజీవులుగా నున్న రాగరాగిణుల సుస్వరూపములను నీకు జూపెదరమ్ము" అనెను. నారదుడు ఖిన్నవదనుడై లక్ష్మీసమేతుడగు మహావిష్ణువు ననుసరించి వైకుంఠమున కేగెను. అచ్చట సర్వభూషణోపేతములుగను, మందహాసవదనములుగను, లావణ్యరాసులుగ నుండిన రాగ, రాగిణుల నెక్కింటిని నార




కేంద్రకార్మికమంత్రి జగ్జీవనరాం భారత ప్రధాని నెహ్రూగార్లు ఇష్టాగోష్ఠి జరుపుతున్నప్పుడు తీసినచిత్రం. చిత్రంలోనున్న మూడవవారు ఉద్యోగుల భీమాసంస్థ డైరెక్టరు జనరల్ డా॥ సి. ఎల్. కాటియాల్ గారు.

డుడు చూచి నిశ్చేష్టుడాయెను. మరియు నొకమూల స్థానభ్రష్టత గలిగి, క్రిందపడి యున్నట్టివియును, సర్వలక్షణములును కలిగి యుండియును ఏదియో నొక కన్నుగాని, కాలుగాని, మరి ఏదియేని యొక అంగవిహీనత గలిగి, వికలాంగులుగా నున్న మరికొన్ని రాగరాగిణుల, జూచి నారదుడు శ్రీ మహావిష్ణువును ఇవి ఇట్లుండుటకుగల హేతు వేమి యని యడిగెను. అందులకు మహావిష్ణువు "ఇవియే ఇంతవరకును నీ వికృతగానము వలన వికృతి నొందిన రాగరాగిణులు." అని చెప్పెనట. నారదు డది విని తన లోపమును గ్రహించి గర్వదూరుడై మిక్కిలి పశ్చాత్తాపమును పొంది శ్రీ మహావిష్ణువు నారాధించుచూ అవ్యయస్వరూపమగు గాన మెట్టిదియో తెలుపమని ప్రార్థించెను. శ్రీ మహావిష్ణుని సంకల్పమాత్రమున నాట్యాచార్యు డగు పరమశివుడు ప్రత్యక్షమై విష్ణువుచే నిర్దేశింపబడి చక్కని సాహిత్య సహితముగ నా గాంధారరాగమునే గాన మొనర్చుచూ నృత్య మొనరించెనట అట్టి గానముచే మోడులు చిగిర్చునో యనునట్లు వికలాంగులగు ఆ రాగరాగిణులెల్ల సార్వాంగ లక్షణసమేతములుగా విలసిల్లెను. సుస్వర జ్ఞానయుక్తమగు నా గానమందలి సాహిత్య మాధుర్యము ననుభవించుచున్న శ్రీ మహావిష్ణువు తనయెదుట నొక భక్తప్రియురాలు ఆలింగన మపేక్షించి కైదండలు సాచినట్లుగా భ్రమించి యా ప్రియురాలిని అక్కున జేర్చుకొనుటకో యనునట్లు తన బాహువులను చాచెను. ఈ ఇతిహాసమూలమున సాహిత్యయుక్తమగు సుస్వరజ్ఞాన సాంప్రదాయయుక్తమైన గానమే అవ్యయ బ్రహ్మసాన్నిధ్యమునకు అనగా మోక్షమునకు సాధనమని స్పష్టము కాగలదు. కనుక విధి విహితముగను, లక్షణయుక్తముగను, సుస్వర జ్ఞానసహితముగను ఉండి శ్రీ భగవానుని కీర్తించునట్టిదియే ఉత్తమమగు గానస్వరూపము "లేక" సంగీతస్వరూపము అని చెప్పఁబడును. ఇట్టి ఉత్తమగానముచే సర్వేంద్రియములును నాదబ్రహ్మమందు లీనమై, అవ్యయ బ్రహ్మానందానుభవము ననుభవింప గలుగుదుము. ఇట్టి గానమునే భక్తులగువారలెల్లరును ఆదరించునది.

గాయకుడు కళాసరస్వతి యనుంగుబిడ్డడు. ఇతనికి నియతి, నియమము, నిష్ఠ, ఓర్పు సహనభావము ఉండాలి. తాను ప్రజలకును దేశమునకును ఆదర్శప్రాయుడుగా నుండు లాగున సంచరించాలి. ఇన్ని విషయము లాతనియందు మూర్తీభవించిననే ఆతనికి సంఘములో, గౌరవము ప్రతిష్ఠయు ఉంటుంది. ఇంతియేగాక గాయకుడు తానెంతటి గొప్పవిద్వాంసుడైయైనను కూడను, నిగర్వియై, తానింకను కళాభ్యర్థినే అనియును, తాను తెలిసికొనవలసిన విషయము లనేకములు గలవనియును, జ్ఞప్తియందుంచుకొనుట యుక్తము. గానకళ యనునది మహాసముద్రమువంటిది. ఏదియేని తనయందొక లోటు ఉండకతప్పదు అని ఎంచుకొనుట భావ్యము.

నేటి మన గాయకోత్తములు పూజ్యులగు శ్రీ త్యాగరాజాదులవలె మహోత్కృష్ట భావములతో దక్షిణభారత (కర్ణాటక) గాన సరస్వతిని ఆరాధించి తరించి జనసామాన్యమునకు ఆదర్శమును జూపుదురు గాక యని ప్రార్థన.

ఓం తత్సత్ శ్రీ త్యాగరాజసద్గురవే నమః.



భారత ప్రభుత్వ కార్మికమంత్రి జగ్జీవనరామ్‌గారు యీ నెల 13 న ఢిల్లీలో జరిగిన ప్రభుత్వసంబంధాల ఆఫీసర్ల సమావేశంలో ప్రసంగించినప్పుడు తీసిన చిత్రం.

అవినీతిలో నీతి

శ్రీ యస్. సూరి

"......నిజాయితీ అంటే జ్ఞాపకం వచ్చింది. రెండుసంవత్సరాలక్రితం జనుముల ధర విపరీతంగా పెరిగిపోయింది-మీకు జ్ఞాపకంవుందీ? యాభై రూపాయలకి ఇస్తా నన్నా కొనే దిక్కులేక కొట్లల్లో మూలిగిన జనుములకి విత్తులరోజులు వచ్చేటప్పటికి ఎక్కడలేని గిరాకీ తగిలింది. అందులోనూ మొదటిసారి చల్లిన విత్తులు మంచుకు గిడసబారి మొటికన్నా తేలకండా ఎట్లా వేసినగింజ అట్లాగే ఎండిపోయింది—చేలో.

యాభైరూపాయల జనుములు ఒక్కసారి నూటయాభైఅయి వూరుకుంది. అదైనా ఈ చుట్టుప్రక్కల ఎక్కడా గింజ లేదు. బెజవాడ పోయి తీసుకురావాలి.

అసలు అంతజోరుగా పెరగటానికి కారణం 'ఈ మాయదారి కంట్రోలే' అంటాడు మన సుబ్బిసెట్టి. కంట్రోలు పెట్టినంతమాత్రాన్నే ధరలు ఇంత విపరీతంగా ఎందుకు పెరగాలో నాకు ఎంత తన్నుకున్నా అర్థంకాదు.

నేను విత్తులకి బస్తీ పోతున్నానని తెలిసి వూళ్ళో నలుగురూ తలా కాసినీ తమకి కూడా తెచ్చిపెట్టమన్నారు. అన్నీ కలసి రెండుబస్తాలైనాయి.

బెజవాడ వెళ్ళాను. ఏ కొట్టుదగ్గరికి వెళ్ళినా లేవు అనేవాడే. తిరిగి తిరిగి విసుగనిపించింది. అందులోనూ బహిరంగంగా అడగకూడదు.

ఆఖరిప్రయత్నంగా ఒక కొట్టు దగ్గరికి వెళ్ళాను. అది చాలా పెద్ద కొట్టు. దాని యజమానికూడా చాలా ఖ్యాతి కలవాడు. గుమస్తాని చాటుకు పిలిచి అతిరహస్యంగా "ఏమండీ తమదగ్గర జనపవిత్తులేమన్నా వున్నాయా?" అని అడిగాను.

వాడు మన మొహంవంకైనా చూడకండా, విదిలించి పారేసినట్లు "లేవు" అన్నాడు విసురుగా.

"బాబో! ఇప్పుడే ఇంత అదిరిపడుతున్నాడు. నిజంగా ఈయనే షావుకారు అయివున్నట్లయితే ఈయనముందు భూమి ఆగుతుందా? అందుకనే ఆ భగవంతుడు అన్నీ కనిపెట్టే, ఎవర్ని ఎట్లా వుండాలో అట్లాగే చూస్తాడు" అనుకున్నాను మనసులో.

అవసరంగా మరి? అందుకని ఆ విదలించుకుపోయేవాడిని పట్టుకొని బ్రతిమాలుతూ 'పోనీ ఎక్కడ దొరుకుతాయో కాస్త చెప్పండి బాబూ! మీకు పుణ్యముంటుంది. తిరిగి తిరిగి కాళ్లు బొంపాలు కట్టినై' అన్నా.

వాడు రీవిగా, మొగల్ చక్రవర్తి పెట్టే భంగిమలో మొహం పెట్టి,నా మొహంవంక కాస్త తేరిపారచూచి 'షావుకారును అడుగు' అని వేలితో చూపించాడు.

'ఓరి వీడి రీవి మండా!' అనుకుంటూ కొట్లో ప్రవేశించాను. ఆ షావుకారుతో ఎవరో నలుగురు కూర్చుని మాట్లాడుతున్నారు. అందకని నేను సరాసరి లోపలికి వెళ్లాను. ఆయనచూపులు నన్ను అనుసరిస్తుండటం గమనించి చేతితో సైగ చేశాను. ఆయన వెంటనే లేచివచ్చాడు.

"ఏమండీ, తమదగ్గర జనపవిత్తు లేమన్నా దొరుకుతాయా?" అని అడిగాను, నమ్రతగా. అసలు ఆయన్ని చూస్తేనే శరీరం వణకటం అటుంచి నోరే వణికింది. మరి ఒకరికి మాత్రం వణకదూ? ఆయన ప్రసిద్ధి చెందిన లక్షులికి అధికారి ఆయెను.

ఆయన "మీ కెన్ని కావాలి?" అడిగాడు మర్యాదగా. ఆ గుమాస్తాకీ ఈయనకీ ఎంత తేడా? మన వాళ్లు వూరికే అన్నారు 'ఏమీలేని విస్తరి ఎగిరి ఎగిరి పడుతుందనీ, 'అన్నీ వున్న విస్తరి అణగారే వుంటుంద' నీను!

ఆయన ఇంకేమెలికలూ పెట్టకండా 'ఎన్ని కావాలి' అనేటప్పటికి నాకు ఎక్కడలేని సంతోషం కలిగింది. వీళ్లు ఏడిపించటం అసలు సరుకులేకనా? బజార్లో సరుక్కు కరువుగానీ గోడవునులో సరుక్కు కరువేమిటి?

ఏమైనా ఈ షావుకారు చాలా మంచివాడుగా, నిగర్విగా, మర్యాదా, మంచీ తెలిసినవాడుగా కనుపించాడు.

నేను ఆనందంతో "రెండుబస్తాలు కావాలండీ"

"ఎక్కడికి చేర్చాలి?" అని అడిగాడు.

"మీకు అంత శ్రమ ఎందకు లెండి. మీరు కొలిపించి పారేస్తే నేను చేర్చుకొనగలను" అన్నాను, ఆయనమంచితనానికి పొంగిపోతూ.

'ఎవరు చేర్చితే మీకేమి? మీకు కావాల్సింది సరుకుగానీ, ఎవరు చేర్చారా అని కాదుగా?" అన్నాడు నవ్వుతూ.

నేను మతాబా కాల్చాను. "అవును లెండి; అయితే ధర తేల్చారు కాదు" అన్నాను.

"తేల్చటాని కేమున్నది? అరవై అయిదు బజార్లో అమ్ముతున్న దేగా? అందులో పొరపా టేమున్నది?" అన్నాడు.

నేను ఆశ్చర్యపడుతూ "అబ్బా! నూటయాభై అన్నారే?" అన్నాను.

"అది రెండురోజుల క్రితం రేటు; ఇది ఈ రోజుధర. ఏ రోజు మార్కెట్టు ఆ రోజేగా" అన్నాడు నవ్వుతూ.

నిజమే అయివుండవచ్చు. ఈ కాస్త భాగ్యానికి ఇంతలావు షావుకారు అబద్ధమాడవచ్చాషా? ఆయనన్నీ, ఆయన మాట్లాడే తీరునీ చూస్తే నా కేమీ అటువంటి అనుమానం కలుగలేదు.

మాటవరసకు మాత్రం "అంతకు తక్కువ లేదంటారా?" అన్నాను.

"అబ్బే! మీకు ఎక్కువ చెప్పిందేమీ లేదు. కచ్చితమైన ధరే చెప్పాను మీకు' అన్నాడు.

"ధర మా కోటివాళ్లు కొనతగ్గట్టుగా లేదండీ......అసలు సరుకు చూపించండి, ఎట్లా వుందో చూద్దాం" అన్నాను కొంటానికి ఇష్టపడ్డట్టుగానే.

"అబ్బే! అవేమీ లాభం లేదు. సరుకు మేము చూస్తేగా మీకు చూపించటానికి? సరుకేమి? రాజా సరుకు, నాది పూచీ' అన్నాడు, నా మాట నమ్మమన్నట్లు చూస్తూ.

చూడని సరుకుమీద ఆయనకు అంతనమ్మకం ఎట్లా కుదిరిందో?

నేను ఆశ్చర్యపడుతూ "సరుకు చూడకండానే?" అన్నాను.

"ఆ రోజులు పోయాయండీ. వెధవ ఈ కంట్రోలు వచ్చి జనాన్ని అన్ని విధాలా చంపేస్తోంది. మేమైనా ఇంకోచోటనుంచి తీసుకవచ్చి ఇవ్వవలసిందే మమ్మల్ని కూడా సరుకు చూడటం అటుంచి ఆ కొట్టుచాయలకైనా రానీయరు. మరి వాళ్లుమటుకు వాళ్లజాగ్రత్తలోవుండద్దూ" అన్నాడు

ఎందుకనో ఈ మాటలు నాకు అంత నమ్మకాన్ని కలిగించలేకపోయినై. "నీళ్లల్లో గేదెను వుంచి బేరమాడినట్లుంది......సరే! డబ్బు తీసుకోండి." అని ఎంచి ఇచ్చాను. అంతకంటే ఏమిచేస్తాం?

"అయితే మీకు ఎక్కడికి చేర్చాలి?"

"పడవలరేవుకి" అన్నా.

"మీరు వెళ్లి భోంచేసి రేవుకి రండి, అక్కడ సరుకు సిద్ధంగా వుంటుంది" అన్నాడు.

నేను హోటలుకు వెళ్లి అన్నం ముందు కూర్చున్నప్పటినుంచీ అనుమానం అధికం కాసాగింది సరుకు ఎట్లా వుంటుందో? ఏ దుమ్మూ, దూళీ వుంటుందో? దుమ్మూధూళీ ఏమి ఖర్మ? బస్తాల్లో ఇన్ని రాళ్లు కుక్కిపంపితే మనం చేసేదిమటుకు ఏమిటి? అసలు పంపకపోతే మటుకు చేసేది ఏమిటి — రెండు చేతుల తోనూ రెండూ మూసుకుని ఇంటిదారి త్రొక్కటం తప్ప?

ఎంత బుద్ధితక్కువపని చేశాను? ఆ షావుకారును జూచి మోసపోయి ముందు డబ్బు జారానే?

ఎంతబ్లాక్ మార్కెట్టు అయితే మాత్రం సరుకు జూచుకోకండా, దగ్గరవుండి కొలిపించుకుని రేవుకు చేర్చుకోకండా వుండే తెలివితక్కువ దద్దమ్మ నాకంటె ఎవరుంటారు? మొల్లో కట్టిన డబ్బు మొల్లోనే మళ్లీ నరుడి కంట బడకండా కత్తిరేస్తున్నారే? అన్నీ తెలిసుండీ ఇంత తెలివితక్కువపని చేశానేమా అని నాకు దిగులు పట్టుకుంది. మూడువందల ముప్పైరూపాయలూ కృష్ణార్పితం అనుకున్నాను.

ఎక్కడో కాస్త 'పంపక పోతాడా' అనే భరోసా ఏడిపిస్తోంది. వెంటనే విస్తరిముందు నుంచి లేచి గబగబా పడవలరేవుకి పరిగెత్తాను.

నేను వెళ్ళేప్పటికి రెండుబస్తాలూ, ఆకొట్లోని చిన్నకుర్రాడూ కనుపించేప్పటికి నాప్రాణాలు లేచి వచ్చినై.

ఆ కుర్రాడు బండిబాడుగక్రింద అర్ధరూపాయి తీసుకుని వెళ్ళిపోయాడు. మర్నాడు ఇంటికి వచ్చి చూచుకుంటే సరుకు అంత శ్రేష్ఠమైనది కాకపోయినా దుమ్మూ, ధూళీ అంతగా లేదు. మర్చాను; కొలిచి చూచుకుంటే బస్తాకి చారెడేసి పెచ్చే వున్నాయి, గింజకూడా తరగలా.

'నిజాయితీ అంటే ఆ షావుకారుది నిజాయితీ' అని ముగించాడు సుబ్బయ్య

"కాకేమిటి? అందుకు సందేహమా?" అన్నారు అక్కడ వున్న శ్రోతలంతా.

విదేశాలనుంచి పెట్టుబడి

(19 వ పేజీ తరువాయి)

ఉచ్చు సడలించాలని ప్రయత్నించినకొద్దీ మరింత బిగిసిపోతున్న దన్నాడు.

రెండో ప్రపంచయుద్ధంలో రెండుమార్లు యుద్ధరంగమై నాశనమైన ఫిలిప్పైన్సుఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికిగాను అమెరికా 600 మిలియన్లడాలర్లు ఇవ్వజూపింది. 1947లో అమెరికన్ప్రభుత్వం ఫిలిప్పైన్సుదీవులికి రాజకీయస్వాతంత్ర్యం ఇచ్చింది. కాని అమెరికన్లకికూడా అక్కడ సమానపౌరస్వత్వాలిస్తేగాని ధనసహాయం ఇవ్వబోరని ఆఖరుక్షణంలో నిర్బంధపెట్టారు. సర్వనాశనమై, సహాయం అనివార్యమైన పరిస్థితిలో ఫిలిప్పైన్సు రాజ్యాంగపరిషత్సభ లొంగవలసి వచ్చింది.

వెంటనే అమెరికన్ల పెట్టుబడిధనం ధారాపాతంగా వచ్చిపడింది. అమెరికన్లు స్వయంగా యంత్రాలు కొని తెచ్చుకున్నారు. ధనం అటూ ఇటూ నిరాటంకంగా తిరుగుతోంది. ఫిలిప్పైన్సులో సహజసంపదనుండి తమయంత్రాలతో తయారుచేసిన వస్తుసంపదను దేశీయుల కమ్మి విదేశాల కెగుమతి చేసి లాభాలు ఆర్జించి పెట్టుబడికి మించిన లాభాల్ని ద్రవ్యరూపంలోను, వస్తురూపంలోను అమెరికా తీసుకుపోతున్నారు. అంటే ఫిలిప్పైన్సుప్రకృతి సంపద అమెరికన్ల లాభార్జనకి తోడ్పడి, అవసరవస్తువులు అన్యదేశాలకి తరలిపోతున్నాయి. ఈ వ్యాపారంలో దేశీయుల అవసరాలు కొరతలు కరువుల గురించిన చింత లేదు. ప్రభుత్వంచేతులు కట్టవేసినట్లయింది. లాభాలు అమెరికాకు వెడుతుండగా ఫిలిప్పినోలుఫాక్టరీ కూలీలుగా గుమస్తాలుగా ఉండిపోతున్నారు.

దేశంలో పన్నులు హెచ్చించాలంటే అమెరికన్ల పట్ల అది మైత్రీభావానికి విరుద్ధంగా పరిగణించబడవచ్చును. ప్రభుత్వానికి పన్నులవల్ల వచ్చే ఆదాయంలో నూరింట 75 వంతులు అమెరికన్ల పరిశ్రమల వల్లనే, కాబట్టి రాజకీయంగా స్వతంత్రమైన ఫిలిప్పైన్సు ఆర్థికంగా దాస్యం అనుభవిస్తోంది. ఈ పరిస్థితులు రాకుండా భారతదేశం కాపాడుకోవాలని లారెంజోటాటిస్టా హెచ్చరిస్తున్నారు. పై పన్నెండువరాల్నీ చూస్తే విదేశీపెట్టుబడి అంటే ఆర్థిక దాస్యమే ననే విషయం ధ్రువపడుతుంది. ఆర్థికదాస్యం అనగానే అంతర్జాతీయరాజకీయాల్లో అమెరికన్ల చెప్పుచేతుల్లో నడుచుకోవలసిందే నన్నమాట.

విదేశీయుల పెట్టుబడి మనదేశానికి రావాలంటే వాళ్లు వరాలైనా మానకోవాలి, లేక మనం ఆర్థికదాస్యానికి లొంగాలి. ఆర్థిక దాస్యం అంటే బ్రిటిష్‌పరిపాలనలో మన ఆర్థికస్థితికంటే హీనమైన పరిస్థితి ఏర్పడుతుందన్నమాట మరిచిపోకూడదు. అందువల్ల వరాలకి అంగీకరించాలంటే ప్రభుత్వం మారవలసిందే కాని పండిట్ నెహ్రూ మొదలైనవారుండగా ఇటువంటి ప్రమాదంలో దేశాన్ని పడనివ్వరు. ఇంకొక పక్షం ఉంది. దేశంలో ఆర్థికదుస్థితికి తోడు రాజకీయ కల్లోలం కూడా సంభవిస్తే అధికారంలో ఉన్న రాజకీయపక్షం ఎటువంటిముప్పుకైనా ఒడబడి శత్రుపక్షాన్ని నిర్జించడానికి యత్నించడం. ఇటువంటిస్థితి సయాంలో కొరియాలో వచ్చింది. అది మిగతాఆసియా దేశాల్లో సంభవించకుండా ఉండాలంటే ఏ అంతర్జాతీయ కార్యక్రమంలో గాని కమ్యూనిస్టు నిరోధకయత్నాన్ని మిళితం చెయ్యరాదని పండిట్ నెహ్రూ హెచ్చరిస్తున్నారు. కాని చీనాలో అనుభవం ఇంకా అమెరికన్లకు ఫలించలేదు. అమెరికన్లకు ఆ జ్ఞానోదయం కలిగేవరకూ ఆసియా దేశాలు సులువైన అల్పకాలికప్రణాళికల్ని అనుసరించక మరొకదారి లేదు. దీనికి జపాన్ మార్గదర్శిని. అయితే నిత్యమూ కుటీరపరిశ్రముల్లో స్వల్ప జీవన సదుపాయాలతో ప్రజల్ని తృప్తిపరచాలని కాదు. దేశం కోలుకు నేవరకైనా అది అవసర మౌతుంది. ఆపైన క్రమంగా దేశఆర్థికబలం వృద్ధిచెంది విదేశీయుల వరాలతో నిమిత్తంలేకుండా పెద్దకార్యక్రమాల్ని అమలుజరపడానికివీలు కలగవచ్చును.

మహాకవికాళిదాసునాటి విద్యలు


పి. వి. భట్టశర్మ

మానదేశంలో వేదకాలమునుండిన్నీ ఉపనయనసంస్కారంతో విద్యారంభం జరుగుతూండేది. ఈసంస్కారం ఆయావర్ణముల వారికి పలువిధాలుగా ఉంటూ వచ్చేది. వారిలో క్షత్రియుని విద్య ౧౧వఏటినుండి ప్రారంభమయ్యేది. విక్రమోర్వశీయత్రోటకంలో ఆయువు (పురూరవునిపుత్రుడు) ఆశ్రమ విద్యతోనే ధనుర్విద్యనుకూడా అభ్యసించినట్లు మహాకవిప్రయోగంవలన తెలుస్తున్నది.

ఆశ్రమాల్లో విద్య నేర్చుకొనే శిష్యురాండ్రు రెండురకాలుగా ఉండేవారని ధర్మసూత్రాలలో ఉన్నది. మొదటితరగతి వారిని సద్యోవధువులనేవారు. వీరు విద్యాభ్యాస మయినతరువాత గార్హస్థ్యం స్వీకరించేవారు. ఇక రెండవరకమువారు బ్రహ్మవాదినులు. వీరు జీవితాంతము బ్రహ్మచర్య మాచరించేవారట. ఇందుచేతనే "మీ చెలి వివాహమువఱకే వైఖానసవ్రత మవలంబిస్తుందా, లేక జీవితాంతమూ వ్రతంలోనే మగ్నమవుతుందా" అని దుష్యంతుడు శకుంతలచెలులను ప్రశ్నిస్తాడు. మహాకవికాలంలో సహవిద్య (*Co-education*) నిషిద్ధంకాదు. ప్రియంవద, అనసూయ, శకుంతలలు ఆశ్రమంలోని బ్రహ్మచారులతో కలిసే విద్య నేర్చారు.

ఆనాటివిద్యకు జ్ఞానము, వినయప్రాప్తి, పరమలక్ష్యాలు. కేవలం జ్ఞానోపార్జనవలననే వికాసం కలగదు; జ్ఞానంతోపాటు వినయంకూడా ఆవశ్యకమని ఆనాటివారి తలపు. ఈ జ్ఞానవినయాలు గురువుల సహవాసంవలన లభ్యమవుతూండేవి. ఊరకే పుస్తకాలు వల్లించిన మాత్రాన ఆరోజుల్లో విద్వాంసు లనిపించుకోడం కష్టంగా ఉండేది. చదువుకు సాయంగా రాగద్వేషాలు అణగేటట్లు తమ నడవడిని దిద్దుకొనేవారు. ఈ భావాన్నే మహాకవి "సమ్యగాగమితా విద్యా ప్రబోధవినయావివ" బాగుగా వచ్చిన చదువు ప్రబోధవినయాల నిచ్చినట్లు అనే ఉపమలో నిబంధించారు.

'విద్యా దదాతి వినయమ్' అనే సూక్తిని కాళిదాసు తమ గ్రంథాల భూమికల్లోనే చరితార్థం చేశారు. 'ఈ కాలానికి హద్దు లేదు, భూమి విశాల మయినది, నాతో సమానమైన భావాలుండేవాడు తప్పకుండా ఉంటాడు' అనే భవభూతిమాదిరి దర్పంతో ఎప్పుడూ ఈ కవికులతిలకులు మొదలుపెట్టరు. "కీర్తిగడించిన భాససౌమిల్లకకవిపుత్రుల ప్రబంధాలకంటె కాళిదాసుకబ్బంలో గౌరవమెందుకు? ఈ నాటకం పండితులను సంతోషపెట్టేవఱకూ బాగా ఉన్నదనుకోను"



అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ నూతన మంత్రివర్గ సభ్యులచేత దేశభక్తిప్రమాణాలు చేయించుతున్నారు. ప్రధాని నెహ్రూ ప్రమాణపత్రం చదువుతున

మున్నగు వినయవాక్యాలతోనే వీరు ప్రారంభిస్తారు. పురూరవుని దర్బారు. చిత్రరథుడనే గంధర్వరాజు ఇంద్రుని సందేశం పట్టుకొని రాగా మహారాజు చిత్రరథునకు స్వాగతమిస్తాడు. ఆ గంధర్వుడు రాజును శ్లాఘిస్తాడు. "ఇంద్రునిపక్షంలో వారు శత్రువులను గెలుస్తున్నారంటే; అదంతా ఇంద్రుని పరాక్రమ విశేషమే నని తన కృతజ్ఞతను పురూరవుడు ప్రకటిస్తాడు. 'వినయమే పరాక్రమానికి అలంకార' మని ఈసందర్భంలోని చిత్రరథుని వాక్యంలో కవి తన అభిప్రాయం తెలియచేసినట్లు అనిపిస్తుంది.

రఘువంశమే కాళిదాసుఅంతిమకావ్యం అంటారు. ఈ కావ్యం ప్రారంభంలో మహాకవి వినయమనే కొండకొనపైనుండి ఉపదేశమిస్తున్నట్లున్నది. చూడండి—"సూర్యవంశమెక్కడ? ఈ అల్పబుద్ధి ఎక్కడ? దుస్తరమైన సముద్రాన్ని లోతు తెలిసికోకుండానే తెప్పతో దాటుదామని యత్నిస్తున్నా. కవియశఃప్రార్థినై మందుడనైన నేను హాసయోగ్యుడనే, ప్రాంశువు పొందదగ్గ పండ్లను పొట్టివాడు చేతు లెత్తినంతనే పొందలేడుగదా" అని అంటూ తర్వాతకూడా "ప్రాచీన కవులు మాటలతలుపులు తెరిచిన ఈ సూర్యవంశంలో—వజ్రసముత్కీర్ణమైన మణిలో దారమునకువలె—నాకున్నూ గమనం లభ్యమవుతుంది" అంటారు.

త్రివర్గములకు మూలమైన మూడు విద్యలను పూర్వజన్మలోనే అంతుచూచినవి జ్ఞాపకం తెచ్చుకుంటూన్నట్లు గురువులకు కష్టమివ్వకుండా ఆ రాజు నేర్చాడట(రఘు ౧౮.౨౦) ఈ సందర్భంలో కవి మూడువిద్యలను ఉల్లేఖించి తమకాలపు విద్యావిధానం సూచించారు. వేదత్రయంనుండి ధర్మాధర్మాలు, దండనీతినుండి నయానయములు, వార్తనుండి అర్థానర్థాలు, నని మల్లినాథులు వ్యాఖ్యానించారు. దీనితోపాటు మహాకవి అక్కడక్కడ చతుర్దశ విద్యలనూ పేర్కొన్నారు. (౫-21) మీమాంస మాట నామగ్రాహం గ్రహింపకపోయినా, రఘువంశప్రారంభశ్లోకంలోనే మీమాంసలో కవినేర్పు స్పష్టమవుతున్నది.

శివతపోవర్ణనఘట్టంలో, 'వీరాసనం వేసి, దృష్టి తిన్నగా, నిశ్చలంగా ఉండేట్లు చేసి బాహువులు వంచి, అంకంపై చేర్చి రెండు చేతులూ కమలాకారంలో నిలిపి, ఈశ్వరుడు ధ్యానం చేశారట. పాతంజలంలో సరిగా ఇదే పద్ధతి నిర్దిష్టమైయున్నది. కుమారసంభవంలో 'గుణత్రయవిభాగాయ, —త్వా మామనంతి ప్రకృతిం' అనేవి, రఘువంశంలో "లోష్ట కాంచనముల్లో సమబుద్ధి గల రఘువు ప్రాకృతికమైన గుణత్రయాన్ని జయించెను' అనే వర్ణనకూడా ఆనాటి సాంఖ్యసిద్ధాంతప్రాబల్యాన్ని, కవికి సాంఖ్యంలో గల పరిచయాన్ని వ్యక్తపరుస్తున్నాయి.

"ప్రపంచానికి కారణమై, కారణము లేనివాడవు, ప్రపంచమున కంతకుడవై అంతములేనివాడివు" అని బ్రహ్మ చేసిన శివస్తోత్రము, విక్రమోర్వశీయనాందిలో "వేదాంతేషు యమాహు రేకపురుషం—" మున్నగునవి కవికి గల వేదాంతపరిచయానికి నిదర్శనలు. పై భావాలు 'యతోవాఇమాని భూతానిజాయంతే' అనే ఉపనిషద్వాక్యాలకువ్యాఖ్యానమే.

అర్థం తెలియకుండా వేదాన్ని అప్పచెప్పే ఛాందసులు ఆనాడూ ఉన్నట్లుగా 'వేదాభ్యాసజడు,లనడంవలన ఊహించవచ్చునేమో. 'సాంగం చ వేద మధ్యాప్య—అని వేదాంగాలు నిర్దేశింపబడ్డాయి. దిలీపుడు ప్రాతఃకాలమే నందినిని సేవిస్తూంటాడు. ముందు నందిని, వెనుక దిలీపుడు; నందిని డెక్కలనుండి వచ్చే ధూళి మార్గాన్ని పవిత్రం చేస్తున్నది. అదే మార్గంలో వస్తున్న సుదక్షిణ శ్రుతిని అనుసరించే స్మృతివలె వస్తున్నదట.

యుద్ధభూమిలో శత్రువ్యూహములను భేదించే వ్యూహాల అంతు, శాస్త్రముల అంతున్నూ ఈ బాలుడు చూడగలడని ఆలోచించే రఘువు అని పేరు పెట్టారట. (రఘి ధాతువు గమనార్థకము) ఈ విధంగానే మహాకవి తను వ్యాకరణపరిజ్ఞానాన్ని అక్కడక్కడ విశదీకరించారు.

శ్రీరామవివాహసందర్భం. నల్గురు రాజకుమారులను పరిణయమైన ఆ రాజకన్యలు ఆ కన్యలను పొందగల్గిన రాజకుమారులున్నూ నిస్తులు లయ్యారట. ఆ వధూవరుల మేళనము ప్రాతిపదికలతో ప్రత్యయములు కలిసినట్లున్నదట. వధూవరులు అనే రెండు ఉపమేయములకు ప్రత్యయప్రకృతులను ఉపమించారు. వరశబ్దం పుంలింగఏకవచనం. అట్లాంటి ప్రత్యయశబ్దాన్నే ఉపమానంగా వాడారు. ఈ విధంగానే స్త్రీలింగమైన వధూశబ్దానికి సరిగా స్త్రీలింగమైన ప్రకృతిశబ్దంతోనే సాదృశ్యం నిబంధించారు. ప్రకృతిప్రత్యయములవలన ఫలితం పదనిష్పత్తి. అట్లే వధూవరుల యోగంతో గృహస్థాశ్రమం సిద్ధమవుతుంది. ఈ రెండు ఉపమేయఉపమానాలకు యోగం సాధారణధర్మము; సన్నిభ మనేది ఉపమావాచకము. వ్యాకరణంవంటి పరుషశాస్త్రాన్ని కూడా తమ చమత్కారపూర్ణ ఉపమతో సరస మయ్యేటట్లు మహాకవి నిరూపించారు. ఈ అలంకారాన్ని 'పూర్ణోపమ'అని సాహితీశాస్త్రజ్ఞులు. ఇదే కాక 'ధాతోః స్థాన ఇవాదేశాత్' మున్నగునవి కవిసమకాలంలో వ్యాకరణమంటే కల ఆదరణ తెలియచేస్తున్నది. మహాకవిసమయంలో మనవిద్యల ఉన్నతస్థాయి నూహించుకోగలవారికి, పతనమైనమన నేటివిద్యావిధానం దృగ్గోచరమై హృదయావేదన ఎక్కువ కాకతప్పదు.



లండన్ జంతుప్రదర్శనశాలలోవున్న ఈ ధృవప్రాంతపు భల్లూకాన్ని టెలివిజన్ ద్వారా ప్రచారంచేసి పరదేశాలవారికి చూపుతున్నారు. దీని పేరు "బ్రూమాస్."

కులాసాకబుర్లు :

కష్టాలలో ఉన్న అదృష్టం

ఏమాటు మీకేదైనా "కష్టం"వచ్చి దాని వల్లే మీరు చాలా నాశనమయి పోయామనీ, దేవుడూ, విధీ, కర్మా, లోకమూ, అన్నీ కలిసి కూడబలుక్కొని మిమ్మల్ని అన్యాయంచేశాయనీ అనుకొనేటప్పుడల్లా, మా పిచ్చయ్యకథ కాస్త జ్ఞాపకం చేసుకొన్నారా, మీకు ఎక్కడలేని ఆశ పుట్టుకు వచ్చి, ఇల్లాటికష్టాలు ఇంకా ఎంతో ఎక్కువగా ఎంతో త్వరలో రావాలని, భక్తిపరులై దీక్షతో ప్రార్థనలు సాగిస్తారు.

అసలు పిచ్చయ్యపుట్టింది దరిద్రపు వంశంలో; దరిద్రపువంశంలో పుట్టటం ఒక దురదృష్టం అని మీ రనుకుంటారుకదూ! కాదు, అదే అదృష్టం-చూడండి - పిచ్చయ్య పద్దెనిమిదిమంది సంతానంలో కడగొట్టు బిడ్డ. ఒక్క చిన్న పాకలో ఆకుటుంబం అంతా ఉండేది. ఉన్న కాస్తలోనే అందరు పిల్లలూ తినాలి. అందువల్ల ఏమైంది అంటారు. ఉన్న కాస్తలో నలుగురిలో కలబడి తనకు తను సంపాదించుకు తింట మనే సుగుణం పిచ్చయ్యకు పదిమా పాల ఈడుకే ఆ గుడిసెలో అలవాటుపడింది.

అల్లా ఉండగా, పిల్లలకు పాలుదొరక్క తల్లి, గంజి, కొద్దిగా పాలసుండా బాగా నీళ్ళు, కలిపి పోస్తుండేది. పిచ్చయ్య బతికాడంటే అదే కారణం. ఎల్లా అంటారా, వినండి—ఆఏడు దేశంలో పిచ్చయ్య ఈడున ఉన్న బిడ్డలలో ఆవుపాలుగాని గేదెపాలుగాని తాగినపిల్లలంతా, పాలల్లో వచ్చిన అంటువ్యాధివల్ల వేసవికాలంలో పిట్టలు రాలిపోయినట్లు రాలిపోయారు. ఆవుపాల వాసనన్నా చూడ లేదేమో, పిచ్చయ్యవంక మృత్యువుకూడా తేరిపార చూడలేకపోయింది.

పిల్లలు బలంగానూ ఎత్తరిగానూ ఉంటే మంచిదనుకొంటారు చాలామంది పిచ్చివాళ్లు. కాని పిచ్చయ్య అతని పరిస్థితులధర్మమా, అనీ, ఆకళ్లు వచ్చేటప్పటికే ఆయీడు పిల్లలందరిలోకి ఒక్కగ్గా, పీలగా ఉండేవాడు. కాని పిల్లలమధ్య బతకాలంటే ఏదో ప్రతిభ తెచ్చుకోవద్దూ! అదేకాకుండా తల్లి దండ్రీ పిల్లలను భరించలేక గుడిసెలోనుంచి తరిమేశారు. పొట్టకూడా గడుపుకోవాలాయెను. దాంతో పిచ్చయ్య రైలుస్టేషనులో, పెట్టెలూ మూటలూ మొయ్యటం మొదలు పెట్టాడు. కూలి ఆశతో, ఎంత బరువైనా మొయ్యటం ఇట్టే అలవాటు చేసుకున్నాడు—ఇంకోళ్లవళ్లైనా అయితే ఏమనుకొనేవారు-వెధవబ్రతుకు ఎందుకొచ్చిన బ్రతుకు అనుకొనేవాళ్లు-కానీ ఏమైంది?—

ఒకసర్కసు మాఊరు వచ్చింది. దాంట్లో బరువు లెత్తే ఛాంపియన్ రైలువగ్గిర మూట మోసుకోలేక దిక్కులు చూస్తున్నాడు. పిచ్చయ్య ఇట్టే ఆప్యాకేజీ నెత్తి నెత్తుకొన్నాడు.— కానీ ఆ ఎత్తుకోటంలో పిచ్చయ్య మొగం, కాళ్లూ నడకతీరూ చూస్తే, ఆశ్చర్యం, అద్భుతాలకన్న హాస్యరసమే ఎక్కువగా కనబడింది ఆవస్తాదుకు. సర్కసులో బఫూన్ ఉద్యోగం ఇచ్చాడు.

అక్కడమాత్రం పిచ్చయ్యకు, దరిద్రం ఎల్లా అదృష్టం కూర్చిపెట్టిందో చూడండి. గోచీతో సర్కసులో బఫూన్‌గా పిచ్చయ్య వచ్చి ఫీట్సు చేస్తోంటే, ఖరీదుగల రంగు రంగుల డ్రస్సులు వేసుకొన్న బఫూన్లందరూ, పిచ్చయ్యముందర దివిటీముందర దీపాలయ్యారు. జనం అంతా పిచ్చయ్యరూపం చూసి, బరువుమోసే కుంటినడక చూస్తూంటే, నవ్వు పట్టలేక పొట్టపగిలేటట్టు నవ్వసాగారు. పిచ్చయ్య కన్నుమూసి తెరిచేటప్పటికి ఛాంపియన్ బఫూన్ అయిపోయాడు. ఒక్కసారిగా దేశంలోకల్లా "స్టార్ బఫూన్" అయిపోయాడు పిచ్చయ్య—

ఆ తర్వాత కొన్నాళ్ళు సమంగా సాగుతూనే వచ్చింది పిచ్చయ్యజీవితం. కాని ఏదో ఆపదరాందే, పిచ్చయ్య అదృష్టం పై సోపానం ఎక్కదని నాకూ తెలుసు అనుకొన్నట్టుగానే ఆ ఆపదకూవచ్చి ఆప్యాయంగా పిచ్చయ్యను ఆదుకొంది. అప్పటికే పిచ్చయ్య లక్షలుసంపాదించి "ఆర్బత్ నట్" బ్యాంకులో దాచుకొన్నాడు. ఒక్కరాత్రిలో ఆబ్యాంకు దివాలాతీసింది. పిచ్చయ్యలక్షలన్నీ అకస్మాత్తుగా మాయమయాయి. దానితో సర్కసు వదిలాడు. సినిమాలో చేరాడు. అతను ఉన్న సినిమా, జనంలో ఇట్టే అంటుకు పోయింది. పిచ్చయ్య గ్రేటెస్టు కామెడియన్ అయిపోయాడు. లక్షలకు కోట్లు వచ్చాయి పిచ్చయ్యకు.

అన్నిటికన్నా అదృష్టం అంటే సామాన్యుల దృష్టిలోదురదృష్టం పిచ్చయ్యకు ఈమధ్యే పట్టుకొంది. పిచ్చయ్యకు కాలి మీద వ్రణంవేసింది. మోకాలుదాకా తెగ గొట్టాలన్నారు డాక్టర్లు. ఇక పిచ్చయ్యపని ఆఖరనుకొన్నారు సినిమాప్రొడ్యూసర్లు కూడా.

కానీ కఱ్ఱకాలుతో కుంటుకుంటూ తెరమీద పిచ్చయ్య కనబడేటప్పటికే, ఈ కామెడియన్ పిచ్చయ్య ముందు మునుపటి కామెడియన్ పిచ్చయ్య గ్లాసులైటుకు ముందు కిరసనాయిల్ దీపంలా గున్నాడు అన్నారు జనం అంతా.

పిచ్చయ్య నడిగాను "ఏరా కొయ్య కాలుతో ఏక్టుచేయటం కష్టం కాదురా" అని.

"అబ్బాయి! మన మొహంలో ఎక్స్ప్రెషన్ కొయ్య ఎక్స్ప్రెషన్ కానంత కాలం ఏమీ ఫరవాలేదు. ఒకవేళ అయినా అదీ మరీ మెరుగే అనుకో" అన్నాడు—

పిచ్చయ్యది వేదాంతం అనుకొనేరు—అనుభవం మాత్రం—కష్టాలే మనిషికి అదృష్టం కూర్చిపెడతా యని—ఆపదలలో తప్ప అదృష్టం కలిసిరాబోదనీ—నిజమే అయి ఉండవచ్చు. ఆస్తులు కలిసి రావాలన్నా ఆపదలేగా ఆధారం!—

'ఇమిటేషన్'

మనదేశం

వ్యక్తి స్వత్వాల్ని గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కంటె దేశంలో కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికల హడావిడి అధికంగా ఉంది. ఆర్థిక కార్యక్రమాల గురించిన చర్చకంటె కోటీశ్వరుడు రామకృష్ణడాల్మియా పశ్చాత్తాపప్రకటనల గురించిన ఆందోళన వ్యాపారులకు అధికమయింది. ఆంధ్రదేశంలో కాంగ్రెస్‌వాదుల మధ్య సఖ్యత చేకూర్చాలని పటేల్ గారిచ్చిన సలహాని పాటించి ప్రకాశంపంతులుగారు మలయాళదేశం వెళ్లి, సఖ్యత లేకపోతే కాంగ్రెస్‌కి అధోగతి తప్పదని ఉపన్యాసాలిస్తున్నారు. ఇవి గమనించి కళావారు పటేల్ గారి వెంటే మలయాళదేశ పర్యటన చేసి కాంగ్రెస్‌లో సఖ్యతావసరాల్ని గురించి ఉపన్యాసాలిచ్చారు.

ఆంధ్రకాంగ్రెస్‌లో సఖ్యత సాధించడానికిగాను ముందుకా వెళ్లి పునాదివెయ్యండని పటేల్‌గారు ప్రకాశం, రంగా, కళా వెంకట్రావు గార్లకు ఆదేశమిచ్చారు. ఆమీదట పటేల్‌గారు మద్రాసుకు స్వయంగా వచ్చి ఆ పునాదిమీద సఖ్యతకోసం గోడలు మిద్దె ఎత్తగలరని మాట ఇచ్చారట. ఆప్రకారం సఖ్యతకోసం ముగ్గురు ఆంధ్రనాయకులు రాష్ట్రంలో సంచారం ఉపన్యాసాలు మొదలెట్టారు

అయితే సఖ్యత సాధించడానికి ఎవరివారు వారిదే. "నేను సిద్ధంగానే వున్నాను. వాణ్ణిముందు మాటాడమనండి" అన్నట్లు ఎవరిమట్టుకు వారు చెప్తున్నారు. ఎందులోను చలేకపోయిన లక్ష్యైక్యత పరస్పర ...ంలో మాత్రం ధారాళంగా లభిస్తోంది.

గుంటూరుజిల్లా గ్రామాల్లో సంచారం చేస్తూ కమ్యూనిస్టుల దాడుల్ని ప్రతిఘటించడంలో ప్రభుత్వంలో రాష్ట్రకాంగ్రెస్ సహకరించడం లేదనడం అబద్ధమని చెప్పారు. అసలు కమ్యూనిస్టుల్ని అణచడానికి కంకణం కట్టినవారు రాష్ట్రకాంగ్రెస్ వారే ననీ, కాని ప్రభుత్వమే వారి సహాయాన్ని నిరాకరిస్తున్నదనీ, తాము చేస్తున్న కృషితోనే రాష్ట్రకాంగ్రెస్‌ల్ని ఎప్పటికప్పుడు సర్దార్ పటేలికి చేరవేస్తున్నదనీ రంగాగారన్నారు. ఇంక వరసగలరు రాష్ట్రకాంగ్రెస్ ప్రభుత్వంతో సహకరించడం లేదని? ఇంతవరకూ ప్రభుత్వం ఎలా ప్రవర్తిస్తున్నా కేవలం దేశక్షేమం దృష్ట్యా రాష్ట్రకాంగ్రెస్ మౌనంగా ఊరుకుంది గాని ఇంకెంతమాత్రం సహించబోదని రంగాగారు ఆఖరుమాటగా చెప్పేశారు. ఇప్పుడు దూరుకోకపోవడానికి ఏమొచ్చిందంటే కాంగ్రెస్ పంచాయతీఎన్నికలు.


వీరికి తగినట్లే మంత్రులు కళావారు కూడా దేశాన్ని అంటిపెట్టుకోమన్నారు. కళా వెంకట్రావుగారు ఆలిండియా కార్యదర్శిగారు కాబట్టి అన్యరాష్ట్రాలుకూడా సంచారం చేస్తూ, అటువెళ్లేటప్పుడోకసారి ఇటువచ్చేటప్పుడోకసారి ఆంధ్రదేశంలో అడుగెట్టి మంత్రులికి మాట సహాయం కార్యసహాయం చేసిపెడుతున్నారు. జిల్లానాయకులు ఫిర్కానాయకులు మొదలైన చోటానాయకుల్ని ముందుపెట్టి మంత్రులు వెనుకనుండి ఒక ఎత్తువెయ్యడం, రాష్ట్రకాంగ్రెస్‌పై ఎత్తువెయ్యడం, అపైన ఆలిండియా కాంగ్రెస్ కళావారు తురుపు ఉపయోగించడం, అపైన రంగాగారో ఓబులరెడ్డిగారో తిమ్మారెడ్డిగారో "ఘోరం, అన్యాయం" అంటూ ప్రకటనలు చెయ్యడం దేశంలోను పత్రికల్లోను పరిపాటయిపోయింది. ఈ రగబ్బులో రంగాగారివర్గం ఆఖరేననీ, వినాశకాలం కాబట్టి వారికి విపరీతబుద్ధులు పుడుతున్నాయనీ మంత్రి సంజీవరెడ్డిగారు కసితీర ప్రకటనచేశారు. మొత్తానికి రంగావర్గానికీ, మంత్రికీ కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ మంచిజోరగా సాగుతోంది. రాష్ట్రకాంగ్రెసువారు రిటర్నింగ్ ఆఫీసర్లని నియమించడం, మంత్రివర్గం వారి "ఒత్తిడి" వల్ల వారిలో కొందరు రాజీనామా లివ్వడం, టెలిగ్రాములు ట్రంక్‌టెలిఫోన్ల ద్వారా కొత్తవారిని నియమించడం, గుంటూరుజిల్లాలో ఒక ఫిర్కాలో 59 వేల మంది సభ్యులు మసర్దులని రాష్ట్రకాంగ్రెస్ రంగాగారు నిర్ణయించడం, ఎన్నికలు ముందుపెట్టుకుని ఇలా సభ్యత్వాలు రద్దుచెయ్యకూడదని ఆలిండియా కాంగ్రెస్ కళావారు ఉత్తరువు చెయ్యడం, తీరా ఉత్తరువుకి కాలదోషం కాని మరోకదోషంకాని పట్టించి మూల నూకేస్తారనే భయంతో తమ ఉత్తరువుతోబాటు రాష్ట్రకాంగ్రెస్‌వారు సభ్యత్వరద్దులు వద్దయిపోయినట్లేనని కళావారు పత్రికా ప్రకటన చెయ్యడం ఈ కాండంతా కాంగ్రెస్ ఎన్నికల పోరులకి ధర్మామీటరన్నమాట.

ప్రకాశంగారి తీర్మానం ఈఎన్నికలతిరనాళ సంరంభం ఎక్కువౌతున్న సమయంలో చడీచప్పుడూ కాకుండా ప్రకాశంగారి శాసనసభతీర్మానం పులుసులో పడిపోయింది. మంత్రులపైన విచారణ జరిపించాలని సూచించే చేతనుతీర్మానాన్ని శాసనసభలో ఉపసంహరించుకున్నారనేమాట పద్ధ అబద్ధమని ప్రకాశంపంతులుగారు ఢిల్లీనుంచి రాగానే పత్రికప్రకటనచేశారు. అయితే తమతీర్మానం పులుసులో పడిపోతుందని వరితెలిసికూడాగాన్ని గురించి ఏమీ చెప్పలేదు. ఏమీ తెలియనట్లు శాసనసభ బడ్జెట్ సమావేశాన్ని ముగింపచేశారని ఒక రోజున గవర్నరుగారు ప్రకటించారు అంటే అప్పుడు జరిగినది

ఇంద్రజాల మహిమ

ఈ ఉపోద్ఘాతగ్రంథము ఉచితం


దానిలోమంత్రవిద్య,యోగనిద్ర,మనోశక్తి భావనాబలం మొదలైనవి వివరింపబడినవి. ఈ మానసిక



శాస్త్రముగురించి అనేక అద్భుతవిషయములు కలవు. ఈ శక్తులతో ఎటువంటి మహత్కార్యములు సాధింపవచ్చునో ఫోటోగ్రఫి చిత్రములు గూడ ముద్రింపబడినవి, తక్కువ చార్జీలతో ఈ విషయములన్నీ మీరు మావద్దనుండి పోస్టుద్వారా తెలిసికొనవచ్చును. మీ అంతశ్శక్తులను వికాసపరచుకొని యితరులను వశపరచుకొనదలచినచో గాని, ఆరోగ్యము, సౌఖ్యము పొందగోరినగాని, ఉచితముగా పంపబడు యీపుస్తకంకోసం నేడే వ్రాయండి.

Prof. M. S. Rao,

Chandpole Bazar (15), Jaipur City.



ఢిల్లీకివచ్చిన పాకిస్తాన్ పత్రికా సంపాదకులను, భారతవిదేశాంగ కార్యదర్శి మీనన్ గారు మొన్నటి 5 వ తేదీన విందుచేశారు ఆ విందుకు పాకిస్తాన్ హైకమిషనర్ మహమ్మద్ ఇస్మయిల్, భారత సర్వసేనాని కరియప్ప మొదలైన ప్రముఖులంతా హాజరైనారు.

ముగింపుకాదు. తాత్కాలికంగా పడిన వాయిదా మాత్రమే. ఆవాయిదాకీ ఈ ముగింపుకీ తేడా ఏమిటంటే, వాయిదా వేస్తే పూర్వకార్యక్రమం తీర్మానాలు, బిల్లులు, ప్రశ్నల జాబితాలు ఏది ముందు ఏది తరవాత అని లాటరీవేసి (శాసనసభ పరిభాషలో బాలట్ అంటారు) చేసిన నిర్ణయాలు ఎప్పటిమాదిరిగానే ఉండి వాయిదాఅనంతరం సమావేశంలో అన్నీ ఆ క్రమంలో నే వస్తాయి. ముగింపుచేస్తే ఆ క్రమం, ఆతీర్మానాలు ఆబిల్లులు ఆ ప్రశ్నల జాబితాలు అన్నిటి నోటీసులో రద్దవుతాయి. మళ్లీ సమావేశమైనప్పుడు కొత్తగా నోటీసు నివ్వడం, ఏది ముందో ఏది వెనకో నిర్ణయించడానికి మళ్లీ లాటరీ వెయ్యడం అన్నీ జరగాలి. కాబట్టి గవర్నరుగారి ప్రకటనతో ప్రకాశం గారి తీర్మానం దానంతటదే రద్దయిపోయిందన్నమాట. అయితే ముఖ్యమంత్రి ప్రకాశం గారు కోరినట్లయితే ఈమారు సమావేశంలో మళ్లీ విరామతీర్మానం ద్దగ మొదలెట్టి అనధికార తీర్మానంవరకూ అన్నిరకాల నోటీసులూ ఇవ్వవచ్చును.

స్వామీజీ ఆదేశం *

ఈమధ్యనే ఆత్మస్వరూపజ్ఞానసిద్ధి పొంది, సర్దార్ బిరుదాన్ని త్యజించి స్వామిబిరుదాన్ని స్వీకరించిన శ్రీ గొల్లపూడిసీతారామశాస్త్రిగారు 1951 మే మాసంతంలోగా కేంద్రప్రభుత్వం ఆంధ్రరాష్ట్రాన్ని ఇవ్వక పోయినట్లయితే అహింసాత్మకమైన సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించ సంకల్పించినట్లు తెలిపి, ఇందులో తమకు తోడ్పడాలని ప్రజల్ని, నాయకుల్ని ఆదేశించారు. ఆగడువులోగా అనధికార రీత్యా ప్లెబిసైట్, (జనవాక్యనిర్ధారణ) జరపడానికూడా వారు సంకల్పించారు. ధర్మాన్ని కాపాడడానికి దీక్షవహించేవారు అసమర్థులైతే ధర్మహాని సంభవించినట్లుగా, ఆంధ్రరాష్ట్రోద్యమం కాంగ్రెసు అధ్వర్యం కింద భంగపడింది. ఇంకనైనా ఉట్టికెక్కలేనమ్మలు స్వర్గారోహణయత్నాలు విరమిస్తే మేలు. స్వామి సీతారామశాస్త్రిగారి జనవాక్యనిర్ధారణ సత్యాగ్రహాలు దివాస్వప్నాలు. వాస్తవంగా కాంగ్రెస్ అగ్రనాయకవర్గం భాషారాష్ట్రనిర్మాణ సిద్ధాంతాన్ని బహిరంగంగా పరిహరిస్తే, కాంగ్రెస్‌సంస్థను త్యజించి రాగల ఆంధ్రదేశనాయకులు ఈనాడెంత మంది ఉన్నారు? దీన్నిబట్టి ఆంధ్రరాష్ట్రోద్యమబలాన్ని నిర్ణయించుకోవలసిందే. ఈ బలంలేని ఉద్యమం కేవలం రామరాజ్యం, ఖద్దరు, సర్వోదయంవగైరా దంత పాటదికే వస్తుంది అప్పుడు. పటేల్ గారు తుంటనికొడితే పళ్లు రాలతాయనే సతని అక్షరాలా అంగీకరించక మార్గాంతరం లేదు. అంటే దక్షిణాదిని భాషారాష్ట్రాలేర్పడితే ఉత్తరాది రాష్ట్రాలకి ముప్పు వస్తుందని పటేల్ గారు మళయాళ దేశంలో చెప్పిన సూక్తిని అంగీకరించి తలొగ్గవలసిందేనన్నమాట. అంతే కాని ఈమాదిరి అర్థమనస్కయత్నాల వల్ల రాష్ట్రవ్యవహారానికే హాని. కాబట్టి కాలం అనుకూలించిందని ఢిల్లీవారికి తోచే వరకు మిన్నకుండడం ఇంతంటే మేలు.

(సీతారామ్)

నేటి ప్రపంచం

(7వ-పేజీ తరువాయి)

దని అమెరికా గ్రహించింది. పశ్చిమయూరప్ భవితవ్యంతో అమెరికా తన భవితవ్యాన్ని ముడివెయ్యకపోతే పశ్చిమయూరప్ అమెరికాతో అన్నివిధాలా సహకరించదనీ, తిరిగి జాతీయవిద్వేషాలు అంతఃకలహాలు చెలరేగగలవని స్పష్టపడింది.

ఈ అవసరాల్ని తీర్చడానికి అట్లాంటిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆర్థికంగా మార్షల్ సహాయం సైనికంగా ఆయుధ సహాయం సైనికబలసమీకరణ, రాజకీయంగా పశ్చిమయూరోపియన్ రాజ్యకూటం ఈమూడింటి ఆశయాలను సాధించగల "సూపర్ అట్లాంటిక్ యూనియన్" ఒకటి స్థాపించడానికి సూచనలు చెయ్యబడినాయి.

ఈప్రయత్నానికి పోలినది ఇటీవల భారతదేశంలోనే జరిగింది. స్వదేశసంస్థానాలు భారతఅధినివేశంలో చేరినప్పుడు దేశరక్షణ, అంతర్జాతీయవ్యవహారాలు, రవాణాసౌకర్యాలకు సంబంధించినంతవరకూ పాలనాధికారాన్ని ఈసంస్థానాలు భారతప్రభుత్వానికి ఒప్పగించాలన్నారు. హైదరాబాద్ అంగీకరించలేదు. నవాబు తన రాయబారుల్ని విదేశాలలో నియమించడానికి యత్నించాడు కాని తరువాత అన్నిసంస్థానాలూ అధినివేశంలో చేరిపోయాయి. రిపబ్లిక్ వ్యవస్థ ప్రారంభించడంతో రాష్ట్రాలలో వలెనే ఎక్సైజ్ పన్నుల వసూలు, రాబడి పన్నులవసూలు రైల్వేవగైరా కేంద్రాధికార విషయాలన్నిటినీ సంస్థానపాలకులనుంచి భారతప్రభుత్వం హస్తగతం చేసుకుంది.

పాలనాధికారాలలో కొన్నిటిని అన్యప్రభుత్వానికి ఒప్పగించడం అంటే రాజకీయస్వాతంత్ర్యంలో కొంత పోగుట్టుకోవడమన్నమాట. భారతదేశంలో జాతీయైక్యతను సాధించడానికి గాను ఇది అవసరమయింది. అదేరీతిగా కమ్యూనిజంనుంచి శ్వేతజాతుల్ని రక్షించాలంటే అట్లాంటిక్ పాక్ట్ ప్రభుత్వాలన్నీ కలిసి, ఆర్థికాభివృద్ధి కార్యక్రమనిర్వహణాలను, దేశరక్షణను, అంతర్జాతీయవ్యవహారాలలో అందరూ ఒక తాటిమీద నడవడానికి ఒక కేంద్రసంస్థను స్థాపించుకోవాలనీ, ఈ మూడు కర్తవ్యాలనూ ఆ సంస్థకు ఒప్పగించాలనీ అమెరికా ప్రతిపాదించింది. ఈవిషయమై ఇంకా తగిన చర్చలు పూర్తి కాలేదు. అగ్రరాజ్యవిదేశాంగమంత్రిత్రయం ఈ సంస్థస్థాపనకు మూలసూత్రాలను అంగీకరించాక. అంగీకరించిన సూత్రాలను అట్లాంటిక్ కౌన్సిల్లో చర్చించారు. అట్లాంటిక్ పాక్ట్ దేశాలన్నీ సుముఖంగానే ఉన్నాయి.

అట్లాంటిక్ కౌన్సిల్ ముఖ్య సైనిక కార్యక్రమాల్ని చర్చించి నిర్ణయాలు చేసింది. జర్మనీ ఆస్ట్రియాసిమలల సందర్భంలో ముగ్గురు మంత్రులూ చేసిన నిర్ణయాలను కౌన్సిల్ కు ఎరుకపరిచారు.

1952లో మార్షల్ ఆర్థికసహాయ కార్యక్రమం అంతమైనప్పుడు మరోరూపంలో అట్లాంటిక్ పాక్ట్ దేశాలన్నిటికీ ఆర్థికసహాయమివ్వగలరని అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఎచిసన్ వాగ్దానమిచ్చారు.

అట్లాంటిక్ పాక్ట్ దేశాల విదేశాంగమంత్రులతరఫున డిప్యూటీలను నియమించడానికి నిశ్చయించబడింది. ఈ డిప్యూటీల కౌన్సిల్ పైన చెప్పబడిన సూపర్ అట్లాంటిక్ యూనియన్ కు ప్రాతిపదిక కాగలదు. అట్లాంటిక్ డిప్యూటీల కౌన్సిల్ కార్యాలయం లండన్లో నెలకొల్పబడుతుంది. ఆర్థికవ్యవహార సమీకరణకు యూరోపియన్ ఆర్థికసహకారసంస్థ (ఆర్గనైజేషన్ ఫర్ యూరోపియన్ ఎకనమిక్ కో ఆపరేషన్ లేక ఓ. ఇ. ఇ. సి.) ప్రాతిపదిక కాగలదు. ఈ సంస్థలో చేరవలసిందిగా లాంఛనప్రాయంగా బ్రిటన్ ఫ్రాన్సులు కెనడా అమెరికాలను ఆహ్వానించాయి.

డిప్యూటీల అట్లాంటిక్ హైకమాండ్ ముఖ్యంగా కర్తవ్యాలు నిర్వహించాలని విధించబడింది. 1. అట్లాంటిక్ పాక్ట్ దేశాల దేశరక్షణకార్యక్రమాలను పరిశీలించి సమీకరించడం; 2 సైనికసమీకరణనిమిత్తం అమలు జరపవలసిన కార్యక్రమాలను ఆయాప్రభుత్వాలకు సూచించడం; 3. అట్లాంటిక్ పాక్ట్ దేశాలన్నిటికీ సంబంధించిన రాజకీయ వ్యవహారాలను పరిశీలించడం; 4. విభిన్న పశ్చిమయూరోపియన్ సంస్థలనిర్మాణసంస్కరణలను సూచించడం.

ఈ కార్యక్రమాల్ని నిర్వహించగల సమర్థుడు అతీతప్రజ్ఞగల నాయకుడై ఉండాలని వారి ఉద్దేశం. విశేషప్రజ్ఞగల వ్యక్తికోసం అట్లాంటిక్ పాక్ట్ దేశప్రభుత్వాలు శ్వేతజాతులన్నిటినీ గాలిస్తున్నాయి. అంటే కమ్యూనిస్టుల పరదైవమైన స్టాలిన్ కి ప్రత్యర్థిగా నిలబడగల ఒక అతీతవ్యక్తికోసం పాశ్చాత్యసమాజంలో వెదుకుతున్నారన్నమాట

[సూర్యనారాయణ]



తెలంగాణా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సర్దార్ జమలాపురం కేశవరావుగారు పాల్వంచ తాలూకాలో పల్లె గామ ప్రజలతో కమ్యూనిస్టుల ఘాతకచర్యల విషయాల్ని ముచ్చటిస్తున్నారు. కేశవరావుగారు మధ్యన కూర్చున్నారు.

లేఖలు

"సాహిత్యంలోనీతి-ప్రయోజనము"—విమర్శ

ఆర్యా,

తే. 19-4-50 బుధవారం ప్రచురితమైన "ఆంధ్రవారపత్రిక" లో శ్రీ బసిరెడ్డి ఈశ్వర రెడ్డిగారిచే రచియింపబడిన వ్యాసం ప్రచురితమైనది. ఆ వ్యాసధోరణి బట్టి చూడ వారికి కమ్యూనిష్టులపైగల క్రోధము ద్యోతక మగుచున్నది గాని, వా రుద్దేశించిన ప్రయోజనము నెరవేరినట్లు కనిపించదు. వ్యాసంలో రచయిత విప్లవాత్మకరచనలను, కవులను ఘాటుగా విమర్శించితి మనుకొనిన ట్లున్నారు.

మచ్చుకి—

"యిటువంటి అవిశాల హృదయులు వ్రాసిన విప్లవగేతాలు, జాతీయగేయాలు అనేకం నిర్జీవంగా పుట్టుకొస్తున్నవి" అన్నారు. అవిశాలహృదయం ఎవరిదో అటుంచగా, విప్లవగేయాలు నిర్జీవంగా పుట్టుకొస్తున్న వనటం ఎంత సబబుగా వున్నదో పాఠకు లూహించగలరు. "శ్రీశ్రీ", "ఆరుద్ర" గార్ల గేయాలుగాని, "కొడవటిగంటి" లాంటివారి రచనలనుగాని రచయితగారు చూచియుండినచో యీమాటల నన సాహసించి యుండరు.

"చర్విత చర్వణమైన భావాలుగల విప్లవరచనలతో సాహిత్యం కలుషితమైదన్నారే!" అదే వ్యాసంలో వారు వ్రాసిన "కోయిలలు కూస్తయ్, మయూరాలు నృత్యం చేస్తయ్, ఉషాదేవత సౌగారుణ శోభలో దరహాసా న్నొలికిస్తుంది, చంద్రిక అమృతి మయ ప్రకాశాన్ని చిలికిస్తుంది" అన్న భావాలన్నీ చర్వితచర్వణములా? వినూత్నరత్నములా?

"మానవహృదయాలు సుత్తికొడవలి భాయీలు భావించు మన్నంత నీరసమైనవా?" అని ప్రశ్నించారు. సుత్తికొడవలి భాయీలు మానవ హృదయాలను ఎంత నీరసంగా భావిస్తున్నారని రచయిత తలపోయుచున్నారో వారికె తెలియవలయును. విప్లవ సాహిత్య కారకులెల్లరు కమ్యూనిష్టులనియే రచయితఅభిప్రాయమా? అయినచో వారి అజ్ఞానమునకు విచారించుచున్నాము.

ఇంకను పోగా "నీతులనే గీటురాయిగా భావిస్తే, మహాభారత రామాయణములు మహాకావ్యములుగానే రెక్కింపబడజాలవు" అన్నారు. హతోస్మి! అవి మహాకావ్యములని లెక్కింపబడుట నీతులనుగాక బూతులను గీటురాళ్లుగా తీసుకొనుటగానే! భ్రాతృ ప్రేమ, సత్యనిరతి, ధర్మనిరతి, పితృవాక్య పరిపాలన, పతిభక్తి మొదలైనవన్నీ అవినీతు లనియే వారి తాత్పర్యము.

"క్షుద్రమైన నీతికి అతీతమైనదే సాహిత్యము" అనిరి. నీతి క్షుద్రము. చక్కని నిర్వచనమే. అందుచేతనే గాబోలు భారతమున నీతి కన్పించకపోయినది. నీతికి అతీతమైనదే సాహిత్యమట. దీనిని ఎందరు ఒప్పుకొనగలరో ఊహించియే వ్రాసిరా?

"కొన్ని నైతిక సూత్రాలు, ప్రయోజనాలు ఆదర్శంగా నిర్ణయించుకొనబడిన శ్రేష్ఠమైన రచన యేదీ లేదు" అనిరి.

రామాయణ భారతములలోనే నీతి లేదని ఒప్పుకొనిన దీనిని ఒప్పుకొన నభ్యంతరమేమియు నుండదు.

"మన సాహిత్యం ఇంత గతివిహీనం కావటానికి కారణం యిదే" అన్నారు. ఎంత గతివిహీన మైనదట!

"హరిశ్చంద్రుని చరిత్ర కనీసం మనలో భావసంచలనమునైనా కల్గించదు" అనిరి. కేవలం శృంగారరసపూరితచరిత్రలే భావసంచలనపరంపరలను యివ్వగలిగినవా?

వీరికి గల వ్యాసరచనాకుతూహలమున యుక్తాయుక్తములను సహేతుకముగ విమర్శింపలేకపోయి రని చింతించుచున్నాము.

భట్టారం రాధాకృష్ణయ్య



ఆంధ్రరాష్ట్రములో ప్రథమమున స్థాపితమైన స్త్రీ వయోజన విద్యాకేంద్ర సిబ్బంది. ప్రధానోపాధ్యాయిని కామరాజు వరలక్ష్మీదేవిగారు మధ్య కూర్చున్నారు.

వార్తా చిత్రాలు



వార్తా ప్రచారశాఖామంత్రి శ్రీ ఆర్. ఆర్. దివాకర్ మే 13 న కలకత్తాలోని ప్రభుత్వభవనంలో కలకత్తా పత్రికా సంపాదకుల ఎదుట ప్రసంగించారు.



వాషింగ్టన్‌లో లియాఖతాలీ దంపతులకు అచిసన్ దంపతులు ఆండర్సన్ భవనంలో విందుచేశారు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.